హైడ్రా అధికారాలేంటి?

- దానికి ఉన్న చట్టబద్ధత ఏమిటి?
- ఏ అధికారంతో కూల్చివేతలు?
- చర్యలన్నీ చట్టప్రకారం ఉండాల్సిందే
- ప్రభుత్వశాఖల్లో సమన్వయమేది?
- హైకోర్టు ప్రశ్నలతో హైడ్రా ఉక్కిరిబిక్కిరి
- ఇప్పటిదాకా ఎన్ని కూల్చేశారు?
- అందుకు నిబంధనలు టించారా?
- పూర్తి వివరాలు సమర్పించండి
- ప్రభుత్వానికి న్యాయమూర్తి ఆదేశం



హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): అక్రమ కట్టడాల కూల్చివేతలో హైడ్రా తీరుపై హైకోర్టు పలు సందేహాలు లేవనెత్తింది. హైడ్రాకు ఉన్న చట్టబద్ధత ఏమిటో చెప్పాలని ప్రశ్నించింది. ఏ అధికారం కింద కూల్చివేత చర్యలు చేపడుతున్నారన్న వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఒక ప్రభుత్వశాఖ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేస్తుంది.. మరో శాఖ ఆ స్థలంలో నిర్మాణాలకు అనుమతిస్తుంది.. ఇంకో ప్రభుత్వశాఖ వచ్చి అది అక్రమ నిర్మాణం అని కూల్చివేస్తుంది. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవటంతో చివరికి జనం ఇబ్బందులు పడుతున్నారంటూ తప్పుపట్టింది. ఎఫ్‌టీఎల్‌ను ధ్రువీకరిస్తూ జారీచేసిన నోటిఫికేషన్లను సమర్పించాలని అడిగితే అధికారులు ఇవ్వకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం జన్వాడలోని సర్వే నంబర్ 311(311/7)లోని 1,210 చదరపు గజాల్లోని 3,894 చదరపు అడుగుల ఫాంహౌస్ కూల్చివేతకు అధికారులు చర్యలు తీసుకోకుండా ఉత్తర్వులు జారీ చేయాలంటూ హైదరాబాద్‌కు చెందిన బద్వేలు ప్రదీప్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ప్రతివాదులుగా రాష్ట్ర ప్రభుత్వం, హైడ్రా కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, లేక్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు, శంకరపల్లి తహసీల్దార్, చీఫ్ ఇంజినీర్‌ను చేర్చారు. దీనిపై జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి.. ఫాంహౌజ్ కూల్చివేతపై నిబంధనల ప్రకారమే చర్యలు తీసుకోవాలని హైడ్రాకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు ఉంటే నిబంధనల ప్రకారం నోటీసులు జారీచేసి.. చట్టప్రకారం అనుసరించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. విక్రయ దస్తావేజులు, నిర్మాణ అనుమతులు, ఇంటి పన్ను రశీదు.. మొదలైన వాటిని పరిశీలించాకే తగిన నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ఈలోగా హైడ్రా లేక ఇతర అధికారులు కూల్చివేత చర్యలకు ఉపక్రమిస్తే పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించేందుకు వెసులుబాటు కల్పించారు. ఫాంహౌస్‌కు సంబంధించి తీసుకునే చర్యలు హైడ్రా ఏర్పాటుకు చెందిన జీవో 99 ప్రకారమే ఉండాలని తేల్చిచెప్పారు. ఫాంహౌజ్ ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్టు ప్రాథమిక, తుది నోటిఫికేషన్ల జారీ చేసి ఉంటే అవి ఎప్పుడు జారీచేశారో.. వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. తదుపరి విచారణను సెప్టెంబర్ 12కు వాయిదావేశారు.

రాజకీయ కుట్ర.. పిటిషనర్ వాదన


హైడ్రాకు ఉన్న చట్టబద్ధత ఏమిటో చెప్పాలన్న కోర్టు ఆదేశాలపై మధ్యాహ్నం తిరిగి విచారణ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. హైడ్రా ఏర్పాటుకు ప్రభుత్వం గత నెల జీవో 99 జారీ చేసిందని తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఇతర మున్సిపాలిటీలకు హైడ్రా సమన్వయకర్తగా వ్యవహరిస్తుందని చెప్పారు. జీహెచ్‌ఎంసీ నోటీసులు జారీ చేస్తుందని, తదుపరి చర్యలు హైడ్రా తీసుకుంటుందని, చట్ట నిబంధనలకు అనుగుణంగా చర్యలు ఉంటాయని వివరించారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది వీ హరిహరన్ వాదిస్తూ.. పిటిషనర్ ఫాంహౌజ్ నిర్మాణానికి 2014లో గ్రామపంచాయతీ అనుమతులు లభించాయని, ఫాంహౌజ్‌ను 2019లో పిటిషనర్ కొనుగోలు చేశారని వెల్లడించారు. ఫాంహౌజ్ పక్కనే 3.30 ఎకరాలను పిటిషనర్ కొనుగోలు చేసి ప్రహరీ గోడ నిర్మించారని తెలిపారు. హైడ్రా వెబ్‌సైట్‌లో ఫాంహౌజ్ ఉన్న భూమి (సర్వే నంబర్ 311)ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో లేదని వివరించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఒక నాయకుడికి పిటిషనర్ సన్నిహితుడు అయినందునే రాజకీయ కక్షతో, రాజకీయ దురుద్దేశాలతో ఫాంహౌజ్ కూల్చివేయాలని ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని వాదించారు. గతంలో కూల్చివేత ప్రయత్నాలు జరిగాయని, దీనికి సంబంధించి ఎన్జీటీ జారీచేసిన ఉత్తర్వులను ఇదే హైకోర్టు రద్దు చేసిందని గుర్తుచేశారు. ఏఏజీ కల్పించుకుని ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలపైనే చర్యలు తీసుకుంటున్నామని, ఇదేమీ కక్షసాధింపు, వివక్షపూరితం కాదని అన్నారు. ఈ దశలో కల్పించుకున్న న్యాయమూర్తి.. ఇప్పటివరకు ఎన్ని అక్రమ కట్టడాలను గుర్తించారో, ఎన్నింటికి జీహెచ్‌ఎంసీ, మున్సిపల్ అధికారులు నోటీసులు జారీచేశారో, ఎన్నింటిపై చర్యలు తీసుకున్నారో వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

హైడ్రా విశ్వసనీయతను చాటుకోవాలి: హైకోర్టు

'హైడ్రాకు ఉన్న పరిధులు ఏమిటి? హైడ్రాకు ఉన్న అధికారాలు ఏమిటి? డబ్బు కూడబెట్టి రిజిస్ట్రేషన్ ఆఫీసులో స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆపై, సంబంధిత స్థానిక సంస్థ కార్యాలయ అనుమతితో నిర్మాణం చేస్తే నోటీసులు కూడా ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారు? అక్రమ కట్టడాలైనా చట్టప్రకారం చేయాలి కదా? కూల్చివేతలకు ముందు సంబంధిత అధికారి చట్టప్రకారం భవన యజమానికి నోటీసు ఇవ్వాలి కదా? నోటీసు ఇవ్వకుండా కూల్చివేయొచ్చా? ఏ అధికారం కింద కూల్చివేస్తారు? నోటీసు ఇవ్వాలి. ఆక్రమణదారుల, అనధికార నిర్మాణదారుల హక్కుల పత్రాలను ప్రాథమిక పరిశీలన చేయాల్సిందే. జీహెచ్‌ఎంసీ, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల నుంచి భవన నిర్మాణాలకు పొందిన అనుమతులతోపాటు ఆ స్థలాల రిజిస్ట్రేషన్ దస్తావేజులను కూడా పరిశీలించాలి. ఆపై, అది అక్రమమో, సక్రమమో అధికారులు తేల్చాలి. ఆ తర్వాతే కూల్చివేయాలన్న నిర్ణయానికి వచ్చినప్పుడు చట్టప్రకారం గడువు ఇచ్చి చేయాలి కదా? ఏకపక్షంగా కూల్చివేతలు చేస్తున్నారనే అభిప్రాయం ఏర్పడకుండా కూడా చేయాలి కదా? నిర్మాణాలు జరిగిన 15-20 ఏండ్ల తర్వాత హైడ్రా వచ్చి అక్రమ నిర్మాణమని కూల్చివేయటం ఏమిటి? ఫాంహౌజ్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నదని ఎలా నిర్ధారణకు వచ్చారు? ఈ మేరకు ప్రాథమికంగా నోటిఫికేషన్ జారీ చేశారా? ఎప్పుడు చేశారు? ఏ నిర్ధారణకు రాకుండా కూల్చివేత చర్యలు ఎలా చేపడతారు? ఫాంహౌజ్ స్థలం రిజిస్ట్రేషన్‌కు డబ్బులు తీసుకున్నారు. పదేండ్లుగా ఇంటి పన్ను కట్టించుకున్నారు. ఇప్పుడు ఒక్కసారిగా హైడ్రా వచ్చి అక్రమ నిర్మాణమని చెప్పి కూల్చేస్తామంటే ఆ వసూళ్లకు అర్థం ఏమిటి? అది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం కాదా?' అంటూ ప్రభుత్వాన్ని, హైడ్రాను హైకోర్టు ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసింది. 60-100 గజాల జాగా ఉన్నవారి విషయంలో ఒకలా, ఎకరా భూమిలోని నిర్మాణం ఉన్నవారి విషయంలో మరోలా వ్యవహరించటానికి వీల్లేదని తేల్చిచెప్పింది. కూల్చివేతల వ్యవహారంపై లోతుగా విచారణ చేయాల్సిన అవసరం ఉన్నదని తెలిపింది. పిటిషనర్ పేర్కొన్న ఫాంహౌజ్ 2014లో నిర్మాణం జరిగిందని, అంటే పదేండ్లుగా ఆ ఫాంహౌజ్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నదని అధికారులకు గుర్తుకు రాలేదా? అని నిలదీసింది. జీవో99లో పేర్కొన్న నిబంధనలను హైడ్రా కచ్చితంగా అమలు చేయాలని, ఇప్పటివరకు హైడ్రా ఎన్ని కట్టడాలను కూల్చివేసింది? అన్ని కూల్చివేత చర్యల్లో చట్టనిబంధనలను అమలు చేశారా? అని ప్రశ్నించింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అదేవిధంగా జన్వాడ ఫాంహౌజ్ ఎఫ్‌టీఎల్ వివరాలు కూడా సమర్పించాలని స్పష్టంచేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎఫ్‌టీఎల్‌ను నోటిఫై చేస్తే ఆ వివరాలు కూడా అందజేయాలని వెల్లడించింది. ఇదే సమయంలో తన ఫాంహౌజ్ కూల్చివేయకుండా మధ్యంతర స్టే ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరగా, అక్రమ కట్టడాల కూల్చివేత చర్యలు అడ్డుకోబోమని, స్టే ఉత్తర్వులు జారీ చేయబోమని హైకోర్టు స్పష్టం చేసింది. ఇదే సమయంలో హైడ్రా చర్యలన్నీ చట్టప్రకారమే ఉండాలని తేల్చిచెప్పింది.

కాంగ్రెస్ నేతల రాజభవనాలు
కూల్చే దమ్ము హైడ్రాకు ఉన్నదా?

- ఎఫ్‌టీఎల్ పరిధిలోనే పొంగులేటి, కేవీపీ, గుత్తా, వివేక్, మధుయాష్కీ ఫాంహౌజ్‌లు
- సీఎం ఫాంహౌజ్ శాటిలైట్ మ్యాప్ మీడియాకు పంపిస్తా
- బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ సవాల్



హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో నిర్మించిన కాంగ్రెస్ నేతల ఫాంహౌజ్‌లు కూలగొట్టే దమ్ము హైడ్రాకు ఉన్నదా? అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కేవీపీ రామచంద్రరావు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మధుయాష్కీ వంటి కాంగ్రెస్ నేతలు చెరువుల ఫుల్‌ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలో లేదా బఫర్ జోన్లలో నిర్మించుకున్న రాజభవనాలను కూల్చగలదా? అని నిలదీశారు. సీఎం ఫాంహౌజ్ శాటిలైట్ మ్యాప్‌లను కూడా మీడియాకు పంపిస్తానని చెప్పారు. బుధవారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల రాజభవనాలు కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని తెలిపారు. 'ఎఫ్‌టీఎల్ పరిధిలో కట్టుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నేత కేవీపీ రామచంద్రరావు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మధుయాష్కీ.. వీళ్లందరి ఫాంహౌజ్‌ల దగ్గరికి వెళ్లి కూలగొడదాం. వీరితోపాటు రేవంత్‌రెడ్డికి కూడా ఫాంహౌజ్ ఉన్నది. సీఎం ఫాంహౌజ్ శాటిలైట్ మ్యాప్‌లను కూడా మీడియాకు పంపిస్తా చూసుకోండి. నా పేరు మీద ఫాంహౌజ్ ఉన్నట్టు మీడియాలో ఏవేవో కథనాలు రాస్తున్నారు. కానీ, స్పష్టంగా చెప్తున్న.. నా పేరు మీద ఏ ప్రాపర్టీ లేదు. జన్వాడలో నా స్నేహితుడి ఫాంహౌజ్‌ను లీసుకుతీసుకున్న. ఎఫ్‌టీఎల్ లేదా బఫర్‌జోన్‌లో ఉంటే నేనే దగ్గరుండి కూలగొట్టిస్తా. నో ప్రాబ్లం. మంచి జరుగుతున్నప్పుడు అందరం ఆహ్వానించాల్సిందే. కానీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒక్కటే అడుగుతున్న. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో మంత్రులు, పెద్దపెద్ద కాంగ్రెస్ నేతలు కట్టిన రాజభవనాల సంగతేంది? నా స్నేహితుడి ఫాంహౌజ్‌ను జూమ్ పెట్టి తీస్తున్నారు. అవి సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. ఒక వేళ తప్పు జరిగితే దగ్గరుండి కూల్చివేయించేందుకు సహకరిస్తా. ఇక హైడ్రానో.. అమీబానో ఉంది కదా. దాన్ని తీసుకొని అక్కడి నుంచి నేరుగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫాంహౌజ్ నుంచి మొదలుపెడుదాం. వాళ్ల తమ్ముడు కూడా అక్కడే ఉన్నాడు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఫాంహౌజ్ కూడా నీళ్లలోనే కట్టారు. అన్నీ ఒక్కటే రోజు కూలగొడుదాం. ప్రజలకు పారదర్శకంగా ఉందాం. తప్పు నేనుచేసినా సరే చర్యలు తీసుకోండి. ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకున్నా ఎలాంటి ఇబ్బంది, అభ్యంతరం లేదు' అని కేటీఆర్ స్పష్టం చేశారు. సమావేశంలో మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, నేతలు దాసోజు శ్రవణ్‌కుమార్, పీ విష్ణువర్ధన్‌రెడ్డి, షేక్ అబ్దుల్లా సోహైల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి ఫాంహౌస్ నాకు తెల్వదు

- కబ్జాదారులు ఎంతటివారైనా, సినిమా యాక్టర్లైనా చర్యలుంటయ్
- నగరంలో అమెరికా తరహా రోడ్లు
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ) : 'మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫామ్‌హౌస్ ఎఫ్‌టీఎల్‌లో ఉందంటున్నరు.. అదేందో నాకు తెల్వదు' అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పెద్దలకు ఫామ్‌హౌస్‌లు ఉన్నాయంటున్నారని, సీఎం రేవంత్‌రెడ్డికి కూడా ఫామ్‌హౌస్ ఉందంటున్నారని, అవెక్కడున్నాయో చూపించాలని ప్రశ్నించారు. సచివాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైడ్రా ఆధ్వర్యంలో కూల్చివేతల అంశాన్ని ప్రస్తావించారు. జీవో 111 పరిధిలో 30శాతం విస్తీర్ణంలోనే నిర్మాణాలు చేయాలని, హైడ్రా అనేది చెరువులను కబ్జా నుంచి కాపాడేందుకేనని చెప్పారు. చిన్నా పెద్దా తేడాలేకుండా చట్ట ప్రకారం అందరిపై చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ముఖ్యంగా గండిపేట్ పరివాహక ప్రాంతంలో పార్టీలకు అతీతంగా చాలా మంది ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారని, కబ్జాదారులు ఎంత పెద్దవారైనా, సినిమా యాక్టర్లైనా చర్యలుంటాయని తెలిపారు. అక్టోబర్‌లో ట్రిపుల్ ఆర్‌కు టెండర్ల ప్రక్రియ చేపడుతామని చెప్పారు. రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. ఢిల్లీ, బొంబాయిలను తలదన్నేలా ఫోర్త్‌సిటీ తయారవుతుందని, ఫోర్త్ సిటీకి మెట్రో, ఎయిర్‌పోర్టును కనెక్ట్ చేస్తామని చెప్పారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారికి గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్టు వివరించారు. ఆరు లేన్ల రహదారికి దసరా నాటికి టెండర్లు పూర్తి చేసి నవంబర్ మొదటివారంలో పనులు చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు. నారపల్లి-ఉప్పల్ ఫ్లైఓవర్ పనులకు రెండు నెలల్లో టెండర్లు పిలిచి ఏడాదిన్నరలో పూర్తిచేస్తామని చెప్పారు. మన్నెగూడ ఎక్స్‌ప్రెస్‌వే పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. అమెరికా తరహా రోడ్లు అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఉన్నామని, హడ్కో ద్వారా రుణం తీసుకొని గ్రామీణ రోడ్లను బాగుచేస్తామని తెలిపారు.



దుద్యాల తహసీల్దార్ కార్యాలయంను ముట్టడించి ఆందోళన చేస్తున్న రైతులు

'ఫార్మా విలేజ్'పై రైతుల రణం

దుద్యాల తహసీల్దార్ కార్యాలయం ముట్టడి • ప్రాణాలు పోయినా భూములివ్వం

బొంరాస్‌పేట, ఆగస్టు 21 : వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా రైతులు ఏకమవుతున్నారు. ఫార్మా విలేజ్‌ను అడ్డుకోవడానికి దశలవారీ పోరాటాలకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ధర్నాలు చేపట్టి, అధికారులకు వినతిపత్రాలు అందజేసిన ఆయా గ్రామాల రైతులు బుధవారం దుద్యాల తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. అంతకు ముందు పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయం వద్ద సమావేశమై అక్కడి నుంచి హకీంపేట మీదుగా పాదయాత్రగా దుద్యాల మండల కేంద్రానికి చేరుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. 'ఫార్మా గోబ్యాక్' అంటూ నినదించారు. ఫార్మా విలేజ్‌కు సాగు భూములిచ్చేది లేదని తెగేసి చెప్పారు. ప్రభుత్వం స్పందించకుంటే తహసీల్దార్ కార్యాలయాన్ని తగలబెడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. నిరసనలో పోలేపల్లి, హకీంపేట, లగచెర్ల, పులిచెర్లకుంట తండా రైతులు పాల్గొన్నారు.

చేతిగుర్తుకు ఓటేస్తివి.. చేతిల భూమి పోగొడ్తివి

- 'ఫార్మా విలేజ్'పై రైతులను కదిలిస్తున్న రాములు పాట
- సోషల్ మీడియాలో బాధిత రైతు సాంగ్ వైరల్



రైతు గుండెమోని రాములు

బొంరాస్‌పేట, ఆగస్టు 21 : ఫార్మా విలేజ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా రైతుల ఆందోళనకు మద్దతుగా గుండెమోని రాములు అనే రైతు తన పాట ద్వారా సంఘీభావం ప్రకటించారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట గ్రామానికి చెందిన ఈయన తన పాట ద్వారా రైతుల్లో చైతన్యం నింపుతున్నాడు. ఈయన కూడా ఫార్మా విలేజ్ భూబాధితుడే. 'ఏమమ్మా సాయమ్మా.. చేతి గుర్తుకు ఓటేస్తివి చేతిల భూమి పోగొడ్తివి' అంటూ తల్లి సాయమ్మ కాంగ్రెస్‌కు ఓటేస్తే భూమి పోతున్నదని పాట రూపంలో ఆవేదన వెలిబుచ్చాడు. మార్పు కోసం కాంగ్రెస్‌కు ఓటేస్తే భూములు పోగొట్టుకునే మార్పు వచ్చిందని ప్రభుత్వంపై వ్యంగాస్త్రాలు సంధించాడు రాములు. ప్రాణం పోయినా భూమి మాత్రం ఇచ్చేది లేదని, అభివృద్ధి పేరిట ప్రభుత్వం పేదల భూములు తీసుకుంటుందని, భూస్వాముల భూములు ఎందుకు తీసుకోవడం లేదని పాట ద్వారా ప్రశ్నిస్తున్నాడు. ఈ పాట ప్రస్తుతం యూట్యూబ్ చానళ్లలో వైరల్‌గా మారింది.

న్యాయవాదుల భద్రతకు చట్టం

- ప్రభుత్వాన్ని నివేదిక కోరిన కోర్టు

నాంపల్లి కోర్టులు, అగస్టు 21 (నమస్తే తెలంగాణ): న్యాయవాదుల భద్రతకు ప్రత్యేక చట్టం అవసరంపై నివేదిక సమర్పించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే అసిస్టెంట్ అడ్వకేట్ జనరల్‌ను బుధవారం ఆదేశించారు. న్యాయవాదులపై దురదృష్టకర సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. న్యాయవాదులకు గౌరవం ఇవ్వాల్సిన పరిస్థితుల్లో వారిపై దాడులు జరుగుతున్నాయన్నారు. కౌంటర్ దాఖలు చేయాలని ఏఏజీకి సూచించారు.

న్యాయవాదిపై దాడి కేసులో నోటీసులు

కూకట్‌పల్లి బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది సంతోష్ కుమార్‌పై ఈ నెల 16న బోరబండ పోలీసులు దాడి చేసినట్టు వచ్చిన కథనాలపై హైకోర్టు బుధవారం మరోసారి విచారించింది. కేసులో కౌంటర్లు దాఖ లు చేయాలని సీఎస్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, పోలీసు కమిషనర్, బోరబండ్ ఎస్‌హెచ్‌వో, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌కు నోటీసులిచ్చింది.

శివారు ప్రజలకు 'హైడ్రా' దడ!

- హైడ్రా పరిధిలో 20 మున్సిపల్స్, 8 కార్పొరేషన్లు, 33 పంచాయతీలు, కంటోన్మెంట్ 61 పారిశ్రామిక వాడలు
- ఆస్తుల రక్షణ పేరుతో అడ్డగోలు కూల్చివేతలు
- ఆయా ప్రాంతాల భవన యజమానుల్లో కలవరం

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఈ పేరు వింటేనే జీహెచ్‌ఎంసీతోపాటు ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న పట్టణాలు, గ్రామాల ప్రజ లు ఉలిక్కి పడుతున్నారు. ఆస్తుల రక్షణ పేరు తో పెద్దపెద్ద భవనాలను కూలగొడుతుండటం తో ప్రతి ఒక్కరూ తమ ఇండ్ల పట్టాలను మరోసారి చెక్ చేసుకుంటున్నారు. ముఖ్యంగా శివా రు ప్రాంతాల ప్రజలు కలవరపడుతున్నారు. కష్టపడి సంపాదించిన సొమ్ముతో ఇల్లు కట్టుకొనో, కొనుక్కొనో ఏండ్ల తరబడి నివాసం ఉంటున్నా ఇప్పుడు నిరాశ్రయులు కాక తప్పదా? అని ఆవేదన చెందుతున్నారు.

భవనాలు నేలమట్టం

రాష్ట్ర ప్రభుత్వం గత నెల 17న హైడ్రాను ఏర్పాటు చేస్తూ జీవో 99ని జారీ చేసింది. జీహెచ్‌ఎంసీతో పాటు 8 మున్సిపల్ కార్పొరేషన్లు, 20 మున్సిపాలిటీలు, 33 పంచాయతీలు, 61 పారిశ్రామిక వాడలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను హైడ్రాకు అప్పగించింది. జీహెచ్‌ఎంసీ, స్థానిక సంస్థల పరిధిలోని పార్కులు, లే అవుట్లు, ఖాళీ స్థలాలు, పరిశ్రమల శాఖ స్థలాలు, జలవనరుల స్థలాలను పరిరక్షించడం అస్సెట్ ప్రొటెక్షన్ వింగ్ బాధ్యత. ఆయా స్థలాల ఆక్రమణలపై ఫిర్యాదులు స్వీకరించడం, విచారణ చేపట్టడం, ఆక్రమణలను అడ్డుకోవడం, చెరువులను కబ్జాల నుంచి రక్షించడం వంటి బాధ్యతలను దీనికి అప్పగించింది. ఈ వెసులుబాటును ఆసరాగా చేసుకొని వందల భవనాలను కూలగొడుతున్న సంగతి తెలిసిందే. దీంతో ఏండ్ల కిందట వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి, ఇండ్లు కట్టుకున్నవారు ఇప్పుడు ఉలిక్కి పడుతున్నారు. తాము కొన్న స్థలం ఏదైనా ప్రభు త్వ స్థలం పరిధిలోకి వస్తుందా? అని ఒకటికి రెండుసార్లు సరిచూసుకుంటున్నారు. దశాబ్దాలుగా రియల్టర్ల నుంచి అడ్డగోలు లంచాలు తీసుకొని అధికారులు విచ్చలవిడిగా వెంచర్ల కు అనుమతులిచ్చేస్తున్నారన్న విమర్శలు ఉ న్నాయి. ప్రభుత్వ స్థలాలు, చెరువు శిఖం భూ ముల్లో వెంచర్లు వేసినా నిస్సిగ్గుగా అనుమతు లు మంజూరు చేశారు. ఇదే అదనుగా చెరువులు, కుంటలు, పార్కుల స్థలాలను కబ్జా చేసి, మట్టి నింపి పూడ్చివేసి, వెంచర్లు వేసి అమ్మేశారు. సామాన్యులకు ఈ విషయం తెలియదు. అన్ని రకాల అనుమతులు ఉండటంతో లక్షలు పోసి స్థలాలు కొని ఇండ్లు కట్టుకున్నారు. ఇప్పుడు వారంతా భయపడుతున్నారు.

అధికారులపై చర్యల్లేవా?

'అక్రమ నిర్మాణాలు' అంటూ హైడ్రా ఆధ్వర్యంలో భవనాలను కూల్చివేస్తున్న ప్రభుత్వం, వాటికి అనుమతులిచ్చిన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజల నుంచి ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు నిబంధనలు ఎందుకు రూపొందించలేదని నిలదీస్తున్నారు. ఒక భవనాన్ని కూల్చివేసే ముందే ఆ ఇంటి నిర్మాణానికి అనుమతి ఇచ్చిన అన్ని విభాగాల అధికారులకు నోటీసులివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. వారి నుంచి వివరణ తీసుకొని, తగిన శిక్ష విధించిన తర్వాతే భవనాలు కూల్చాలని డిమాండ్ చేస్తున్నారు.

హైడ్రా పరిధిలోకి వచ్చేవి ఇవే

మున్సిపల్ కార్పొరేషన్లు

1. బడంగ్‌పేట (రంగారెడ్డి జిల్లా)
2. బండ్లగూడ జాగీర్ (రంగారెడ్డి జిల్లా)
3. మీర్‌పేట్- జిల్లెలగూడ (రంగారెడ్డి జిల్లా)
4. బోడుప్పల్ (మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా)
5. పీర్జాదిగూడ (మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా)
6. జవహర్‌నగర్ (మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా)
7. నిజాంపేట (మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా)
8. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

మున్సిపాలిటీలు

1. పెద్ద అంబర్‌పేట (రంగారెడ్డి జిల్లా)
2. ఇబ్రహీంపట్నం (రంగారెడ్డి జిల్లా)
3. జల్‌పల్లి (రంగారెడ్డి జిల్లా)
4. శంషాబాద్ (రంగారెడ్డి జిల్లా)
5. తుర్కయాంజల్ (రంగారెడ్డి జిల్లా)
6. మణికొండ (రంగారెడ్డి జిల్లా)
7. నార్సింగి (రంగారెడ్డి జిల్లా)
8. ఆదిభట్ల (రంగారెడ్డి జిల్లా)
9. తుక్కుగూడ (రంగారెడ్డి జిల్లా)
10. బొల్లారం (సంగారెడ్డి జిల్లా)
11. తెల్లాపూర్ (సంగారెడ్డి జిల్లా)
12. అమీన్‌పూర్ (సంగారెడ్డి జిల్లా)
13. దమ్మాయిగూడ (మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా)
14. నాగారం (మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా)
15. ఘట్‌కేసర్ (మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా)
16. గుండ్ల పోచంపల్లి (మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా)
17. తూంకుంట (మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా)
18. కొంపల్లి (మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా)
19. దుండిగల్ (మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా)
20. పోచారం (మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా)

గ్రామ పంచాయతీలు

1. రామచంద్రాపురం (మెదక్)
2. ఐలాపూర్ (మెదక్)
3. కర్దనూర్ (మెదక్)
4. కృష్టారెడ్డిపేట్ (మెదక్)
5. ముత్తంగి (మెదక్)
6. పోచారం (మెదక్)
7. సుల్తాన్‌పూర్ (మెదక్)
8. కచ్చివాని సింగారం (రంగారెడ్డి)
9. కొర్రెముల్ (రంగారెడ్డి)
10. పీర్జాదిగూడ (రంగారెడ్డి)
11. ప్రతాప్‌సింగారం (రంగారెడ్డి)
12. బాచారం (రంగారెడ్డి)
13. గౌరెల్లి (రంగారెడ్డి)
14. కుత్బుల్లాపూర్ (రంగారెడ్డి)
15. తారామతిపేట్ (రంగారెడ్డి)
16. చీరియాల్ (రంగారెడ్డి)
17. గోధుమకుంట (రంగారెడ్డి)
18. కీసర (రంగారెడ్డి)
19. రాంపల్లి (రంగారెడ్డి)
20. తిమ్మాయిపల్లి (రంగారెడ్డి)
21. యాద్గార్‌పల్లి (రంగారెడ్డి)
22. మంఖల్ (రంగారెడ్డి)
23. గౌడవెల్లి (రంగారెడ్డి)
24. పుదూర్ (రంగారెడ్డి)
25. మంచిరేవుల్ (రంగారెడ్డి)
26. బూమ్‌రాస్‌పేట్ (రంగారెడ్డి)
27. గోల్కొండ కలాన్ (రంగారెడ్డి)
28. గోల్కొండ కుర్ద్ (రంగారెడ్డి)
29. హమీదుల్లా నగర్ (రంగారెడ్డి)
30. గోల్కొండ కలాన్ (రంగారెడ్డి)
31. గోల్కొండ కుర్ద్ (రంగారెడ్డి)
32. జన్వాడ (రంగారెడ్డి)
33. పటి (మెదక్)

ఇతర ప్రాంతాలు

1. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతం
2. టీఎస్ఐఐసీ/ఐఏఎల్ఏ/ ఇతర ఇండస్ట్రియల్ ఏరియాలు- 61

ఎస్సీ వర్గీకరణకు అడ్డుపడుతున్న ఖర్గే

మీడియాతో మందకృష్ణ మాదిగ

ఖైరతాబాద్, ఆగస్టు 21: ఎస్సీల వర్గీకరణకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అడ్డుపడుతున్నారని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో వర్గీకరణకు కాంగ్రెస్ మద్దతునిచ్చిందని, కానీ ఖర్గే వ్యతిరేకించారని అన్నారు. వర్గీకరణపై రాహుల్ గాంధీ, సోనియా గాంధీ మౌనం వెనుక కూడా ఖర్గేనే ఉన్నారని ఆరోపించారు. తెలంగాణ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మందకృష్ణ జర్నలిస్టులతో మాట్లాడారు.

పేలిన రియాక్టర్.. 16 మంది మృతి

- అచ్యుతాపురంలో ఘోర ప్రమాదం
- 50 మందికిపైగా గాయాలు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో బుధవారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం జరిగింది. రియాక్టర్ పేలిన ఘటనలో 16 మంది మృతి చెందగా, మరో 50 మందికి పైగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతను బట్టి మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో వందల సంఖ్యలో కార్మికులు, సిబ్బంది పనిచేస్తున్నారు. భోజన విరామ సమయంలో భారీ పేలుడు సంభవించి మంటలు చెలరేగాయి. దట్టంగా పొగ కమ్ముకొని ఏం జరుగుతున్నదో అర్థం కాని పరిస్థితి నెలకొన్నది. పేలుడు ధాటికి పలువురు కార్మికుల మృతదేహాలు ఛిద్రమయ్యాయి. కార్మికులు ప్రాణ భయంతో బయటకు పరుగులు తీశారు. భారీ శబ్దంతో సమీప గ్రామాల ప్రజలు ఉలికిపడ్డారు. ఫార్మా సెజ్‌లోని అగ్నిమాపక యంత్రం సహా చుట్టుపక్కల నుంచి మరో 11 యంత్రాలు వచ్చి మంటలను అదుపు చేశాయి. క్షతగాత్రులను చికిత్స కోసం అనకాపల్లిలోని వేర్వేరు దవాఖానలకు తరలించారు. కాలిన గాయాలతో ఏడుగురు మృతి చెందగా, మొదటి అంతస్తు శ్లాబు కింద పడి ఏడుగురు మృతి చెందారు. గాయపడినవారిలో ఐదుగురు 60 శాతానికి పైగా కాలిన గాయాలతో ఉన్నట్టు సమాచారం. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో దాదాపు 300 మంది కార్మికులు ఉన్నట్టు సమాచారం. పేలుడు ధాటికి పరిశ్రమ మొదటి అంతస్తు స్లాబు కూలిపోయింది. ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కలెక్టర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.



డెంగ్యూతో 24 గంటల్లో ఐదుగురి మరణం

చీమ కుట్టినట్టయినా లేని సర్కార్

మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యావంటి విషజ్వరాలతో రాష్ట్రం వణుకుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేకపోవడం శోచనీయమని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. డెంగ్యూతో 24 గంటల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆయన ఎక్స్‌వేదికగా ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని వానకాలం ప్రారంభంలోనే కోరినా సర్కార్ పెడచెవిన పెట్టిందని విమర్శించారు. సీఎం, సీఎస్ స్థాయిలో ఒక్కరోజూ సమీక్ష చేయలేదని, గ్రామాలు, పట్టణాల్లో స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో మురికికూపాలుగా మారుతున్నాయని, జేబుల నుంచి ఖర్చు చేస్తూ వచ్చిన కార్యదర్శులు తమ వల్ల కాదని సామూహికంగా సెలవు పెట్టి విధులకు దూరంగా ఉంటున్నా రని ఉదహరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా సమీక్ష నిర్వహించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

కానిస్టేబుళ్లందరినీ ఒకేలా చూడండి

డిప్యూటీ సీఎంకు హరీశ్ లేఖ

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని కానిస్టేబుళ్లకు సరెండర్, అడిషనల్ సరెండర్ లీవ్ బెనిఫిట్ కింద అందించే డబ్బులను కొన్ని జిల్లాలకే ఇచ్చి మిగతా జిల్లాలకు ఇవ్వకపోవడం బాధాకరమని హరీశ్‌రావు పేర్కొన్నారు. కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేటలోని దాదాపు 6 వేల మంది కానిస్టేబుళ్లకు లీవ్ బెనిఫిట్‌ను 8 నెలలుగా పెండింగ్ పెట్టారని, పెట్రోల్, డీజిల్ బిల్లులు రాక పోలీసులు, పెట్రోల్ బంక్ నిర్వాహకులు ఇబ్బంది పడుతున్న తీరుపై డిప్యూటీ సీఎం భట్టికి లేఖ రాశారు. 'కానిస్టేబుళ్లపై ఎందుకింత వివక్ష? రాష్ట్ర పోలీసుల్లో వీళ్ల భాగం కాదా? ఒకే డిపార్ట్‌మెంట్‌లో పక్షపాతం ఎందుకు? ఇది వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడమే' అని లేఖలో పేర్కొన్నారు.

ఇంకా ఎంతమంది చనిపోవాలి?

- టీపీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మారయ్య ఆగ్రహం
- గుండెపోటుతో మరో ఆటోడ్రైవర్ మృతి

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఇంకా ఎంతమంది ఆటోడ్రైవర్లు చనిపోతే కాంగ్రెస్ సర్కారు స్పందిస్తుందో చెప్పాలి? అని టీపటీయూ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇప్పటికే 50మందికి పైగా ఆటోడ్రైవర్లను కాంగ్రెస్ ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు స్కీం కల్పించడంతోనే ఆటోడ్రైవర్లు గిరాకీ కోల్పోయారని పేర్కొన్నారు. ఆటోడ్రైవర్లను ఆదుకోవాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆటోడ్రైవర్లను ఆదుకోకపోతే మృతుల కుటుంబ సభ్యులతో కలిసి పెద్దఎత్తున పోరాటానికి దిగుతామని, సీఎం క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అన్ని ఆటో యూనియన్లతో చర్చించి త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. మేడ్చల్‌లోని రావల్కల్ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మల్కాపాటి శ్రీను(45)బుధవారం గుండెపోటుతో మరణించగా అంత్యక్రియలకు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



రావల్కల్‌కు చెందిన ఆటోడ్రైవర్ మల్కాపాటి శ్రీను అంత్యక్రియలు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


- ములుగు జిల్లాలో విషాదం

మంగపేట, ఆగస్టు 21: అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరులో చోటుచేసుకున్నది. స్థానిక ఎస్సై టీవీఆర్ సూరి తెలిపిన వివరాల ప్రకారం.. మల్లూరు గ్రామానికి చెందిన ఆళ్ల జయంత్(26) గతేడాది ఐదెకరాల్లో మిర్చి సాగు చేశాడు. పంటకు తెగుళ్లు సోకి దిగుబడి సరిగా రాక అప్పుల పాలయ్యాడు. దీనికితోడు కొత్తగా నిర్మించిన ఇంటికి కూడా అప్పులు చేశాడు. మొత్తం రూ. 12 లక్షల వరకు అప్పులయ్యాయి. వీటిని తీర్చే మార్గం లేక ఆందోళనకు గురైన జయంత్ ఈనెల 19న మండల కేంద్రంలోని గంపోని గూడెం సమీప జామాయిల్ తోటలో గడ్డిమందు తాగాడు.



జయంత్(ఫైల్)

అనంతరం ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలిపాడు. వెంటనే వారు జయంత్‌ను హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు.



'నమస్తే తెలంగాణ' కథనంపై కేటీఆర్ స్పందించి ట్విట్టర్‌లో చేసిన పోస్ట్

ఏడు గంటలు కరెంట్ పోతే సర్కార్ పట్టించుకోదా?

- ప్రజా సమస్యలపై ప్రభుత్వానికేదీ చిత్తశుద్ధి?
- 'నమస్తే' కథనంపై ట్విట్టర్ వేదికగా స్పందించిన కేటీఆర్

బయ్యారం ఆగస్టు 21: 'ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఇదేనా..? ఏడు గంటలు కరెంట్ పోతే విద్యుత్తు శాఖ పట్టించు కోదా? స్థానికులు పోల్ ఎక్కి పరిష్కరించుకోవడం ఆశ్చర్యం వేసింది' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ (ఎక్స్)లో పోస్ట్‌చేశారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం పెంకుతండాలో ఏడు గంటలపాటు విద్యుత్తు లేకపోవటంతో స్థానిక యువకులే మరమ్మతు చేసుకొని కరెంట్ సరఫరాను పునరుద్ధరించుకున్న విషయాన్ని బుధవారం 'నమస్తే తెలంగాణ'లో 'స్తంభం ఎక్కి.. జంపర్ వేసి' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై మాజీ మంత్రి కేటీఆర్ స్పందించి ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. తండాలో దాదాపు 7 గంటల పాటు కరెంట్ పోయినా విద్యుత్తు అధికారులు పట్టించుకోకపోవటంతో స్థానిక యువకుడే కరెంట్ పోల్ ఎక్కి సమస్య పరిష్కరించేందుకు చేసిన ప్రయత్నంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విద్యుత్తు సిబ్బంది ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యంతో విసిగిపోయిన స్థానికులే ఇలా కరెంటు సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారంటే ప్రభుత్వానికి ప్రజల సమస్యలపై ఎంత చిత్తశుద్ధితో ఉన్నదో అర్థమవుతుందని అన్నారు. స్థానికంగా ఉండే యువకుడే పోల్ ఎక్కి రిపేర్ చేసే ప్రయత్నం చేసినందుకు ఆ యువకుడిని కేటీఆర్ ప్రశంసించారు. ఇది చాలా ప్రమాదకరమైనప్పటికీ ప్రజలకు వేరే మార్గం లేని పరిస్థితి తెచ్చారని విద్యుత్తు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించే విషయంలో విద్యుత్తు శాఖ, డిస్కమ్‌లు ఎంత నిర్లక్ష్యం వహిస్తున్నాయో ఈ ఘటన తెలియజేస్తున్నదంటూ ప్రభుత్వం, అధికారులు తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు.

పెంకుతండా ఘటనపై విద్యుత్తు శాఖ ఆరా

నమస్తే ఎఫెక్ట్

బయ్యారం ఆగస్టు 21: మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని పెంకు తండా గ్రామంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఘటనపై ఆ శాఖ అధికారులు ఆరా తీశారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడగా స్థానిక యువకులే విద్యుత్తును పునరుద్ధరించుకోవడంతో 'స్తంభం ఎక్కి.. జంపర్ వేసి' కథనాన్ని 'నమస్తే తెలంగాణ' ప్రచురించింది. జిల్లాస్థాయి అధికారుల ఆదేశంతో ఏడీ రమేశ్ బుధవారం కొత్తపేటలోని సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. అంతరాయానికి సంబంధించిన వివరాలు సిబ్బంది వద్ద తెలుసుకొని రికార్డులు పరిశీలించారు. 3.55 గంటలు మాత్రమే అంతరాయం ఏర్పడిందని వారు చెబుతున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో నలుగురికి గాయాలు

శాయంపేట/బయ్యారం, ఆగస్టు 21: హనుమకొండ జిల్లా శాయంపేటలో వంగరి రాజు-విజయ దంపతుల ఐదేండ్ల కుమారుడు శివసాయి ఇంటి నుంచి వచ్చి బాలికల హైస్కూల్ ఎదుట ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో కుక్కలు దాడి చేసి ఎడమ చేయిని కొరకడంతో గాయాలయ్యాయి. వెంటనే ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. మధ్యాహ్నం అవే కుక్కలు పాఠశాల అటెండర్‌పైనా దాడి చేశాయి. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లిలో షేక్ యూసఫ్- రిజ్వానా దంపతుల మూడేండ్ల చిన్నారి సుఫియాన్‌కు తల్లి ఇంటి ముందు అన్నం తినిపిస్తుండగా వీధి కుక్క వచ్చి చిన్నారి గొంతు పట్టేసింది. తల్లి కేకలు వేయడంతో యూసఫ్ వచ్చి కుక్క నుంచి కొడుకును కాపాడాడు. యూసఫ్ కాలిని గాయపరిచింది. చిన్నారిని మహబూబాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు.

బీజేపీ పరువు నష్టం కేసులో సీఎంకు నోటీసులు

- సెప్టెంబర్ 25న కోర్టుకు రావాలని రేవంత్‌కు కోర్టు ఆదేశం

నాంపల్లి కోర్టులు, అగస్టు 21 (నమస్తే తెలంగాణ): తప్పుడు ఆరోపణలు చేసి బీజేపీ ప్రతిష్ఠకు భంగం కలిగించారని ఆరోపిస్తూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ఫిర్యాదుపై నాంపల్లిలోని ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి నోటీసులు జారీచేసింది. వచ్చే నెల 25న కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. కుట్రపూరితంగా రేవంత్ బీజేపీపై అనుచిత వాఖ్యలు చేశారని ఫిర్యాదుదారుడితోపాటు అజయ్‌కుమార్ వాంగ్మూలాన్ని నమోదు చేసిన కోర్టు నోటీసులు జారీ చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రకాశం స్టేడియంలో మే 4న జరిగిన సభలో రేవంత్‌రెడ్డి బీజేపీ అధికారం చేపట్టేలోపే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను తొలగిస్తుందని ఆరోపించారు. దీనికి సంబంధించిన వార్తలను ఫిర్యాదుదారు కోర్టుకు సమర్పించారు. మీటింగ్‌కు హాజరైన 50 వేల మంది ప్రజలకు తప్పుడు సమాచారాన్ని అందించారని పిటిషన్‌లో వివరించారు.

మురుగు కాల్వలో చిన్నారి గల్లంతు

- నిజామాబాద్‌లో దయనీయ ఘటన
- అసంపూర్తి సీసీ వర్క్ వల్లే ప్రమాదం?
- చిమ్మచీకట్లోనూ సహాయక చర్యలు

నిజామాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అప్పటిదాకా ఆడుతూ కనిపించిన రెండేండ్ల చిన్నారి, ఒక్కసారిగా కనిపించకుండా పోయింది. ఇంటిముందున్న మురుగు కాల్వలో పడి గల్లంతయినట్టు స్థానికులు, పోలీసులు భావిస్తున్నారు. నిజామాబాద్ నగరంలోని ఆనంద్‌నగర్‌లో బుధవారం సాయంత్రం ఈ ఘటన జరగగా, చీకటిలోనూ సహాయక చర్యలు కొనసాగాయి. ఆనంద్‌నగర్‌కు చెందిన మారుతి, పూజ దంపతుల కూతురు అను (2) ఉన్నట్టుండి కనిపించకపోవడంతో మురుగుకాల్వలో పడి ఉంటుందని మున్సిపల్, అగ్నిమాపక సిబ్బందికి తల్లిదండ్రులు, స్థానికులు సమాచారమిచ్చారు. సహాయ బృందాలు రంగంలోకి దిగి కాల్వలో గాలిస్తున్నాయి. చీకటి పడటంతో గాలింపు చర్యలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. మురుగు కాల్వ సుమారు కిలోమీటర్ మేర తెరిచి ఉన్నది. సీసీ వర్క్ ఇంకా పూర్తి కాలేదు. మూడు అడుగుల వెడల్పుతో ఉండటంతో కాలువ అంచులోకి ఏమాత్రం వెళ్లినా అందులో జారిపడే అవకాశమున్నది. చుట్టుపక్కల ప్రాంతాల మురుగుతో పాటు వర్షాల కారణంగా భారీ వరదతో కాల్వ ప్రమాదకరంగా పారుతున్నది. ఈ క్రమంలో బాలిక అందులో పడి కొట్టుకుపోయి ఉంటుందని భావిస్తున్నారు.



చిన్నారి అను (ఫైల్)

గాలిస్తున్నాం..

చిన్నారి గల్లంతైన సమాచారం తెలిసిన వెంటనే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీమ్‌కు సమాచారమిచ్చాం. సిబ్బందితో వెంటనే సహాయక చర్యలు ముమ్మరం చేసి గాలింపు చర్యలు చేపట్టాం. పాప ఆచూకీ కోసం చీకట్లోనూ శ్రమిస్తున్నాం. ప్రవాహం భారీగా ఉండటం, కాల్వ లోతు ఎక్కువే ఉండటం ఇబ్బందికరంగా మారింది.

– మకరంద్, నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్

తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు

తల్లిదండ్రులిద్దరూ కూలీ పనులకు వెళ్లడంతో అమ్మమ్మ పాప సంరక్షణ చూసుకుంటున్నది. బుధవారం సాయంత్రం 4గంటల వరకు ఇంటి ముందు ఆడుకున్న పాప హఠాత్తుగా కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది చుట్టుపక్కల వెతికారు. ఎక్కడా ఆచూకీ దొరక్కపోవడంతో కాల్వలోనే పడి ఉంటుందని నిర్ధారించుకొని గుండెలు పగిలేలా విలపిస్తున్నారు.

నీట మునిగి ఇద్దరు బాలుర మృతి

- గృహప్రవేశానికి వచ్చి ఈతకు వెళ్లి మృత్యువాత
- కొండపాక మండలం సిరిసనగండ్లలో విషాదం

కొండపాక(కుకునూరుపల్లి), ఆగస్టు 21 : గృహప్రవేశం కోసం వచ్చి చెరువులో మునిగి ఇద్దరు బాలురు మృత్యువాతపడ్డారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం సిరిసనగండ్లలో బుధవారం జరిగిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాది కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన బస్వరాజ్ మల్లేశ్ సిరిసనగండ్లలో తన చెల్లె రేణుక గృహప్రవేశానికి రెండు రోజుల కిత్రం కుటుంబంతో వచ్చాడు. కొడుకు బస్వరాజ్ హేమంత్(17)తో కలిసి అతడి స్నేహితుడు నిఖేశ్ వర్ధన్(13) కూడా వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం లో హేమంత్, నిఖేశ్ వర్ధన్, రేణుక కొడుకు సముద్రాల అరుణ్‌కుమార్ కిరాణా షాప్‌కు వెళ్తున్నామని చెప్పి చెరువులో ఈతకు వెళ్లారు. నీళ్లలోతును అంచనా వేయక హేమంత్, నిఖేశ్ వర్ధన్‌లోపటికి వెళ్లి ఈత రాక మునిగిపోయారు. అరుణ్‌కుమార్ ఈత కొట్టుకుంటూ బయటకు వచ్చి కేకలు వేశాడు. చుట్టుపక్కల వాళ్లు వచ్చేసరికి ఇద్దరూ చనిపోయారు. మల్లేశ్ ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఓటుకు నోటు కేసులో బాబుకు ఊరట

- నిందితుడిగా చేర్చే పిటిషన్‌పై విచారణకు సుప్రీం నిరాకరణ

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): ఓటుకు నోటు కేసులో ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు భారీ ఊరట లభించింది. ఈ కేసులో చంద్రబాబునాయుడును నిందితుడిగా చేర్చి, దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్ ధర్మాసనం ఎదుట బుధవారం ఈ కేసు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా ఆళ్ల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో ఓ నామినేటెడ్ ఎమ్మెల్యేను ప్రలోభపరిచేందుకు ఫోన్‌లో మాట్లాడుతూ చంద్రబాబు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయారని.. ఆ కాల్‌రికార్డ్స్ ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఓటేస్తే రూ.5 కోట్లు ఇస్తానని, అదే గైర్హాజరైతే రూ.2 కోట్లు ఇస్తానని రేవంత్‌రెడ్డితో బేరసారాలు జరిపించారని పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పునే సమర్థించింది. ఈ కేసులో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి అంశాలూ కనిపించడం లేవని స్పష్టం చేసింది.

మూడేండ్ల చిన్నారిపై లైంగిక దాడి

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 21 : మూడేండ్ల చిన్నారిపై లైంగిక దాడి జరిగింది. ఈ ఘటన సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకున్నది. పోలీసులు 24 గంటల్లోపు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట మైత్రీవనంలో నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో నేపాల్‌కు చెందిన ఓ వ్యక్తి వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే తన భార్య, మనుమరాలితో కలిసి ఉంటున్నాడు. అదే అపార్ట్‌మెంట్‌లో పెయింటర్‌గా పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన అజయ్ అనే వ్యక్తి మంగళవారం మధ్యాహ్నం మూడేండ్ల చిన్నారిని ఆడిస్తానని చెప్పి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. చిన్నారి గట్టిగా ఏడ్వడంతో వాచ్‌మన్ చూసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేసి చిన్నారిని సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. నిందితుడిని బుధవారం పొన్నాల గ్రామ శివారులో పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చిన్నారి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

వ్యాయామ కాలేజీని అప్‌గ్రేడ్ చేయాలి

- బీఆర్‌ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ దోమలగూడలోని ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల (జీసీపీఈ)ను యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేయాలని బీఆర్‌ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. తెలంగాణభవన్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. అప్పటి విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారని తెలిపారు. ఇందుకు బీఆర్‌ఎస్ సర్కారు గతంలోనే రూ.20 కోట్లు కేటాయించిందని చెప్పారు.

కాంట్రాక్టర్ నుంచి 15 వేలు లంచం

- ఎంపీవో, కార్యదర్శిని పట్టుకున్న ఏసీబీ అధికారులు

ఆళ్లపల్లి, ఆగస్టు 21 : మాజీ ఉప సర్పంచ్, కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకున్నది. మర్కోడు మాజీ ఉప సర్పంచ్ కమల చేసిన రోడ్డు పనులకు పర్సంటేజీగా ఎంపీవో బత్తుల శ్రీనివాస్, మర్కోడు పంచాయతీ కార్యదర్శి తాటి నాగరాజు లంచం డిమాండ్ చేశారు. దీంతో ఆమె ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి సూచన మేరకు ఎంపీవో, పంచాయతీ కార్యదర్శికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రూ.15 వేలు లంచం ఇస్తుండగా.. అప్పటికే మాటు వేసిన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా వారిని పట్టుకుని అరెస్ట్ చేశారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు రాజశేఖర్, మల్లేశ్, రాజు, ఆళ్లపల్లి ఎస్సై సతీశ్ పాల్గొన్నారు.

బ్లాక్ మార్కెట్‌కు యూరియా

కమలాపూర్, ఆగస్టు 21: యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతుందంటూ రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రైతుల పేరిట యూరియా బస్తాలను పీఏసీఎస్ అధికారి ఫర్టిలైజర్ వ్యాపారులకు అమ్ముతుండగా అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మర్రిపెల్లిగూడెంలో బుధవారం చోటుచేసుకున్నది. పీఏసీఎస్ గోడౌన్ అధికారులు బయోమెట్రిక్‌తోపాటు రైతు ఆధార్‌కార్డు నంబర్ నమోదు చేసుకుని యూరియా బస్తాలు అమ్మకాలు చేయాలి. కానీ నిబంధనలు పాటించకుండా మర్రిపెల్లిగూడెం గోడౌన్ అధికారి రైతుల పేరుతో ఫర్టిలైజర్ వ్యాపారులకు విక్రయిస్తున్నట్టు తెలిసింది. ఆటో ట్రాలీలో యూరియా బస్తాలు గ్రామంలోని ఫర్టిలైజర్ షాపు వద్దకు రావడంతో రైతులు బుధవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఏవో లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ నోడల్ అధికారి దేవేందర్‌రెడ్డి విచారణ జరిపారు. షాపు యజమానికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తానని తెలిపారు. పట్టుబడిన యూరియాను తిరిగి గోడౌన్‌కు తరలించామని చెప్పారు. పీఏసీఎస్ నోడల్ అధికారి దేవేందర్‌రెడ్డిని కదిలించగా.. ఏవోనే చర్యలు తీసుకుంటారంటూ దాటవేశారు.

అటకెక్కిన బతుకమ్మ చీరల పంపిణీ

- ఆర్డర్లు లేక నష్టపోతున్న చేనేత కార్మికులు
- ఇప్పటివరకు పంపిణీపై స్పందించని కాంగ్రెస్ ప్రభుత్వం
- బీఆర్‌ఎస్ హయాంలో బతుకమ్మ చీరలకు రూ.2157 కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రతి ఏడాది ఉచితంగా పంపిణీ చేసే బతుకమ్మ చీరల పంపిణీని కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించింది. బతుకమ్మ ప్రారంభం కావడానికి 40 రోజుల సమయం మాత్రమే ఉన్నా చీరల పంపిణీ గురించి ఎలాంటి హడావుడిలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నేతన్నలకు బతుకమ్మ చీరల తయారీపై ఆర్డర్లేవీ రాలేదు. పనులు లేక ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోతున్న నేతన్నల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. 2017 – 2023 వరకు ప్రతి సంవత్సరం బతుకమ్మ చీరలు అందుకున్న మహిళలు ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందా లేదా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



చేతినిండా పనిలేక అల్లాడుతున్న నేతన్నలు..

బీఆర్‌ఎస్ హయాంలో బతుకమ్మ చీరల తయారీ బాధ్యతలను నేతన్నలకు ఇచ్చి, వారికి చేతి నిండా పని కల్పించి ఆదుకున్న ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కు దక్కింది. 2017 నుంచి ప్రతి ఏడాది కోటి మంది మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. 2017 నుంచి 2023 వరకు బతుకమ్మ చీరల తయారీ కోసం రూ. 2,157 కోట్లు కేటాయించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీ కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బీఆర్‌ఎస్ హయాంలో బతుకమ్మ చీరలకు కేటాయించిన నిధులు

సంవత్సరం	నిధుల కేటాయింపు
2017	222.48 కోట్లు
2018	280.00 కోట్లు
2019	313.00 కోట్లు
2020	317.81 కోట్లు
2021	333.14 కోట్లు
2022	339.73 కోట్లు
2023	351.52 కోట్లు
మొత్తం	2,157.68 కోట్లు

సెప్టెంబర్ 21న పంచాయతీ ఓటర్ల తుది జాబితా

- -ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ) : గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు జోరందుకున్నాయి. వార్డులు, గ్రామపంచాయతీల వారీగా ఓటర్ల జాబితా షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఓటర్ల తుది జాబితాను సెప్టెంబర్ 21న విడుదల చేయనున్నారు. ఓటర్ల జాబితాపై బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సీ పార్థసారధి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ అనితారామచంద్రన్, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అదనపు డైరెక్టర్ జనరల్ సంగ్రామ్ సమావేశంలో పాల్గొన్నారు. ఓటర్ల జాబితా షెడ్యూల్ ప్రకారం.. సెప్టెంబర్ 6న ఓటర్ల జాబితా ముసాయిదాను గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఉంచుతారు. 9,10 తేదీల్లో ముసాయిదాపై కలెక్టర్లు, మండలాభివృద్ధి అధికారులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి సూచనలు, సలహాలు స్వీకరిస్తారు. ఓటర్ల జాబితా ప్రచురణ ప్రక్రియపై అదనపు కలెక్టర్లు(స్థానిక సంస్థలు), జిల్లా పంచాయతీ అధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఈ నెల 29న ఉదయం 11:30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు.

ఓటర్ల జాబితా షెడ్యూల్

డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల:	సెప్టెంబర్ 6
అభ్యంతరాల స్వీకరణ :	సెప్టెంబర్ 7-13
అభ్యంతరాల పరిష్కారం :	సెప్టెంబర్ 19
ఓటర్ల తుది జాబితా ప్రచురణ:	సెప్టెంబర్ 21

జీతాల కోసం భగీరథ కార్మికుల ఆందోళన



ఆర్నెళ్లుగా జీతాలు రాకపోవడంతో మిషన్ భగీరథ కార్మికులు బుధవారం ఆందోళనకు దిగారు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలంలోని మిషన్ భగీరథ గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. వెంటనే వేతనాలు మంజూరు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. - ఇందల్వాయి

సౌత్ ఆర్‌ఆర్‌ఆర్‌లో మార్పులు

మొదటిపేజీ తరువాయి...

ప్రారంభించాలని, ఏవైనా సాంకేతిక , ఇతర సమస్యలుంటే కేంద్రంతో చర్చించాలని సూచించారు. సీఎస్‌తోపాటు మౌలిక వసతులు, ప్రాజెక్టుల సలహాదారు శ్రీనివాస రాజు, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు పనుల పురోగతిని అప్‌డేట్ చేయాలని సూచించారు. రేడియల్ రోడ్ల నిర్మాణంపైనా సీఎం పలు సూచనలు చేశారు. ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు కానున్న వివిధ పరిశ్రమలు, సంస్థలకు ఉపయోగకరంగా ఈ రోడ్ల ప్రణాళికలు ఉండాలని స్పష్టం చేశారు. రహదారుల అనుసంధాన ప్రదేశాలను ముందుగానే గుర్తించాలని, సిగ్నల్, ఇతర సమస్యల్లేకుండా సాఫీ గా ప్రయాణం సాగేందుకు వీలుగా నిర్మాణా లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. రేడియల్ రోడ్లు ఓఆర్‌ఆర్, ఆర్‌ఆర్‌ఆర్ అనుసంధానానికి అనువుగా ఉండాలని చెప్పారు. ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ , సీఎం ప్రత్యేక కార్యదర్శి వీ శేషాద్రి, సీఎం ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లతో పోలీసుల కుమ్మక్కు

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ) : విధుల్లో నిర్లక్ష్యం వహించిన పోలీస్ అధికారులను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్-2 ఐజీ వీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా ఆలంపూర్ సమీపంలో కొంతమంది పేకాడుతుండగా పోలీసులు పట్టుకున్నారు. పేకాటరాయుళ్లకు సహకరించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ జములప్ప, ఎస్సై విక్రం.. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఎస్సై శ్రీనివాసులుపై చర్యలు తీసుకున్నారు. అలాగే గద్వాల సీఐ భీమ్‌కుమార్‌ను వీఆర్‌కు అటాచ్ చేశారు.

తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం



తెలంగాణభవన్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్‌ఎస్ సీనియర్ నేత, వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు వహీద్ అహ్మద్ బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అసంబద్ధ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని వహీద్ డిమాండ్ చేశారు. కేసీఆర్‌పై అడ్డగోలుగా నోరుజారితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. - హైదరాబాద్, నమస్తే తెలంగాణ

ప్రజాసేవపై మక్కువ పెంచుకోండి

- విధి నిర్వహణ తర్వాతే ఏదైనా
- ట్రైనీ కానిస్టేబుళ్లతో డీజీపీ జితేందర్

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ) : ప్రజాసేవపై పోలీసులు మక్కువ పెంచుకోవాలని డీజీపీ జితేందర్ ట్రైనీ కానిస్టేబుళ్లకు హితబోధ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర పోలీసు అకాడమీలో ట్రైనీ కానిస్టేబుళ్లతో డీజీపీ సమావేశమై మాట్లాడారు. క్రమశిక్షణతో ఉంటేనే మంచి పోలీసులుగా రాణించగలరని తెలిపారు. జాయింట్ డైరెక్టర్ మురళీధర్, డిప్యూటీ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, నర్మద, సునీతామోహన్, అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ట్రైనీ కానిస్టేబుల్

డీజీపీని కలిసిన కన్ఫర్డ్ ఐపీఎస్‌లు


తెలంగాణ నుంచి కన్ఫర్డ్ ఐపీఎస్‌లుగా ఎంపికైన ఆరుగురు అధికారులు బుధవారం డీజీపీ జితేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. డీజీపీ జితేందర్‌ను కలిసిన వారిలో కొత్త ఐపీఎస్‌లు కే నరసింహ, బీ రాంరెడ్డి, ఏ భాస్కర్, ఎస్ చైతన్యకుమార్, సీహెచ్ శ్రీధర్, కే శిల్పవల్లి ఉన్నారు.

తీరని రుణం.. రైతుల రణం



స్పీకర్‌కు మాఫీ.. మాకెందుకు కాదు?

- రుణమాఫీకాని రైతుల ఆందోళన
- మైలార్‌దేవ్‌పల్లిలో 30శాతం మందికే మాఫీ
- రేషన్‌కార్డు లేదని చాలామందికి నష్టం
- పట్టాపాస్ బుక్ చూసే రుణమిచ్చారని రైతుల ఆగ్రహం



రుణమాఫీ కాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్న మైలార్‌దేవ్‌పల్లి రైతులు (ఫైల్)

వికారాబాద్, ఆగస్టు 21, (నమస్తే తెలంగాణ): జిల్లాలో రుణమాఫీకాని రైతులు ఆందోళన బాట పట్టారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు రుణమాఫీ అయి అర్హులైన పేద రైతులకు రుణమాఫీ కాక పోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. చిన్న చిన్న ప్రభుత్వ ఉద్యోగులను రుణమాఫీ జాబితా నుంచి తొలగించిన ప్రభుత్వం.. స్పీకర్ హోదాలో ఉన్న ప్రసాద్‌కుమార్ రుణాలను ఏ విధంగా మాఫీ చేశారని నిలదీస్తున్నారు. స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ నియోజకవర్గం లోని మైలార్‌దేవ్‌పల్లి గ్రామాన్ని నమస్తే తెలంగాణ సందర్శించగా రుణమాఫీ కాని రైతులు తమ గోడును వెల్లబోసుకున్నారు. మైలార్‌దేవ్‌పల్లిలో రూ.2లక్షల లోపు రుణాలు తీసుకున్న రైతులు సుమారు 600 మంది ఉండగా, వీరిలో కేవలం 180 మందికే రుణాలు మాఫీ అయ్యాయి. రైతుల్లో ఎక్కువమంది రేషన్‌కార్డు లేకపోవడంతోనే నష్టపోయారు. బ్యాంకులు రేషన్‌కార్డు చూసి రుణం ఇచ్చిందా? పట్టాదారు పాసు పుస్తకాన్ని చూసి రుణాలను మంజూరు చేసిందా? అంటూ ప్రభుత్వాన్ని మైలార్‌దేవ్‌పల్లి రైతులు ప్రశ్నిస్తున్నారు.

స్పీకర్‌కు మాఫీ పొరపాటే

- రుణమాఫీ డబ్బులు వాపస్
- వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్



రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ బ్యాంకు ఖాతా నంబర్‌కు రైతు రుణమాఫీ పథకం కింద రూ. 1,50,863 పొరపాటున జమ చేయబడినవని వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాండూరు డీసీసీబీలో టెక్నికల్ సమస్య వలన ఈ అమౌంట్ గడ్డం ప్రసాద్ కుమార్ బ్యాంకు ఖాతాలోకి జమ అయ్యాయని పేర్కొన్నారు. ఈ విషయంపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ స్పందిస్తూ తన బ్యాంకు అకౌంట్‌కు పొరపాటున వచ్చిన రూపాయలను తిరిగి అదే బ్యాంక్ ద్వారా ప్రభుత్వానికి వాపసు చేస్తున్నట్టు తెలిపారు.

ఇది చెల్లని ప్రభుత్వం



నేను వికారాబాద్‌లోని తెలంగాణ గొల్కొండ గ్రామీణ బ్యాంకులో రూ.1.80లక్షలు, మా భార్య పేరిట రూ.1.20 లక్షల రుణం తీసుకున్నాం. మూడువిడతల్లో మా ఇద్దరిలో ఏ ఒక్కరికీ రుణమాఫీ కాలేదు. దీనిపై ప్రశ్నిస్తే బ్యాంకు సిబ్బంది, వ్యవసాయాధికారులు ఒకరిపైఒకరు చెప్పుకుంటున్నారు. ఇది చెల్లని ప్రభుత్వం.

- సామ కరుణాకర్ రెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి

బ్యాంకర్ల నిర్లక్ష్యం రైతులకు నష్టం



నేను రూ.1.60 లక్షల రుణం తీసుకున్నాను. ప్రతీ ఏటా రెన్యూవల్ చేస్తున్నాను. మూడో విడతలో మాఫీ అవుతుందని వ్యవసాయాధికారులు చెప్పారు కానీ ఇప్పటివరకు మాఫీ కాలేదు. బ్యాంకు అధికారులను అడిగితే రెన్యూవల్ చేసుకోలేదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. బ్యాంకు అధికారులు చేసిన తప్పుకు రైతులకు నష్టం చేయడం ప్రభుత్వానికి తగదు.

- ఎస్.మాణిక్ రెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి

మిత్తి కట్టినా మాఫీ కాలేదు



నేను రూ.2 లక్షల రుణం తీసుకున్నాను. ప్రతీ ఏటా రెన్యూవల్ చేస్తున్నాను. మిత్తి డబ్బులను చెల్లిస్తే రూ.2 లక్షలలోపు రుణమాఫీ అవుతుందని వ్యవసాయాధికారులు తెలిపారు. మిత్తి డబ్బులను పదిహేను రోజుల క్రితమే చెల్లించాను. ఇప్పటికీ నా రుణం మాఫీ కాలేదు.

- ఆలంపల్లి మల్‌రెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి వికారాబాద్ జిల్లా


దేవుళ్ల మీద ఒట్టు..



కొడంగల్‌లో మాఫీ కనికట్టు

సీఎం రేవంత్ సొంత నియోజకవర్గంలో 35.54 శాతమే రుణమాఫీ

- 33,898 మంది రైతులు రుణమాఫీకి దూరం
- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న రైతులు



రుణమాఫీ కాలేదని కొడంగల్ వ్యవసాయ ఏడీ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న రైతులు

వికారాబాద్, ఆగస్టు 21, (నమస్తే తెలంగాణ): 'జోగులాంబ నుంచి మొదలుకుని ఏడుపాయల దాకా' కనిపించిన దేవుళ్లమీద ఒట్టేసి చెప్పిండు సీఎం రేవంత్‌రెడ్డి.. పంద్రాగస్టుకల్లా రైతులందరికీ రుణమాఫీ చేస్తానని. మూడు విడతల్లో మాఫీ జాబితాలు విడుదల చేసినా.. రాష్ట్రంలో రైతులందరికీ సంపూర్ణంగా రుణమాఫీ కాలేదు. కనీసం సీఎం రేవంత్‌రెడ్డికి ఓటేసి గెలిపించిన కొడంగల్ నియోజకవర్గ రైతులకైనా సంపూర్ణ రుణమాఫీ జరిగిందా ? అంటే అదీ లేదని రైతులు సమాధానమిస్తున్నారు. సీఎం సొంతనియోజకవర్గమైన కొడంగల్‌లో 35.54శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ అయింది. రేవంత్ రెడ్డికి ఓటేసిన పాపానికి వృద్ధులు మొదలుకొని మహిళలు, పిల్లలు సహా వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నామని కొడంగల్ రైతులు వాపోతున్నారు. కొడంగల్ గడ్డపై ప్రేముంటే ముందు ఇక్కడి రైతుల రుణం తీర్చుకోవాలని కోరుతున్నారు. వికారాబాద్ జిల్లా పరిధిలోకి వచ్చే కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాసుపేట్, దౌల్తాబాద్, దుద్యాల మండలాల్లో ఆయా బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతులు 52,305 మంది ఉన్నారు. వీరిలో 18,407 మంది మాత్రమే రుణమాఫీ పూర్తయ్యింది. మిగతా 33,898 మంది రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. జిల్లావ్యాప్తంగా రుణమాఫీ గ్రీవెన్స్‌కు సుమారు 5 వేల దరఖాస్తులు అందినట్టు వ్యవసాయాధికారులు వెల్లడించారు.

మాఫీ అంతా మాయ



సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన రైతు రుణమాఫీ అంతా మాయగా ఉంది. ఎవరికి మాఫీ అయ్యిందో తెలియడం లేదు. రూ.2లక్షల రుణమాఫీ అన్నారు.. కానీ లక్షలోపు కూడా లబ్ధి కాలేదు. మా రుద్రారం రైతులు కొడంగల్ వ్యవసాయ కార్యాలయానికి పరుగులు పెట్టాల్సి వస్తున్నది. ఏఈవోల బదిలీతో మాఫీ ఎందుకు కాలేదో తెలుసుకోవడం కష్టంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం సగం మందికి కూడా రుణమాఫీ చేయలేదు.

- రాఘవేందర్‌రెడ్డి, రుద్రారం, కొడంగల్

మాఫీ కోసం తిరుగుతున్నా



బొంరాస్‌పేట ఎస్‌బీఐలో రెండేండ్ల కింద రూ.1.80 లక్షల పంట రుణం తీసుకున్నా. ప్రభుత్వం చెప్పిన కటాఫ్ తేదీ ప్రకారం నాకు రుణమాఫీ కావాలి. కానీ జాబితాలో నా పేరు లేదు. ఎందుకు కాలేదో అడుగుదామని అధికారుల వద్దకు తిరుగుతున్నా.

-గోరుపల్లి క్రిష్ణయ్య, మదన్‌పల్లి, బొంరాస్‌పేట మండలం

తెల్వదంటే ఎవరిని అడగాలి ?



నా పేరు మీద రూ.25వేలు, నా భార్య మల్లమ్మ పేరు మీద 65,500లు మొత్తంగా 90,500ల అప్పు ఉంది. మా ఇద్దరిలో ఏ ఒక్కరికీ రుణమాఫీ జరగలే. బ్యాంకుకు పోయి అడిగితే లిస్టులో పేరు లేదు.. మాకు తెల్వదంటున్నారు. మరి ఎవరిని అడగాలి.. ఎక్కడికెళ్లి కలవాలి.. అర్హత ఉన్నప్పటికీ మాఫీ కాలేదు.

- ఎరుకలి పెద్ద ఆశన్న, హస్నాబాద్, కొడంగల్

మాఫీ మాటల్లోనే.. చేతల్లో కాదు



నేను కొడంగల్ ఎస్‌బీఐలో రూ.1.40 లక్షలు, నా కొడుకు దయాకర్ రూ.90 వేలు పంట రుణం తీసుకున్నాం. రేషన్‌కార్డును ప్రాతిపదికగా తీసుకున్నా ఇద్దరిలో ఒకరికైనా మాఫీ కావాలి. ఇద్దరికీ కాలేదు. ఇదేం రుణమాఫీయో అర్థం కావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ మాటల్లోనే ఉంది. చేతల్లో లేదు.

-గోవింద్‌రెడ్డి, రేగడిమైలారం, బొంరాస్‌పేట మండలం

మసిపూసి మారేడులా రుణమాఫీ

రైతులను కాంగ్రెస్ మోసం చేసింది • బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ) : పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుణమాఫీ తీరు మసిపూసి మారేడు కాయ చేసిన చందంగా ఉన్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 400కు పైగా హామీలు, 6 గ్యారంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ మభ్యపెట్టిందని, ఏ ఒక్క హామీనీ చిత్తశుద్ధితో అమలు చేయడం లేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తారని ప్రకటించారు. గ్రామ, మండల, జిల్లాస్థాయి కమిటీలు వేసి ప్రజాసమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు.

కోమటిరెడ్డి సొంతూర్లో కొందరికే మాఫీ

- బ్రాహ్మణవెల్లంలలో 47 శాతం మందికే రుణమాఫీ
- 925 మంది రుణాలు తీసుకుంటే 433మందికే రుణవిముక్తి
- 110 మందికి రేషన్ కార్డు లేక..50 మందికి వివరాలు లేక..
- 332 మంది వివరాలు గల్లంతు
- బ్యాంకుల చుట్టూ రైతుల చక్కర్లు



కోమటిరెడ్డి స్వగ్రామం బ్రాహ్మణవెల్లంలలో రుణమాఫీకాని రైతులు

నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): కోమటిరెడ్డి బ్రదర్స్‌లో ఒకరు రాష్ట్ర మంత్రి.. మరొకరు మునుగోడు ఎమ్మెల్యే. వీళ్ల సొంతూరు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లంల. రాష్ట్ర ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఈ ఇద్దరు సోదరుల సొంతూరులో రైతు రుణమాఫీ సగం మందికి కూడా కాలేదు. రుణమాఫీ చారిత్రాత్మకమని చెబుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్వగ్రామాన్ని 'నమస్తే తెలంగాణ' బృందం సందర్శించింది.

బ్రాహ్మణవెల్లంలలో మొత్తం 1,089 రైతు కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామ రైతులు నార్కట్‌పల్లి, చిట్యాల మండలాల పరిధిలోని ఎస్‌బీఐ(2), కెనరా(4), యూనియన్, ఇండియన్ బ్యాంకు, సహకార బ్యాంకులకు సంబంధించిన మొత్తం 9 బ్రాంచీలపై ఆధారపడతారు. వాటి పరిధిలో మొత్తం 925 మంది రైతులు పంట రుణాలు పొందినట్టు వ్యవసాయ అధికారుల అంచనా. వారిలో కేవలం 433 మందికే రుణమాఫీ లబ్ధి చేకూరినట్టు తెలిసింది. తొలివిడతలో 156 మందికి, రెండో విడతలో 88మందికి, మూడో విడతలో 189 రైతులకు మాఫీ వర్తించింది. 110 మందికి రేషన్ కార్డు లేదని, 50 మంది వివరాలు లేవని మాఫీ కాకపోగా, మిగిలిన 332 మందికి రుణమాఫీ వస్తుందా? రాదా? కారణాలేంటనేది ప్రశ్నార్థకంగా మారింది. వీరంతా నిత్యం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. బ్యాంకుల వద్ద వ్యవసాయ అధికారులను అడగమని తిప్పి పంపుతున్నట్టు చెప్పారు. వ్యవసాయ అధికారులు మాత్రం రుణమాఫీ డేటాతో మాకు సంబంధంలేదని స్పష్టం చేస్తున్నారు. డేటా బ్యాంకుల వద్ద నుంచి ప్రభుత్వానికి వెళ్లింది కాబట్టి వాళ్లే సమాధానం చెప్పాలని దాటవేస్తున్నారు. బ్యాంకర్ల ఈసడింపులు, వ్యవసాయ అధికారుల నిస్సహాయత నడుమ చెప్పులు అరిగేలా తిరుగుతున్నామని బ్రాహ్మణవెల్లంల రైతులు చెప్తున్నారు.

ఖాతాకు పనికొచ్చిన ఆధార్.. మాఫీకి పనిచేయదా ?



మూడేండ్ల కింద నార్కట్‌పల్లి బ్యాంకులో 50వేలు లోన్ తీసుకున్న. ప్రభుత్వం మూడు సార్లు మాఫీ చేసినా లిస్టులో నా పేరు రాలేదు. ఎందుకు రాలేదో ఎవరూ చెప్పడం లేదు. బ్యాంకు వాళ్లని అడిగితే నీ ఆధార్‌కార్డు లింక్ కాలేదు అంటున్నరు. నేను ఆధార్ కార్డు పెట్టే ఖాతా తీసుకున్నా. ఖాతాకు పనికొచ్చిన ఆధార్.. మాఫీకి లేదంటే ఎట్లనో చెప్పేటోళ్లే లేరు.

- మైల పిచ్చయ్య, రైతు, బ్రాహ్మణవెల్లంల

పేరుకే పెద్దూరు..



నేను ఇండియన్ బ్యాంకులో లక్షా 30వేల క్రాప్ లోన్ తీసుకున్న. రుణమాఫీపై గంపెడాశ ఉండె. ప్రతియేటా వడ్డీకట్టినా నా లోన్ మాఫీ కాలేదు. 20 రోజుల నుంచి బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్న. వీళ్లనడిగితే వాళ్లనడుగు.. వాళ్లనడిగితే వీళ్లడుగు అంటున్నరు. పేరుకు మాత్రం పెద్దూరు. న్యాయం మాత్రం జరుగుతలేదు.

- మైల రామలింగయ్య, కొత్తగూడెం, బ్రహ్మణవెల్లంల


చెప్పులరిగేలా తిరుగుతున్నా



నేను బ్యాంకులో రూ.40వేలు లోన్ తీసుకున్నా. ప్రతి సంవత్సరం వడ్డీ కడుతున్న. తొలి విడుతలోనే రుణమాఫీ కావాలి. ఇప్పటివరకు కాలేదు. ఎందుకని అడిగితే చెప్పేటోళ్లే లేరు. ఆధార్ కార్డు అడిగితే ఇచ్చిన. రేషన్ కార్డు కూడా ఉంది. కానీ ఎందుకు కాలేదో తెలుస్తలేదు. చెప్పులరిగేలా తిరుగుతున్నా. దండం పెడుతున్న సారూ..న్యాయం చేసి ఆదుకోండి.

-కాసం అయిలయ్య, రైతు, బ్రాహ్మణవెల్లంల

మా ఇంట్లో ఎవరికీ కాలేదు



నా పేరు మీద లక్షా 5 వేలు, మా ఆయన పేరున 98వేలు.. మొత్తం 2 లక్షల 3 వేల రూపాయలు క్రాప్ లోన్ ఉంది. మా ఇద్దరిలో ఎవరికీ రుణమాఫీ కాలేదు. బ్యాంకు అధికారులు పైనున్న మూడు వేలు కట్టండి ఫస్ట్ అంటున్నరు. కడితే ఇస్తారా అంటే దానికి గ్యారంటీ ఇస్తలేరు. ఈ సర్కార్‌లో అంతా అయోమయంగా ఉంది.

- పల్లె కవిత, బ్రాహ్మణ వెల్లంల

సీఎంనే అడుక్కోపో అన్నరు



నార్కట్‌పల్లి కో అపరేటివ్ బ్యాంకులో అరవై వేలు క్రాప్ లోన్ తీసుకున్న. నాకు ఫస్టే మాఫీ కావాల్సి ఉండే.. కానీ రాలేదు. అప్పటి నుంచి బ్యాంకులు, వ్యవసాయ ఆఫీసర్ల చుట్టూ తిరుగుతున్న. ఆన్‌లైన్‌లో పేరెందుకు లేదని అడిగితే.. సీఎం రేవంత్‌రెడ్డినే అడుక్కోపో అంటున్నరు. మా ఊరి మాజీ సర్పంచ్ చేత కూడా చెప్పించిన. పట్టించుకున్నోళ్లు లేరు. ఇది దండుగ ప్రభుత్వం.

-కాసం మల్లయ్య, రైతు, బ్రాహ్మణవెల్లంల

రుణమాఫీపై బీఆర్ఎస్ రణం

119 నియోజవకర్గాల్లో నేడు ధర్నాలు

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీ కోసం బీఆర్ఎస్ రణం షురూ చేసింది. సర్కార్ మెడలు వంచి ఎటువంటి ఆంక్షల్లేకుండా రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్ పార్టీ గురువారం రాష్ట్రవ్యాప్తంగా 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ధర్నా చేపట్టనున్నది. రాష్ట్ర రైతాంగానికి బాసటగా నిలిచేందుకు బీఆర్ఎస్ కార్యాచరణ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు పార్టీ శ్రేణులను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలతో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కార్యాచరణను రూపొందించారు. పార్టీని వీడిన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలు, కాంగ్రెస్ సర్కార్‌లో మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల కేడర్‌ను సమాయత్తపరిచి కార్యక్రమ విజయానికి కావలసిన ఏర్పాట్లు చేసింది. ఏ నియోజకవర్గాల్లో ఎవరి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నారో కేటీఆర్ బుధవారం పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రూ. 2 లక్షల వరకు అందరికీ రుణమాఫీ అయ్యిందని చెబుతుంటే మంత్రులు మాత్రం ఇంకా రుణమాఫీ పూర్తికాలేదని చెబుతున్న వైనాన్ని రైతాంగానికి తెలిపేలా కార్యాచరణను పార్టీ సిద్ధం చేసింది. ఎన్నికలు కాగానే రుణమాఫీకి రూ.40 వేల కోట్లు అవసరమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొని, మంత్రివర్గ సమావేశం రూ.31 వేల కోట్లకే అనుమతిచ్చారు. రుణమాఫీకి బడ్జెట్లో రూ.26వేల కోట్లకు ఆమోదం తెలిపి, కేవలం రూ.18వేల కోట్లు ఖర్చు చేసి రైతులను నిలువునా ముంచారని ప్రతీ రైతుకు తెలిసేలా ధర్నాలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో కనీసం 40శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ లబ్ధిచేకూరలేదని సమాచారం ఉన్న నేపథ్యంలో బీఆర్ఎస్ ధర్నా పిలుపునకు రైతాంగం నుంచి విశేష స్పందన వస్తున్నది. అడ్డగోలు ఆంక్షలతో రైతులకు టోపీ పెట్టిన ప్రభుత్వ వైఖరిపై రైతులోకం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. ఈ నేపథ్యంలో నేడు గులాబీ దళం చేపట్టనున్న నిరసనలో పాల్గొనేందుకు రైతులు స్వచ్ఛందంగా తరలివస్తారని భావిస్తున్నారు.

ఉత్తమ్ ఊర్లో ఉత్తమాటే!

- మంత్రి సొంత గ్రామంలో 45శాతమే రుణమాఫీ
- మంత్రిపై బుసలుకొడుతున్న తాటిపాముల రైతులు
- 992 రైతులకుగాను 537 మందికే మాఫీ



మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సొంత ఊరు సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలోని తాటిపాముల గ్రామ పంచాయతీ

సూర్యాపేట, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): 'నీకు రుణమాఫీ అయిందా? అంటే నీకు అయిందా? అనేదే ఇప్పుడు పల్లెల్లో ఏ నలుగురు కలిసినా వినిపిస్తున్న ముచ్చట. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో కాంగ్రెస్ రుణమాఫీ చేసిందని గొప్పలు చెబుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సొంతూరు సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామాన్ని నమస్తే తెలంగాణ సందర్శించింది. మంత్రి స్వగ్రామంలో 45శాతానికి మించి రుణమాఫీ కాకపోవడం గమనార్హం. ఈ గ్రామంలో 992 మంది రైతులకుగాను మూడు విడతల్లో కలిపి కేవలం 537మందికే రుణమాఫీ అయినట్టు తెలుస్తున్నది. తొలి విడతలో 357 మందికి, రెండో విడతలో 165 మందికి రుణమాఫీ అయ్యింది. మూడో విడతలో జాబితా ప్రకారం 15 మందికి మించి కాలేదని తెలుస్తున్నది. గ్రామంలో ఎవరినీ మందలించినా ఎక్కడిదయ్యా రుణమాఫీ అంటున్నారు. 'మాకు రాలేదు.. మాకు రాలేదు' అనే వారే ఎక్కువగా ఉన్నారు. గ్రామస్తుల మాట ప్రకారం ఉత్తమ్ ఊర్లో మాఫీ ఉత్తదేనని తేలింది. ప్రభుత్వం దిగివచ్చి ఇచ్చిన హామీ ప్రకారం రుణాలు మాఫీ చేయాలని, లేని పక్షంలో రైతుల ఆగ్రహం చవి చూడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

గివేం కొర్రీలు ..



ఎన్నికలప్పుడు పాస్ పుస్తకం ఉన్నోళ్లంతా బ్యాంకులకు వెళ్లి రుణం తీసుకోండి.. అధికారంలోకి రాగానే రెండు లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ ఇవ్వకముందే మేము రుణాలు తీసుకున్నాం. ఇయ్యాల రేషన్‌కార్డుకే రెండు లక్షలట. మా కుటుంబం అందరి పేర్లు ఒకే రేషన్ కార్డులో ఉన్నాయి. కాబట్టి మీకు రుణమాఫీకాదని అధికారులు అంటున్నారు. గివేం కొర్రీలు.. ఇదెక్కడి న్యాయం.

- కారుపోతుల అంజయ్య, తాటిపాముల, తిరుమలగిరి మండలం

రుణమాఫీ గందరగోళం



నేను 30 వేలు పంట రుణం తీసుకున్నా. అయినా రుణమాఫీ కాలేదు. ఇదెక్కడి న్యాయమో అర్థం కావడం లేదు. ఏమి అడిగినా లిస్టులో మీ పేరు లేదు.. మాకు తెలియదని అధికారులు అంటున్నరు. కావాలంటే దరఖాస్తు ఇవ్వండి చెబుతున్నారు. రుణమాఫీ అంతా గందరగోళం.

- కారుపోతుల శ్రీకాంత్, తాటిపాముల, తిరుమలగిరి మండలం

ఇంత మోసమా..?



నేను, నా భర్తకు వేర్వేరుగా పాస్ బుక్కులు ఉన్నాయి. నేను లక్షా 36వేలు, నా భర్త నక్కల యాదగిరి లక్షా 20 వేలు తీసుకున్నాం. ఇద్దరి పేర్లు ఒకే రేషన్ కార్డులో ఉన్నాయని మాకు రుణమాఫీ కాలేదని అధికారులు చెబుతున్నరు. భార్యభర్తలకు రెండు రేషన్ కార్డులు ఉంటాయా..? ఇంత మోసమా..? రుణం ఇచ్చేటప్పుడు ఏ కండిషన్లు పెట్టకుండా రుణమాఫీ చేసేటప్పుడు ఈ కండిషన్లు ఏంటిదో.

నక్కల సైదమ్మ, తాటిపాముల, తిరుమలగిరి మండలం

ఇదేం రుణమాఫీ.. ఇదేం ప్రభుత్వం



నేను లక్ష 60వేల పంట రుణం తీసుకున్నా. మూడో విడుతలోనైనా రుణమాఫీ జరుగుతుందని ఆశించాను. నాకు రేషన్ కార్డు లేదని జాబితాలో పేరు రాలేదు. ఇదేం ప్రభుత్వం. ఇదేం రుణమాఫీ. బ్యాంకుల్లో అప్పులు తీసుకునేందుకు ఉన్న నిబంధనలు మాఫీ చేసేందుకు వర్తించవా ?

- దయా యాదవ్, తాటిపాముల, తిరుమలగిరి మండలం

గులాబీ నేతలకు పోలీసు నోటీసులు

నేటి బీఆర్ఎస్ ఆందోళనలను సర్కార్ అడ్డుకునే యత్నం

బాల్కొండ, ఆగస్టు 21: రుణమాఫీ పేరిట రైతులను అరిగోస పెడుతున్న రేవంత్ సర్కారుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ గురువారం తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలను అడ్డుకునే ప్రయత్నాలకు ప్రభుత్వం తెరలేపింది. ధర్నాలకు వెళ్లొద్దని పోలీసుల ద్వారా నోటీసులు జారీ చేయిస్తున్నది. ఆందోళన కార్యక్రమాలకు ప్రభుత్వ అనుమతి లేదని, ఒకవేళ ఆ కార్యక్రమానికి వెళ్తే చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామని పోలీసులు నోటీసులు జారీ చేయడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అన్నదాతలకు అండగా చేపట్టే ఈ కార్యక్రమానికి రావొద్దని పోలీసులు ఆదేశించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.


నోటీసు
To.

డెకథ్లాన్ 933 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ, ఆగస్టు 21: స్పోర్ట్స్ పరికరాల సంస్థ డెకథ్లాన్..భారత్‌లో తన వ్యాపారాన్ని విస్తరించడానికి వచ్చే ఐదేండ్లలో 100 మిలియన్ల యూరోలు(రూ.933 కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. రిటైల్ అవుట్‌లెట్ల సంఖ్యను పెంచుకోవడంతోపాటు ప్లాంట్ సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఈ నిధులను వినియోగించనున్నట్లు డెకథ్లాన్ ఇండియా సీఈవో శంకర్ ఛటర్జీ తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 90 స్టోర్లు ఉండగా, వచ్చే ఐదేండ్లలో వీటిని 190కి పెంచుకోనున్నట్లు ఆయన చెప్పారు. ఇక నుంచి ప్రతియేటా 10-15 కొత్త స్టోర్లను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

ఐసీఐసీఐ లాంబార్డ్ ఎలివేట్

హైదరాబాద్, ఆగస్టు 21: ఐసీఐసీఐ లాంబార్డ్..ఆరోగ్య బీమా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చే ఎలివేట్ పాలసీని అందుబాటులోకి తీసుకొచ్చింది. అత్యాధునిక ఫీచర్లతో రూపొందించిన ఈ బీమా పాలసీలో యాడ్-ఆన్‌లతో లోడ్ చేసుకోవచ్చునని తెలిపింది. ఊహించని వైద్య అత్యవసర పరిస్థితుల అవసరాలను తీర్చడానికి ఈ పాలసీని రూపొందించినట్లు కంపెనీ హెడ్ వివేక్ శ్రీవాత్సవ తెలిపారు. పరిమిత కవరేజ్‌తో పాలసీదారులకు నిరంతర కవరేజ్ ఇవ్వనున్నదని, యాడ్-ఆన్ అస్తమా, డయాబెటిస్, హైపర్‌టెన్షన్, ఊబకాయ వంటి వ్యాధులు ఉన్నవారు 30 రోజుల తర్వాత పాలసీ ప్రయోజనం పొందవచ్చునన్నారు.

అమూల్ అదుర్స్

న్యూఢిల్లీ, ఆగస్టు 21: పాల ఉత్పత్తుల విక్రయ సంస్థ అమూల్ అదరగొట్టింది. ప్రపంచ వ్యాప్తంగావున్న ఫుడ్ బ్రాండ్లలో అత్యంత బలమైన బ్రాండ్‌గా అమూల్ నిలిచింది. ఈ విషయాన్ని ఫుడ్ అండ్ డ్రింక్ 2024 పేరుతో బ్రాండ్ ఫైనాన్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ప్రపంచ పాల ఉత్పత్తుల బ్రాండ్లలో ఇప్పటికే తొలి స్థానంలో కొనసాగుతున్న అమూల్.. తాజాగా ఫుడ్ బ్రాండ్లలో కూడా ఇదే స్థానాన్ని దక్కించుకోవడం విశేషం.

కార్లకు తగ్గిన గిరాకీ

- దేశవ్యాప్తంగా డీలర్ల వద్ద అమ్ముడుపోని 7 లక్షల ప్యాసింజర్ వెహికిల్స్
- విలువ రూ.73,000 కోట్లు.. వెల్లడించిన ఫాడా
- వాహన ఉత్పత్తికి విరామం దిశగా ఆటో రంగ సంస్థలు



న్యూఢిల్లీ, ఆగస్టు 21: కార్లకు ఆదరణ తగ్గింది. ఆశించిన స్థాయిలో అమ్ముడుపోవడం లేదు. దేశవ్యాప్తంగా డీలర్ల వద్ద మిగిలిపోయిన ప్యాసింజర్ వెహికిల్స్ (పీవీ) సంఖ్య 7 లక్షలకు చేరింది. వీటి విలువ రూ.73,000 కోట్లుగా ఉందని ఆటోమొబైల్ డీలర్ల సంఘ సమాఖ్య (ఫాడా) తాజాగా వెల్లడించింది. గత 70-75 రోజులుగా వాహనాలు డీలర్ల వద్ద అలాగే ఉంటున్న పరిస్థితి నెలకొన్నట్టు స్పష్టం చేసింది.

ఇలాగైతే కష్టమే

డీలర్ల వద్ద పేరుకుపోతున్న వాహన నిల్వలు.. యావత్తు భారతీయ ఆటో రంగ పరిశ్రమనే సంక్షోభంలోకి నెట్టే ప్రమాదం ఉందని ఫాడా అధ్యక్షుడు మనీష్ రాజ్ సింఘానియా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ప్యాసింజర్ వెహికిల్స్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ (పీవీ ఓఈఎం)ను డీలర్ల వైఫల్యంపై దృష్టి సారించాలని కోరారు. క్షేత్రస్థాయి పరిస్థితులను గమనించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. నిజానికి గత నెల జూలైలో దేశీయంగా పీవీ సేల్స్ నిరుడుతో పోల్చితే 10 శాతం పెరిగాయి. 3,20,129 యూనిట్లకు చేరాయని ఫాడానే చెప్తున్నది. అయినప్పటికీ కంపెనీల నుంచి డీలర్లకు వాహనాల సరఫరా పెరగడంతో గోడౌన్లలోనే ఉండిపోక తప్పడం లేదు. ఫలితంగా డీలర్లకు నష్టాలు మరింతగా పెరుగుతున్నాయి.

ఆఫర్లు తేవాలి..

మార్కెట్‌లో మందగించిన అమ్మకాలను మళ్లీ పరుగులు పెట్టించేందుకు ఆయా సంస్థలు తమ కార్లపై ఆఫర్లు ప్రకటించాలని ఫాడా సూచిస్తున్నది. ధరలను తగ్గించడం, వారంటీలను పెంచడం, ఫ్రీ సర్వీస్ గడువును పెంచి ఇతర ప్రోత్సాహకాలను కొనుగోలుదారులకు ఇవ్వడం కలిసొస్తుందని డీలర్లు అభిప్రాయపడుతున్నారు. రాబోయే పండుగ సీజన్ దృష్ట్యా డిస్కౌంట్లు మార్కెట్‌ను ఉత్సాహపర్చగలవని కూడా చెప్తున్నారు. ఇక ఈ క్లిష్ట పరిస్థితుల్లో డీలర్లపై ఒత్తిడిని తగ్గించేందుకు తయారీదారులు ప్రొడక్షన్ హాలిడే తీసుకోవడం కూడా మంచిదేనన్న సలహాలు డీలర్ల నుంచి వస్తున్నాయి. కరోనా సమయంలో ఎదురైన విపత్కర పరిస్థితులను ఉత్పత్తి విరామంతోనే అటు కంపెనీలు, ఇటు డీలర్లు అధిగమించారు.



> కార్ల తయారీ సంస్థలు మార్కెట్‌లో రిటైల్ అమ్మకాలకు తగ్గట్టుగా తమ ఉత్పత్తిని సవరించుకోవాల్సిన అవసరం ఉన్నది. రాబోయే నెలల్లో డీలర్లకు వాహనాల సరఫరాను తగ్గిస్తేనే మంచి దన్నట్టుగా పరిస్థితులు నెలకొన్నాయి. సేల్స్ పెరిగేందుకు కంపెనీలూ కృషి చేయాలి. అప్పుడే డీలర్ల వద్ద మిగిలిపోయిన వాహనాలు త్వరత్వరగా విక్రయించడానికి వీలుంటుంది.
>
> -మనీష్ రాజ్ సింఘానియా, ఫాడా అధ్యక్షుడు

హీరో నుంచి మరిన్ని స్కూటర్లు



నూఢిల్లీ, ఆగస్టు 21: ద్విచక్ర వాహన సంస్థ హీరో మోటోకార్ప్..స్కూటర్ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయడంతోపాటు 125 సీసీ సామర్థ్యం కలిగిన మరిన్ని బైకులను విడుదల చేయడానికి సిద్ధమైంది. ఇతర పోటీ సంస్థల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడానికి మరిన్ని పెట్రోల్, ఎలక్ట్రిక్ స్కూటర్లను విడుదల చేయనున్నట్లు కంపెనీ సీఈవో నిరంజన్ గుప్తా వెల్లడించారు. అలాగే 125 సీసీ కెపాసిటీ కలిగిన ఎక్స్‌ట్రీమ్ 125ఆర్ కెపాసిటీని నెలకు 40 వేల యూనిట్లకు పెంచుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం నెలకు 25 వేల యూనిట్లు ఉత్పత్తి అవుతున్నాయి. 125 నుంచి 160 సీసీ సామర్థ్యం కలిగిన పలు మాడళ్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు తెలిపారు.

ఆభరణాల ఎగుమతులు డౌన్

జూలై నెలలో 22 శాతం తగ్గుదల: జీజేఈపీసీ

ముంబై, ఆగస్టు 21: ఆభరణాల ఎగుమతులు తగ్గుముఖం పట్టాయి. గత నెలలో 22 శాతం తగ్గి 1,665.4 మిలియన్ డాలర్లకు పడిపోయాయని జెమ్ అండ్ జ్యూవెల్లరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్(జీజేఈపీసీ) వెల్లడించింది. అంతర్జాతీయంగా ముఖ్యంగా అమెరికా, చైనా దేశాల్లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా ఆభరణాలకు డిమాండ్ పడిపోవడానికి ప్రధాన కారణమని జీజేఈపీసీ చైర్మన్ విపుల్ షా తెలిపారు. అలాగే కట్, పాలిష్ డైమండ్ల ఎగుమతులు కూడా 21 శాతం తగ్గి 1,174 మిలియన్ డాలర్ల నుంచి 907.67 మిలియన్ డాలర్లకు తగ్గాయని పేర్కొన్నారు. బంగారం ఆభరణాలు కూడా 10.53 శాతం తగ్గి 603 మిలియన్ డాలర్ల నుంచి 530.38 మిలియన్ డాలర్లకు దిగాయని తెలిపింది.

జొమాటో చేతికి పేటీఎం ఎంటర్‌టైన్‌మెంట్

న్యూఢిల్లీ, ఆగస్టు 21: పేటీఎం..తనకున్న ఎంటర్‌టైన్‌మెంట్ టికెటింగ్ వ్యాపారాన్ని జొమాటోకు విక్రయిస్తున్నట్లు ప్రకటించింది. ఒప్పందం విలువ రూ.2,048 కోట్లు. ఎంటర్‌టైన్‌మెంట్‌లో భాగంగా పేటీఎం యాప్ కింద సినిమా టికెట్‌లతోపాటు స్పోర్ట్స్, ఈవెంట్లకు సంబంధించిన అన్ని రకాల టికెట్లను విక్రయిస్తున్నది. ఎంటర్‌టైన్‌మెంట్ టికెటింగ్ వ్యాపారాన్ని జొమాటో లిమిటెడ్‌కు విక్రయిస్తున్నట్లు వన్ 97 కమ్యూనికేషన్స్ బుధవారం ప్రకటించింది.

నియామకాలకు కార్పొరేట్లు నో

న్యూఢిల్లీ, ఆగస్టు 21: దేశీయ కార్పొరేట్లు ఉద్యోగుల నియామకాలను భారీ స్థాయిలో తగ్గించుకున్నాయి. 2022-23లో 5.7 శాతం వృద్ధితో నియామకాలు చేపట్టిన కార్పొరేట్ సంస్థలు.. ఆ మరుసటి ఏడాది 1.5 శాతానికి తగ్గించుకున్నాయని బీవోబీ వెల్లడించింది. రిటైలింగ్, ట్రేడింగ్, మౌలిక, రియల్టీ, రంగాల్లో పెరిగినప్పటికీ..ఆతిథ్య, లాజిస్టిక్స్, బిజినెస్ సర్వీసెస్, టెక్స్‌టైల్ రంగాల్లో తగ్గుముఖం పట్టాయని పేర్కొంది.

ఏఐ విమానాల్లో వైర్‌లెస్ ఎంటర్‌టైన్‌మెంట్ సేవలు

న్యూఢిల్లీ, ఆగస్టు 21: ఎయిర్ ఇండియా ప్రయాణికులకు వైర్‌లెస్ ఎంటర్‌టైన్‌మెంట్ సేవలు ప్రారంభించింది. ప్రస్తుతం ఈ సేవలు పెద్ద విమానాల్లో మాత్రమే అందిస్తున్నట్లు, దశలవారీగా మిగతా విమానాల్లో కూడా ప్రారంభించబోతున్నది. విమాన ప్రయాణ సమయంలో వినోదం అందించాలనే ఉద్దేశంతో విస్తా పేరుతో ఈ నూతన సేవలకు శ్రీకారం చుట్టినట్లు, ప్రస్తుతం బీ777, ఏ350 ఎయిర్‌క్రాఫ్ట్‌ల్లో మాత్రమే అందిస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది. ప్రయాణికులు తమ డివైజుల్లో ఎంటర్‌టైన్‌మెంట్ కంటెంట్‌ను తిలకించవచ్చునని తెలిపింది.

ఈ-కామర్స్ వృద్ధి ఆందోళనకరం

- కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్
- తక్కువ ధరలు సరికాదు
- సంప్రదాయ రిటైల్ మార్కెట్‌ను కూలదోస్తున్నాయని మండిపాటు



న్యూఢిల్లీ, ఆగస్టు 21: దేశీయ ఆన్‌లైన్ మార్కెట్‌పై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ విరుచుకుపడ్డారు. ఈ క్రమంలోనే దేశంలో వేగంగా విస్తరిస్తున్న ఈ-కామర్స్ వృద్ధి ఆందోళనకరమైన అంశమేనని వ్యాఖ్యానించారు. ఈ-కామర్స్ సంస్థలు అవలంబిస్తున్న ధరల విధానం బాగాలేదని, సంప్రదాయ రిటైల్ రంగాన్ని అది కూలదోస్తున్నదని మండిపడ్డారు. బుధవారం ఇక్కడ 'భారత్‌లో ఉపాధి, వినియోగదారుల సంక్షేమంపై ఈ-కామర్స్ నికర ప్రభావం' నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంప్రదాయ రిటైల్ మార్కెట్‌లో ఉద్యోగ-ఉపాధి అవకాశాలను ఈ-కామర్స్ వేదికలు దెబ్బతీస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలోనే 'ఈ దేశానికి ఈ రకమైన ధరల విధానాలు లాభం చేస్తాయా?' అని ప్రశ్నించారు. తక్కువ ధరలతో సంప్రదాయ మార్కెట్‌కు వినియోగదారులను ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థలు దూరం చేస్తున్నాయని, ఇది ఇలాగే కొనసాగితే వీధుల్లో దుకాణాలు మూతబడటం ఖాయమన్నట్టుగా మాట్లాడారు. ఆన్‌లైన్ మార్కెటింగ్‌తో అంతా ఎక్కడికక్కడే షాపింగ్ చేస్తున్నారని, దీనివల్ల సమాజంలో ఒక రకమైన అంతరం కూడా వ్యాపిస్తున్నదని చెప్పారు.

అమెజాన్‌తో ఒరిగేదేమీ లేదు

ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ భారత్‌లో పెడుతున్న పెట్టుబడులు ఇక్కడ దానికి వాటిల్లుతున్న నష్టాలను భర్తీ చేసుకోవడానికేనని గోయల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమెజాన్ దాని స్వలాభం కోసమే భారత్‌లో 1 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ప్రకటించిందని, అంతేతప్ప భారత్‌కు మంచి చేద్దామని మాత్రం కాదన్నారు. ఆన్‌లైన్ మార్కెట్ పెరిగిపోతే చిరు, చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. ఇదిలావుంటే ఆన్‌లైన్ వ్యాపారులు దేశంలో 1.58 కోట్ల ఉద్యోగాల్ని సృష్టించారని ఈ రిపోర్టు తెలిపింది. ఇందులో 35 లక్షల మహిళలు కూడా ఉన్నారు. 17.6 లక్షల రిటైల్ సంస్థలు ఈ-కామర్స్ మార్కెట్‌తో భాగస్వాములయ్యాయని కూడా తేలింది. అయితే ఈ వృద్ధి దేశానికి మంచి కన్నా భవిష్యత్తులో చెడే ఎక్కువగా చేస్తుందని మంత్రి గోయల్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాగ్నిజెంట్ నూతన చైర్మన్‌గా రాజేశ్ వారియర్



న్యూఢిల్లీ, ఆగస్టు 21: దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన కాగ్నిజెంట్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రాజేశ్ నంబియార్ తన పదవికి రాజీనామా చేశారు. నాస్కాం ప్రెసిడెంట్‌గా నియమితులు కావడంతో ఆయన కాగ్నిజెంట్‌కు రాజీనామా చేశారు. దీంతో కాగ్నిజెంట్ గ్లోబల్ హెడ్‌గా పదొన్నతి పొందిన రాజేశ్ వారియర్‌కు అదనంగా ఇండియా సీఎండీగా బాధ్యతలు అప్పగించింది. వచ్చే నెల 2న గ్లోబల్ హెడ్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించబోతున్న రాజేశ్..అక్టోబర్ 1 నుంచి సీఎండీగా వ్యవహరించనున్నారు. కాగ్నిజెంట్‌లో చేరకముందు రాజేశ్..ఈవీపీ, ఇన్ఫోసిస్‌లో విధులు నిర్వహించారు. అలాగే మైక్రోసాఫ్ట్ బిజినెస్ డిజిటల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా కూడా పనిచేశారు.

చిత్రం



ఇదే ట్రెండ్ కొనసాగాలి

'నా సినిమా వచ్చి మూడేళ్లయింది. ఇక నుంచి ఎక్కువ సినిమాలు చేస్తాను. 'పుష్ప-2' అద్భుతంగా రూపుదిద్దుకుంటున్నది. డిసెంబర్ 6న అస్సలు తగ్గేదేలే. ఇది మాత్రం ఫిక్స్' అన్నారు అల్లు అర్జున్. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన 'మారుతినగర్ సుబ్రమణ్యం' ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రావు రమేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి లక్ష్మణ్ కార్య దర్శకుడు. అంకిత్, రమ్య పసుపులేటి జంటగా నటించారు. బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మాతలు. ఈ చిత్రానికి అగ్ర దర్శకుడు సుకుమార్ సతీమణి తబితా సుకుమార్ సమర్పకురాలిగా వ్యవహరిస్తున్నది. ఈ నెల 23న విడుదల కానున్నది. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ 'నాకు సుకుమార్‌గారు అంటే చాలా ఇష్టం. ఎంతిష్టమో మాటల్లో చెప్పలేను. తబితాగారు చాలా కంఫర్టబుల్ పొజిషన్‌లో ఉండి ఈ సినిమాను ప్రొడ్యూస్ చేయడానికి ముందుకు రావడం అభినందనీయం. రావు రమేష్ గారు నా మనసుకు నచ్చిన ఆర్టిస్టు. బద్రినాథ్ సినిమా టైంలోనే 'మీరు ఇండస్ట్రీని ఏలుతారు సర్' అని చెప్పా. ఈ మధ్య చిన్న సినిమాలకు ఆడియెన్స్ మంచి ఆదరణ కనబరుస్తున్నారు. ఇదే ట్రెండ్ కొనసాగాలని కోరుకుంటున్నా' అన్నారు. ఈ సినిమా చూసి బాగా నవ్వుకున్నానని, సినిమాల్లో బాగా పర్‌ఫార్మ్ చేసే వాళ్లను తాను పెద్ద హీరోగా చూస్తానని, తన దృష్టిలో రావు రమేష్‌గారు పెద్ద హీరోనే అని సుకుమార్ చెప్పారు. చిత్ర సమర్పకురాలు తబిత మాట్లాడుతూ 'ఈ సినిమా చూసినప్పుడు చక్కటి వినోదం, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో గొప్పగా అనిపించింది. ఇలాంటి మంచి సినిమా ప్రేక్షకులందరికి రీచ్ కావాలనే ఉద్దేశ్యంతో సమర్పకురాలిగా ఉండటానికి ముందుకొచ్చా' అని చెప్పింది.

కంటెంట్‌ను బట్టే విజయం



'ప్రస్తుతం మంచి కంటెంట్ ఉంటే చిన్న సినిమాలు కూడా పెద్ద విజయాలను సాధిస్తున్నాయి. సినిమా చిన్నా పెద్దా అనే విషయం కంటే కంటెంటే ప్రధానం. తమిళంలో విజయవంతమైన ఈ చిత్రం తెలుగులో కూడా సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది' అన్నారు రామ్‌గోపాల్‌వర్మ. హారర్ థ్రిల్లర్ 'డీమాంటీ కాలనీ-2' ఈ నెల 23న తెలుగులో విడుదలకానుంది. అరుల్‌నిధి, ప్రియా భవానీ శంకర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి అజయ్ ఆర్ జ్ఞానముత్తు దర్శకుడు. బి.సురేష్ రెడ్డి, మానస రెడ్డి తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. మంగళవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. హారర్ కంటే థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఎక్కువగా ఆకట్టుకుంటాయని, తమిళంలో మాదిరిగానే తెలుగులో కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని నిర్మాత బి.సురేష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సినిమాకు మరో రెండు భాగాలను తెరకెక్కించబోతున్నామని దర్శకుడు ఆర్.జ్ఞానముత్తు తెలిపారు.

చనిపోయిన వారు తిరిగొస్తే?



రిషి, ప్రియాంక కుమార్ జంటగా తెలుగు, కన్నడ భాషల్లో రూపొందిన చిత్రం 'రుద్ర గరుడ పురాణం'. కేఎస్ సందీప్ దర్శకుడు. అశ్విన్ విజయ్, లోహిత్ నిర్మాతలు. నాలుగు దక్షిణాది భాషల్లో విడుదల కానుంది. బుధవారం నిర్మాత, దర్శకుడు మధుర శ్రీధర్ టీజర్‌ను లాంచ్ చేశారు. హీరో రిషి మాట్లాడుతూ 'గరుడ పురాణంలోని అంశాలు ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించాం. 25 ఏళ్ల క్రితం ఓ బస్సు ప్రమాదంలో చనిపోయిన వారంతా తిరిగి వస్తే ఏం జరిగిందన్నదే చిత్ర కథ. సీట్‌ఎడ్జ్ థ్రిల్లర్‌గా ఆకట్టుకుంటుంది' అన్నారు. హీరో రిషి అద్భుతమైన నటుడని, ఆయన నటించిన కన్నడ సినిమాలు కొన్ని చూశానని మధుర శ్రీధర్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: కృష్ణప్రసాద్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: కేఎస్ సందీప్.

లయన్ కింగ్‌కు వాయిస్ ఓవర్



వాల్ట్ డిస్నీ రూపొందించిన 'ది లయన్ కింగ్' ఫ్రాంచైజీకి ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. ఈ ఫ్రాంచైజీలో కొత్త సినిమాగా 'ముఫాసా: ది లయన్ కింగ్' డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకురానుంది. పలు భారతీయ భాషల్లో కూడా ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ సినిమా తెలుగు వెర్షన్ ముఫాసా పాత్రకు అగ్ర హీరో మహేష్‌బాబు వాయిస్ ఓవర్ అందిస్తున్నారు. తెలుగు ట్రైలర్‌ను ఈ నెల 26న విడుదల చేయబోతున్నారు. ముఫాసా పాత్రకు డబ్బింగ్ చెప్పడం పట్ల మహేష్‌బాబు ఆనందం వ్యక్తం చేశారు. తన కుటుంబంతో కలిసి ఆనందంగా సెలబ్రేట్ చేసుకునే మూమెంట్ ఇదని అన్నారు. ఆయన మాట్లాడుతూ 'డిస్నీ సంస్థ చిత్రాల్లోని ఎంటర్‌టైన్‌మెంట్, స్టోరీటెల్లింగ్ అంటే నాకు చాలా ఇష్టం. అడవికి రారాజైన ముఫాసా పాత్రకు వాయిస్ అందించడం ఆనందంగా ఉంది. ఈ సినిమా తెలుగు వెర్షన్‌ను అందరూ ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నా' అన్నారు. తెలుగు వెర్షన్‌కు మహేష్‌బాబు వాయిస్ ఓవర్ జీవం పోసిందని డిస్నీస్టార్ స్టూడియోస్ హెడ్ బిక్రమ్ దుగ్గల్ అన్నారు. ఈ చిత్రానికి బారీజెంకిన్స్ దర్శకత్వం వహించారు.

'ఓజీ' ట్రైలర్ ఆరోజే..!



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా పాలనాపరమైన విధులతో బిజీగా ఉండటంతో పవన్‌కల్యాణ్ తాజా చిత్రాలు ఓజీ, ఉస్తాద్ భగత్‌సింగ్, హరిహరవీరమల్లు షూటింగ్స్ అన్నీ వాయిదా పడ్డాయి. తాజాగా ఈ చిత్రాలను వరుసగా పూర్తి చేసేందుకు పవన్‌కల్యాణ్ సమాయత్తమవుతున్నారు. త్వరలో ఆయన 'హరిహర వీరమల్లు' షూటింగ్‌లో జాయిన్ కాబోతున్నారు. ఈ నేపథ్యంలో 'ఓజీ' సినిమా అప్‌డేట్ గురించి అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ను పవన్‌కల్యాణ్ జన్మదినమైన సెప్టెంబర్ 2న విడుదల చేయబోతున్నట్లు చిత్ర నిర్మాత డీవీవీ దానయ్య అధికారికంగా ప్రకటించారు. దీంతో అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. త్వరలో 'ఓజీ' షూటింగ్ కూడా మొదలుకానున్నట్లు తెలిసింది. ఇప్పటికే 60శాతం చిత్రీకరణ పూర్తయింది. వచ్చే నెలలో షూటింగ్‌ను పునఃప్రారంభిస్తారని, నాయకానాయికలు పవన్‌కల్యాణ్, ప్రియాంక మోహన్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరించబోతున్నారని సమాచారం. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ డ్రామాగా 'ఓజీ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, అర్జున్‌దాస్, శ్రియా రెడ్డి, ప్రకాష్‌రాజ్ తదితరులు కీలక పాత్రలను పోషిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు.



ప్రత్యేక గీతంతో కొత్త రికార్డు

అగ్ర కథానాయికలు సైతం ఐటెమ్ సాంగ్స్‌లో నర్తించడం ఇప్పుడు మామూలైపోయింది. వారి పాటలతో సినిమాకు కావాల్సినంత ప్రచారం వస్తుండటం, సదరు గీతాలు ప్రత్యేకాకర్షణగా నిలుస్తుండటంతో టాప్ హీరోయిన్స్ ఐటెంసాంగ్స్‌లో నటించడానికి ఏమాత్రం సంకోచించడం లేదు. తాజాగా హిందీ చిత్రం 'స్త్రీ-2'లో 'ఆజ్ కి రాత్' అంటూ అగ్ర నాయిక తమన్నా చేసిన ఐటెంసాంగ్ సోషల్‌మీడియాలో రికార్డులు సృష్టిస్తున్నది. ఈ స్పెషల్ సాంగ్ సినిమాకు చాలా ప్లస్ అయిందని అంటున్నారు. ఈ పాటకు సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో ఇప్పటికే పదకొండుకోట్ల వ్యూస్ లభించాయి. ఇటీవలకాలంలో ఓ ఐటెంసాంగ్‌కు లభించిన అత్యధిక వీక్షణలు ఇవేనని చెబుతున్నారు. ఐదు నిమిషాల నిడివిగల ఈ పాటకు తమన్నా రెండుకోట్లు పారితోషికం తీసుకుందని, ఇది కూడా ఓ రికార్డని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. ఈ పాటలో తమన్నా వేసిన స్టెప్పులు చాలా పాపులర్ అయ్యాయి. రాజ్‌కుమార్ రావు, శ్రద్ధాకపూర్ జంటగా నటించిన 'స్త్రీ-2' ఈ నెల 15న విడుదలై భారీ వసూళ్లతో దూసుకుపోతున్నది.



'మన మధ్యలో ఏదో తెలియని బంధం ఉంది. దానిని మరింత పటిష్టం చేసే సినిమా 'సరిపోదా శనివారం'. రిలీజ్ రోజున థియేటర్లన్నీ మార్మోగిపోతాయి'

కోపం వచ్చిదంటే బ్లాక్‌బస్టరే!

అన్నారు నాని. ఆయన కథానాయకుడిగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'సరిపోదా శనివారం' ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకురానుంది. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అగ్ర నిర్మాత దిల్‌రాజు విడుదల చేస్తున్నారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాని మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం మీ అందరిలాగే ఆతృతగా ఎదురుచూస్తున్నా. తనవాళ్ల శ్రేయస్సు కోసం కోపాన్ని పాజిటివ్ వేలో ఉపయోగించే ఓ వ్యక్తి కథ ఇది. ఇప్పుడు నాకు కోపం వచ్చింది. నాకు కోపం వచ్చిందంటే బ్లాక్‌బస్టర్ హిట్ పక్కా (నవ్వుతూ)' అన్నారు. నాని గత చిత్రం 'దసరా'ను ఈ సినిమా బీట్ చేస్తుందనే నమ్మకం ఉందని, దర్శకుడు వివేక్ అద్భుతంగా తెరకెక్కించాడని దిల్‌రాజు తెలిపారు. గొప్ప కథను దర్శకుడు వివేక్ అంతే గొప్పగా తెరకెక్కించాడని, నాని నటన హైలైట్‌గా నిలుస్తుందని నిర్మాత డీవీవీ దానయ్య చెప్పారు. ఈ సినిమాలో తాను చారులత అనే బ్యూటీఫుల్ క్యారెక్టర్‌లో కనిపిస్తానని కథానాయిక ప్రియాంక మోహన్ పేర్కొంది.

పొట్టి దుస్తులు వేసుకోవద్దు



సినీరంగంలో నేటితరం మహిళల వస్త్రధారణ అభ్యంతరకరంగా ఉంటున్నదని, పొట్టి దుస్తులను ధరిస్తూ శరీర భాగాలను ప్రదర్శించే ధోరణి ఎక్కువైపోయిందని సీనియర్ నటి, జాతీయ అవార్డు గ్రహీత శారద ఆవేదన వ్యక్తం చేసింది. మలయాళ సినీరంగంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, లైంగికపరమైన వేధింపులపై అధ్యయనం చేయడానికి కేరళ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ హేమ కమిషన్‌లో శారద సభ్యురాలిగా ఉన్నారు. ఇటీవలే ఈ కమిషన్ తన రిపోర్టును ప్రభుత్వానికి అందజేసింది. మలయాళ ఇండస్ట్రీలో కాస్టింగ్‌కౌచ్ తీవ్రంగా ఉందని, మహిళలు లైంగికపరంగా వేధింపులకు గురవుతున్నారని కమిషన్ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో సినీరంగంలో మహిళల ప్రాతినిధ్యం గురించి కమిషన్‌కు శారద తన అభిప్రాయాలను వెల్లడించింది. సినీరంగంలో ఒకప్పుడు ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేదని, సెట్స్‌లో డబుల్ మీనింగ్ డైలాగ్‌లు ఎవరూ మాట్లాడేవారు కాదని, ఎలాంటి వేధింపులు ఉండేవి కావని శారద పేర్కొంది. పాశ్చాత్య సంస్కృతి వల్లే పెడధోరణులు ప్రబలుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. సినిమాకు సంబంధించిన సాంకేతిక విద్యకు మహిళలు దూరంగా ఉండటమే మంచిదని, ప్రభుత్వాలు కూడా ఈ తరహా స్టడీస్ నుంచి మహిళలను మినహాయించాలని శారద సలహా ఇచ్చింది. 'సినిమా టెక్నికల్ స్టడీస్ మహిళలకు సరిపడవు. చదువు మధ్యలో ఆపేసి వారు టెక్నికల్ అంశాల్లో శిక్షణ తీసుకుంటారు. అయితే సినీ రంగంలో జాబ్ గ్యారెంటీ ఏమీ ఉండదు. దాంతో వారి కెరీర్ ఇబ్బందుల్లో పడుతుంది' అని శారద వ్యాఖ్యానించింది.

పోస్టింగ్ ఇవ్వకుండా రాత్రికి రాత్రే రిలీవ్

- సాంఘిక సంక్షేమ గురుకులాల్లో బదిలీల ప్రహసనం
- కోర్టు ఉత్తర్వులు బేఖాతరు.. తుంగలో మార్గదర్శకాలు
- డీఎస్ఎస్ భవన్‌లో గురుకుల టీచర్ల ఆందోళన

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థలో చేపట్టిన బోధన, బోధనేతర సిబ్బంది బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ ప్రహసనంగా మారింది. రాష్ట్రంలోని ఏ సొసైటీలోనూ, మరే శాఖలోనూ లేనివిధంగా తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయినప్పటికీ సొసైటీ ఉన్నతాధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూనే ఉన్నారు. తాజాగా జారీ చేసిన ఉత్తర్వులే నిదర్శనంగా నిలుస్తాయి. 317 జీవోతో డిస్‌లోకేట్ అయినవారు, కోర్టు కేసులతో కౌన్సెలింగ్‌కు హాజరుకాని ఉద్యోగులకు పోస్టింగ్ ఇవ్వకుండానే రిలీవ్ చేయాలని రాత్రికి రాత్రే ఆదేశాలు జారీ చేశారు. దీంతో బెంబేలెత్తిన ఉద్యోగులు హుటాహుటిన డీఎస్ఎస్ భవన్‌కు తరలివచ్చి ఇదేమిటనీ నిలదీశారు.

రాత్రికి రాత్రే రిలీవ్

సోషల్‌వెల్ఫేర్ గురుకులంలో ఇటీవలనే బదిలీలను నిర్వహించారు. 317 జీవోతో డిస్‌లోకేట్ అయిన బోధన, బోధనేతర సిబ్బందికి సైతం కౌన్సెలింగ్ నిర్వహించారు. కానీ కోర్టు కేసుల నేపథ్యంలో పోస్టింగ్ ఇవ్వలేదు. అయితే వారి పోస్టులను మాత్రం వేకెంట్ (ఖాళీ)గా చూపెట్టారు. ఈ క్రమంలో ఒకే సబ్జెక్టుకు సంబంధించి ఒకే చోట ఒకరికి మించి ఉద్యోగులకు పోస్టింగ్‌లు వచ్చాయి. అదీగాక సీనియార్టీ జాబితాను తప్పులతడకగా రూపొందించి, ఇష్టారాజ్యంగా బదిలీలను చేపట్టారు. కోర్టు కేసుల నేపథ్యంలో బదిలీల కౌన్సిలింగ్‌కు హాజరు కాని 292 ఉన్నారు. వారందరినీ రిలీవ్ చేయాలని ప్రిన్సిపాల్స్‌కు మంగళవారం రాత్రి హడావుడిగా సొసైటీ సెక్రటరీ ఆదేశాలు జారీచేశారు. గురుకులాల్లో ఉన్న అదనపు సిబ్బందిని మాత్రం మినహాయించారు. ఇదే ఇప్పుడు తీవ్ర వివాదాస్పదంగా మారింది. రిలీవ్ అయిన టీచర్లందరూ హుటాహుటిన బుధవారం ఉదయం కార్యాలయానికి చేరుకున్నారు. కౌన్సెలింగ్ నిర్వహిస్తారేమోనని వచ్చిన సిబ్బందికి చుక్కెదురైంది. ఆప్షన్స్‌ను తీసుకోకుండా కేవలం సమస్యలు మాత్రమే చెప్పుకొని వెళ్లాలని సొసైటీ చెప్పడంతో వచ్చిన టీచర్లందరూ ఖంగుతిన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ కోర్టు ఉత్తర్వులను యథేచ్ఛగా ఉల్లంఘించింది. కోర్టు స్టే విధించినప్పటికీ బదిలీలు చేపట్టింది. మరోవైపు 317 జీవోతో ప్రభావితమైన సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం ఇంతవరకు ఎటువంటి సిఫారసులు చేయలేదు. కానీ సొసైటీ మాత్రం ఆ జీవోతో ప్రభావితమైన వారికి పోస్టింగ్‌లివ్వడం గమనార్హం.


డీఎస్ఎస్ భవన్ ఎదుట ఆందోళన చేస్తున్న గురుకుల టీచర్లు

టీచర్లమా..? అడ్డా కూలీలమా..?

రాత్రికి రాత్రే రిలీవ్ చేసి, ఉదయమే ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో వారు చంటిపిల్లలను పట్టుకు ని, 500-600కిమీ ప్రయాణం చేసి బుధవారం సొసైటీ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయం బయట, పార్కింగ్ షెడ్డు కింద ఎండలో టీచర్లను నిలబెట్టి అభ్యంతరాలు స్వీకరించారు. దీంతో కార్యాలయం ఎదుట బైఠాయించి, ధర్నాకు దిగారు. 'టీచర్లు ఆందోళన మొదలుపెట్టిన అరగంటలోనే 177 మందికి పోస్టింగ్స్ ఇస్తూ సొసైటీ సెక్రటరీ వర్షిణి ఉత్తర్వులు జారీచేశారు. అది కూడా జూలై 21వ తేదీతో ఉత్తర్వులు వెలువరించడం గమనార్హం. ఇంకా వందల మంది ఉద్యోగులకు పోస్టింగ్స్ కూడా ఇవ్వలేదు. దీంతో తాము ఇప్పుడు ఎక్కడ రిపోర్ట్ చేయాలంటూ ఆందోళనకు దిగారు. సెక్రటరీ వర్షిణి బయటకు వచ్చి ఆందోళన చేస్తున్న టీచర్లతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే పోస్టింగ్స్ ఇచ్చామని, కోర్టు ఆదేశాలతో పనిలేదని అన్నారు. పోస్టింగ్స్ వచ్చిన చోటుకు వెళ్లాల్సిందేనని తేల్చిచెప్పారు. హైకోర్టులో స్టేఆర్డర్ ఉన్న కూడా సొసైటీ ఉన్నతాధికారులు అందుకు పూర్తి వ్యతిరేకంగా చర్యలు చేపట్టడం దారుణమని టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు వాపోయారు.

గురుకుల పనివేళలను మార్చండి: జేఏసీ

హైదరాబాద్, ఆగస్టు21 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ గురుకులాల పనివేళలను మార్చాలని, సమస్యలను పరిష్కరించాలని గురుకుల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని సచివాలయంలో జేఏసీ నేతలు మామిడి నారాయణ, డాక్టర్ మధుసూదన్, కే జనార్దన్, నరసింహులు గౌడ్, గణేష్, భిక్షంయాదవ్ బుధవారం ప్రత్యేకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ ఇటీవల మార్చిన పనివేళల వల్ల గురుకుల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచే పనివేళలను ప్రారంభించడం వల్ల విద్యార్థులు సైతం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, 9 గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు మార్చాలని సీఎస్‌కు విజ్ఞప్తి చేశారు. త్వరలోనే పరిష్కరిస్తామని సీఎస్ హామీ ఇచ్చినట్టు జేఏసీ నేతలు వెల్లడించారు.

5 రోజులు వానలు

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): జార్ఖండ్ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఆవర్తనం, ద్రోణి ప్రభావం వల్ల రానున్న 5 రోజులు తెలంగాణలోని పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ శాఖ అంచనా వేసింది. హైదరాబాద్, మెదక్, రంగారెడ్డి, యాదాద్రి-భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గత 24 గంటల్లో మెదక్ జిల్లా చేగుంటలో 8.21 సెం.మీ, యాదాద్రి-భువనగిరి జిల్లా పోచంపల్లిలో 7.58 సెం.మీ, మెదక్ జిల్లా శంకరంపేటలో 7.31 సెం.మీ, తూప్రాన్‌లో 5.09 సెం.మీ, నార్సింగిలో 4.82 సెం.మీ, మహబూబాబాద్‌లో 4.73 సెం.మీ, హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో 6.06 సెం.మీ, మేడ్చల్‌లో 4.84 సెం.మీ, మునుగోడులో 4.89 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్టు వివరించింది. బుధవారం రాష్ట్రంలోని 3 మండలాల్లో అధిక వర్షపాతం, 60 మండలాల్లో మోస్తరు వర్షపాతం, 113 మండలాల్లో స్వల్ప వర్షపాతం నమోదైనట్టు అధికారులు వెల్లడించారు.

ఇద్దరు విద్యార్థినులను కొరికిన ఎలుకలు

దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఘటన

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 21: ఎలుకలు కొరకడంతో ఇద్దరు విద్యార్థినులు గాయపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. వానాకాలం సీజన్‌లో పాఠశాల ప్రాంగణం అపరిశుభ్రంగా మారి విద్యార్థినులు ఇబ్బందిపడుతున్నారు. పాఠశాల భవనంపై అంతస్తులో విద్యార్థినులు ఉంటుండగా, కింద పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇద్దరు తొమ్మిదో తరగతి విద్యార్థినులు ఎం ఇందుశ్రీ, బీ నందినిపై ఎలుకలు దాడిచేసి గాయపరిచాయి. బుధవారం వారిద్దరినీ చికిత్స కోసం ఎల్లారెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తమ పిల్లలను ఎలుకలు కొరకడంతో విద్యార్థునుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.

బదిలీ అయిన వైద్యులు మళ్లీ వెనక్కి?

- ప్రొఫెసర్లు లేక సీట్లకు ముప్పు
- సర్కారు.. యూటర్న్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ్యశాఖలో బదిలీల ప్రక్రియ గందరగోళంగా మారింది. ముందూ వెనకా ఆలోచించకుండా సర్కార్ తీసుకున్న అనాలోచిత నిర్ణయం వల్ల వైద్యులు, రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. బదిలీల కారణంగా ప్రస్తుతం ఉస్మానియా, గాంధీ వైద్యకళాశాల పరిధిలోని దవాఖానాల్లో మొత్తం 107 పోస్టులు ఖాళీ అయ్యాయి. వాటిలో కేవలం 10 శాతం మాత్రమే భర్తీ చేశారు. మిగిలిన 90 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇదిలా ఉండగా సూపర్ స్పెషాలిటీ, స్పెషాలిటీ పీజీ సీట్లకు ఉస్మానియా, గాంధీ మెడికల్ కళాశాలల్లో సీట్లకు సరిపోను ప్రొఫెసర్లు కరువయ్యారు. ఎంసీఐ నిబంధనల ప్రకారం పీజీ సీట్లకు సరిపడా ప్రొఫెసర్లు లేకపోతే ఆ సీట్లను రద్దు చేస్తారు. త్వరలో ఎంసీఐ తనిఖీలు ఉండటంతో ఆలస్యంగా కండ్లు తెరిచిన ప్రభుత్వం చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఇప్పుడు బదిలీ చేసిన వైద్యులను డిప్యుటేషన్‌లపై మళ్లీ వెనక్కి తీసుకువచ్చేందుకు కసరత్తు మొదలుపెట్టినట్లు తెలిసింది.

నిషేధ కాలంలో మళ్లీ బదిలీలా?

సాధారణ బదిలీల ప్రక్రియ జూలై 31తో ముగిసింది. ఆగస్టు 1నుంచి బదిలీలపై నిషేధం అమల్లోకి వచ్చింది. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఉస్మానియా, గాంధీ హాస్పిటల్స్‌కు చెందిన 14 మంది సూపర్‌స్పెషాలిటీ వైద్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కానీ వారికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. దీంతో సదరు ప్రొఫెసర్లు ఉస్మానియా, గాంధీలోనే యథావిధిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పుడు ఆ 14 మందిలో కొందరిని జిల్లాలకు బదిలీ చేసేందుకు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా సూపర్‌స్పెషాలిటీ పోస్టులు ఖాళీ అయ్యి, ఆయా విభాగాలు మూతపడే ప్రమాదం లేకపోలేదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఒక పక్క పీజీ సీట్లను కాపాడుకునేందుకు బదిలీపై వెళ్లిన వైద్యులను తిరిగి రప్పించేందుకు ప్రయత్నిస్తూనే మరో పక్క ఉన్న సూపర్‌స్పెషాలిటీ వైద్యులను బదిలీ చేసి బయటకు పంపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. దీంతో రోగులు, వైద్య విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు.


విద్యుత్‌సౌధలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

రోస్టర్‌ను కాదని పదోన్నతులివ్వడం అన్యాయం

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం-621 ఆవేదన

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): విద్యుత్ సంస్థల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న రోస్టర్ విధానాన్ని పక్కనపెట్టి ఉద్యోగులకు పదోన్నతులివ్వడం అన్యాయమని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం-621 ఆవేదన వ్యక్తం చేసింది. ఈ అన్యాయాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం విద్యుత్‌సౌధలో నిరసన కార్యక్రమం చేపట్టింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్యామ్‌మనోహర్, ప్రధాన కార్యదర్శి మేడి రమేశ్ మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవ తీసుకుని తమ రాజ్యాంగ హక్కులను రక్షించాలని కోరారు. టీవోవో-954, దాని అనుబంధ కంపెనీలు జారీచేసిన ఉత్తర్వులను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.


తన పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పూల మొక్కను అందజేసి ఆశీర్వాదం తీసుకుంటున్న పార్టీ నాయకుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్

హడావుడిగా హెచ్ఎంల పదోన్నతులు

షెడ్యూల్ ప్రకటించాలంటున్న టీచర్లు

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): విద్యాశాఖలో హడావుడిగా పదోన్నతులు కల్పించడంపై టీచర్లు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. రెండు రోజుల్లోనే పదోన్నతులిచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇది సరికాదని, పూర్తిస్థాయి షెడ్యూల్‌ను ప్రకటించి పదోన్నతులు కల్పించాలని కోరుతున్నారు. 2023 సెప్టెంబర్‌లో మల్టీజోన్-1లో, జూన్, జూలై మాసాల్లో మల్టీజోన్-2లో జిల్లా పరిషత్ టీచర్లకు హెచ్ఎంలుగా పదోన్నతులు కల్పించారు. అయినా రెండు మల్టీజోన్‌లలో పలుఖాళీలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో స్కూల్ అసిస్టెంట్ నుంచి హెచ్ఎం పదోన్నతులు చేపట్టేందుకు విద్యాశాఖ రంగం సిద్ధం చేస్తున్నది. వరంగల్ మల్టీజోన్‌లో 150 మందికి, హైదరాబాద్ మల్టీజోన్ పరిధిలో 100 మంది వరకు పదోన్నతులొచ్చే అవకాశముంది. రాత్రికి రాత్రి హడావిడిగా ప్రక్రియను చేపట్టడంపై టీచర్లు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవడం పెద్ద ప్రహసనమని, కాబట్టి తగిన సమయమివ్వాలని కోరుతున్నారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో మహిళా మావోయిస్టు హత్య

చర్ల, ఆగస్టు 21 : పోలీసు ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు ఓ మహిళా మావోయిస్టును హతమార్చారు. ఆమె మృతదేహాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం చెన్నాపురం సమీపంలో బుధవారం ఉదయం వదిలి వెళ్లారు. హైదరాబాద్‌లోని బాలాజీనగర్ సమీపంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన బంటి రాధ అలియాస్ నీల్సో (34) కొన్నేండ్ల క్రితం మావోయిస్టు పార్టీలో చేరి చురుకుగా పనిచేస్తుండటంతో పార్టీ ఆమెకు పలు కీలక బాధ్యతలు అప్పగించింది. ఈ క్రమంలో ఇన్‌ఫార్మర్‌గా మారి తమ సమాచారం పోలీసులకు చేరవేస్తుందనే నెపంతో ఆమెను మావోయిస్టులు హతమార్చారు. మృతదేహాన్ని తీసుకొచ్చి చెన్నాపురం సమీపంలో వదిలి వెళ్లారు. అయితే నీల్సో మృతదేహం వద్ద ఆంధ్రా-ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేశ్ పేరుతో లేఖ ఉంచారు. విప్లవ ద్రోహి నీల్సో అని, అందుకే ఆమెను హతమార్చామని ఆ లేఖలో పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న చర్ల సీఐ రాజువర్మ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని భద్రాచలం ఏరియా దవాఖానకు తరలించారు.

అనాథ శవాలను అమ్ముకునేవాడు!

- బంగ్లాదేశ్‌కు అక్రమంగా మందుల సరఫరా
- పాస్ చేయడానికి విద్యార్థుల నుంచి లంచాలు
- హత్యాచార నిందితుడు మాజీ ప్రిన్సిపల్ సెక్యూరిటీనే
- ఆర్జీ కార్ కళాశాల మాజీ ప్రిన్సిపల్‌పై కళాశాల మాజీ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆరోపణలు


సందీప్ ఘోష్

కోల్‌కతా: ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటన జరిగిన కోల్‌కతా ఆర్జీ కార్ వైద్య కళాశాల, దవాఖాన మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌పై కళాశాల మాజీ డిప్యూటీ సూపరింటెండెంట్ అఖ్తర్ అలీ సంచలన ఆరోపణలు చేశారు. సందీప్ ఘోష్ అనేక అక్రమాలకు పాల్పడేవాడని, అనాథ శవాలను అమ్ముకుంటూ వ్యాపారం చేసేవాడని ఆరోపించారు. బయోమెడికల్ వ్యర్థాలను, ఔషధాలను సైతం అమ్మేసేవాడని, ఇవి బంగ్లాదేశ్‌కు అక్రమంగా రవాణా అయ్యేవని అన్నారు. విద్యార్థులను పాస్ చేయించడానికి లంచాలు తీసుకునేవాడని, డబ్బుల కోసం కొందరు విద్యార్థులను కావాలనే ఫెయిల్ చేయించేవాడని ఆరోపించారు. కళాశాలకు సంబంధించి ప్రతి టెండర్‌లో సందీప్ ఘోష్ 20 శాతం లంచం తీసుకునేవాడని, టెండర్లను తన సన్నిహితులైన సుమన్ హాజ్రా, బిప్లబ్ సింఘాలకు చెందిన 12 కంపెనీలకే ఇచ్చేవాడని అన్నారు.

నిందితుడు మాజీ ప్రిన్సిపల్ సెక్యూరిటీనే

ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార ఘటనలో నిందితుడు సంజయ్ రాయ్ మాజీ ప్రిన్సిపల్ సెక్యూరిటీగా పని చేస్తున్నట్టు అఖ్తర్ అలీ ఆరోపించారు. తాను మాజీ ప్రిన్సిపల్ అక్రమాలపై గతంలోనే రాష్ట్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఆ తర్వాత విధించిన విచారణ కమిటీలోనూ సభ్యుడిగా ఉన్నానని, సందీప్ ఘోష్ అక్రమాలకు పాల్పడ్డాడని విచారణలో తేలినా ఆయనపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఆయనపై విచారణ నివేదికను రాష్ట్ర వైద్య శాఖకు పంపించిన రోజే తనను ఆర్జీ కార్ దవాఖాన నుంచి బదిలీ చేశారని, మిగతా ఇద్దరు విచారణ కమిటీ సభ్యులనూ ట్రాన్స్‌ఫర్ చేశారని అన్నారు. సందీప్‌కు పెద్దవాళ్ల మద్దతు ఉందని, అందుకే రెండుసార్లు బదిలీ అయినా మళ్లీ ఇదే దవాఖానకు పోస్టింగ్ తెచ్చుకున్నారని పేర్కొన్నారు.

గిరిజన మహిళపై 8 మంది గ్యాంగ్‌రేప్

ఛత్తీస్‌గఢ్‌లో దారుణం.. ఆరుగురి అరెస్ట్

రాయ్‌పూర్: ఒక గిరిజన మహిళపై 8 మంది యువకులు సామూహిక లైంగిక దాడికి పాల్పడిన దారుణ సంఘటన ఛత్తీస్‌గఢ్‌లో చోటుచేసుకుంది. రాయ్‌గఢ్ జిల్లా పుసౌర్‌లో 27 ఏండ్ల గిరిజన మహిళ.. భర్తతో విడిపోయి వేరుగా ఉంటున్నది. ఈనెల 19న రాఖీ సందర్భంగా కొందరు పరిచయస్తులతో మీనాబజార్‌కు వెళ్లింది. తిరిగి ఒక వ్యక్తితో వస్తుండగా, అతడి స్నేహితులు ఏడుగురు ఆమెను అడ్డగించారు. ఆమెను నిర్జన ప్రదేశంలోకి లాక్కెళ్లి ఎనిమిది మంది లైంగిక దాడి చేశారు. స్పృహలేని పరిస్థితుల్లో ఆమెను అక్కడే వదిలి వెళ్లిపోయారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అదే గ్రామానికి చెందిన ఆరుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. మిగిలిన ఇద్దరి కోసం గాలిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాధితురాలు చికిత్స పొందుతున్నారు.

ముస్లింల వివాహం, విడాకులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

అస్సాం అసెంబ్లీలో బిల్లు

గువహటి, ఆగస్టు 21: ముస్లింల వివాహం, విడాకులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేస్తూ అస్సాంలోని బీజేపీ సర్కార్ ఓ బిల్లును తీసుకురాబోతున్నది. గురువారం నుంచి ఇక్కడ ప్రారంభం కాబోతున్న అసెంబ్లీ సమావేశాల్లో 'అస్సాం కంపల్సరీ రిజిస్ట్రేషన్ ఆఫ్ ముస్లిం మ్యారేజ్ అండ్ డివోర్స్ బిల్-2024'ను ప్రవేశపెడుతున్నట్టు అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ తాజాగా ప్రకటించారు. 'ముస్లిం వివాహాలను ఇంతకు ముందు కాజీలు రిజిష్టర్ చేసేవారు. గతంలో మైనర్ల వివాహాల్ని కూడా కాజీలు రిజిష్టర్ చేశారు. కొత్త బిల్లు ప్రకారం అలా కుదరదు' అని చెప్పారు.

పోర్న్ నిషేధించాలి

సుప్రీంకోర్టు మహిళా న్యాయవాదుల సంఘం

న్యూఢిల్లీ, ఆగస్టు 21: దేశవ్యాప్తంగా ఇటీవల మహిళలపై జరిగిన క్రూరమైన, భయంకరమైన నేరాల్ని సుప్రీంకోర్టు మహిళా న్యాయవాదుల సంఘం (ఎస్‌సీడబ్ల్యూఎల్ఏ) తీవ్రంగా ఖండించింది. బాలికలు, యువతుల రక్షణకు వెంటనే సమగ్రమైన సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేసింది. సంఘం అధ్యక్షురాలు, సీనియర్ న్యాయవాది మహాలక్ష్మి పావని బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లో అశ్లీలత, ఆన్‌లైన్‌లో పోర్నోగ్రఫీపై పూర్తిగా నిషేధం విధించాలని కోరారు.

24న మహారాష్ట్ర బంద్

ముంబై, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలోని బద్లాపూర్‌లో చిన్నారులపై లైంగిక వేధింపుల ఘటనకు నిరసనగా 24న మహారాష్ట్ర బంద్‌కు మహా వికాస్ అఘాడీ పిలుపునిచ్చింది. మహారాష్ట్ర ప్రతిష్టను దిగజార్చేలా జరుగుతున్న ఘటనలకు నిరసనగా బంద్ పాటించనున్నట్టు మహారాష్ట్ర పీసీసీ చీఫ్ నానా పటోలే తెలిపారు. ఈ బంద్‌లో మహావికాస్ అఘాడీకి చెందిన పార్టీలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొంటారని తెలిపారు. మరోవైపు, లైంగిక దాడుల ఘటనకు నిరసనగా ఆందోళన చేసిన 68 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

మహిళలపై నేరాల్లో బీజేపీ నేతలు టాప్

- మొత్తంగా 151 మంది సిట్టింగ్ ఎంపీ/ఎమ్మెల్యేలపై కేసులు
- ఏడీఆర్ తాజా నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 16 మంది సిట్టింగ్ ఎంపీ, 135 మంది ఎమ్మెల్యేలు మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు ఎదుర్కొంటున్నారని అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్(ఏడీఆర్) పేర్కొన్నది. ఈ మేరకు వారు 2019, 2024 మధ్య ఈసీకి సమర్పించిన ఎన్నికల అఫిడవిట్ పత్రాల్లో వెల్లడించారని తెలిపింది. కొంత మందిపై లైంగిక దాడి వంటి తీవ్రమైన అభియోగాలు కూడా ఉన్నాయని పేర్కొన్నది. నివేదిక ప్రకారం, ఇద్దరు సిట్టింగ్ ఎంపీలు, 14 మంది ఎమ్మెల్యేలపై లైంగిక దాడి కేసులు ఉన్నాయి. నేరం రుజువైతే కనీసం పదేండ్ల శిక్ష నుంచి జీవిత ఖైదు వరకు పడే అవకాశం ఉన్నది.

బీజేపీ నుంచి 54 మంది

పార్టీల పరం చూస్తే.. కేంద్రంలోని అధికార బీజేపీకి చెందిన 54 మంది ఎంపీ/ఎమ్మెల్యేలపై ఈ తరహా కేసులు ఉన్నాయి. తర్వాతి స్థానాల్లో కాంగ్రెస్-23 మంది, తెలుగుదేశం-17 మంది ఉన్నారని ఏడీఆర్ నివేదిక తెలిపింది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ఐదుగురు చొప్పున చట్టసభల సభ్యులు మహిళలపై అత్యాచారం అభియోగాలు ఎదుర్కొంటున్నారు.

మొదటి స్థానంలో పశ్చిమబెంగాల్

మహిళలపై నేరాలకు సంబంధించి కేసులు ఎదుర్కొంటున్న వారిలో పశ్చిమబెంగాల్ చట్టసభల సభ్యులు మొదటి స్థానంలో ఉన్నారని ఏడీఆర్ నివేదిక వెల్లడించింది. 25 మంది ఎంపీ/ఎమ్మెల్యేలు కేసులు ఎదుర్కొంటుండగా, తర్వాతి స్థానాల్లో ఆంధ్రప్రదేశ్ (21 మంది), ఒడిశా(17) ఉన్నాయి.

రహస్య కెమెరాలతో నగ్న వీడియోల చిత్రీకరణ

అమెరికాలో భారత డాక్టర్ అరెస్ట్

వాషింగ్టన్, ఆగస్టు 21: అమెరికాలో ఉంటున్న భారత్‌కు చెందిన 40 ఏండ్ల డాక్టర్ లైంగిక అకృత్యాలు బయటపడటంతో అతడిని పోలీసులు అరెస్టుచేశారు. గత కొన్నేండ్లుగా వందలాది మహిళలు, చిన్నారుల నగ్న చిత్రాలు, వీడియోలు రహస్యంగా చిత్రీకరించాడు. భార్య ఫిర్యాదుతో అతడిని అక్లాండ్ పోలీసులు అరెస్ట్ చేశారు. భారత్‌కు చెందిన ఒమెయిర్ ఎజాజ్ వర్క్ వీసాపై 2011లో అమెరికా వెళ్లాడు. పలు దవాఖానలు, వైద్య సంస్థలలో వైద్యుడిగా పనిచేస్తున్నాడు. తన దవాఖానకి వచ్చే పేషంట్ల చిత్రాలు, వీడియోలు తీయడానికి ఈ డాక్టర్ హాస్పిటల్ గదులలో, బట్టలు మార్చుకునే గదుల్లో, బాత్‌రూమ్‌ల్లో రహస్య కెమెరాలు అమర్చాడు. తన ఇంట్లో సైతం వీటిని ఏర్పాటు చేశాడు. ఆఖరికి రెండు ఏండ్ల పిల్లల నగ్న చిత్రాలను కూడా రికార్డు చేసినట్టు ఆక్లాండ్ కౌంటీ పోలీసులు చెప్పారు. అతడి నివాసం, హాస్పిటల్, ఇతర ప్రదేశాలలో తనిఖీలు చేపట్టి కంప్యూటర్లు, ఫోన్లు, 15 ఎక్స్‌టెర్నల్ డివైజ్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఒక హార్డ్ డ్రైవ్‌లోనే 13 వేల అభ్యంతరకర వీడియోలు ఉన్నాయి.

భారత్-పోలండ్ స్నేహానికి కొత్త ఊపు

45 ఏండ్ల తర్వాత ఆ దేశానికి భారత ప్రధాని

న్యూఢిల్లీ, ఆగస్టు 21: ద్వైపాక్షిక సంబంధాల్ని మెరుగుపర్చుకునేందుకు పోలండ్ బయల్దేరిన ప్రధాని మోదీ బుధవారం రాజధాని వార్సా చేరుకున్నారు. ఇక్కడి మిలటరీ ఎయిర్‌పోర్ట్‌లో ప్రధాని మోదీకి ఘన స్వాగతం లభించింది. 'పోలండ్‌లో దిగాను. ఇక్కడ వివిధ కార్యక్రమాల కోసం ఎదురుచూస్తున్నా. ఈ పర్యటన ఇరు దేశాల స్నేహానికి ఊపునిస్తుంది. ఇరు దేశాల ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తుంది' అంటూ ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. యూరప్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పోలండ్, ఉక్రెయిన్ దేశాల్లో పర్యటిస్తున్నారు. దాదాపు 45 ఏండ్ల తర్వాత..మళ్లీ ఇన్నేండ్లకు భారత ప్రధాని పోలండ్‌లో పర్యటిస్తున్నారు. భారత్-పోలండ్ ద్వైపాక్షిక సంబంధాలు ఏర్పడి 70 ఏండ్లు అవుతున్న సందర్భంగా, ఇరు దేశాల నేతల మధ్య కీలక చర్చలు జరగనున్నాయి. ఆగస్టు 23న ప్రధాని మోదీ ట్రెయిన్ ఫోర్స్ వన్'లో ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు వెళ్లనున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత ప్రధాని మోదీ ఉక్రెయిన్‌కు వెళ్లటం ఇదే తొలిసారి.

కరెంటు కనెక్షన్ లేకుండానే రూ.44 వేల బిల్లు

- ప్రశ్నించినందుకు మరో 11,750
- మహారాష్ట్రలో రైతుకు షాక్

ముంబై, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ): కరెంటు కనెక్షన్ ఇవ్వకముందే రైతుకు భారీ బిల్లు పంపింది మహారాష్ట్ర విద్యుత్తు సరఫరా సంస్థ ఎంఎస్ఈబీ. దీనిపై రైతు ఫిర్యాదు చేయగా, బిల్లు రద్దు చేయకపోగా మరో రూ.11,750 చేర్చి కొత్త బిల్లు పంపించింది. అమరావతి జిల్లా అచల్‌పూర్ తాలూకాలోని కండ్లికి చెందిన అశోక్ వాశంకర్ అనే రైతు తన పొలంలో విద్యుత్తు కనెక్షన్ కోసం 2021 జూన్ 22, 2023 డిసెంబర్ 16న ఎంఎస్ఈబీకి దరఖాస్తు చేసుకున్నాడు. కనెక్షన్ ఇవ్వడానికి రూ.16,185 చెల్లించాలని ఈ సంస్థ రైతుకు కొటేషన్ ఇచ్చింది. ఈ మొత్తం చెల్లించినా విద్యుత్ కనెక్షన్ మాత్రం ఇవ్వలేదు. కానీ, రూ.44 వేల కరెంటు బిల్లు మాత్రం పంపించింది. ఈ బిల్లుపై ఫిర్యాదు చేయగా రూ.55,750తో కొత్త బిల్లు పంపింది. దీంతో రైతు దిక్కుతోచని స్థితిలో పడిపోయాడు.

భారత్ బంద్‌కు మిశ్రమ స్పందన

న్యూఢిల్లీ, ఆగస్టు 21: ఎస్సీ, ఎస్టీ కులాల ఉప వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ దళిత, ఆదివాసీ సంఘాలు చేపట్టిన భారత్ బంద్‌కు మిశ్రమ స్పందన లభించింది. బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లో బంద్ ప్రభావం అధికంగా కనిపించింది. ఇక రాజస్థాన్, పంజాబ్, హర్యానా, అస్సాంలలో బంద్ ప్రభావం కన్పించ లేదు. బంద్‌కు మద్దతు తెలిపిన ఎన్డీయేతర రాష్ట్రాలు, ఎన్డీఏ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బంద్ ప్రభావం స్వల్పంగా కన్పించింది. సుప్రీం కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా దేశంలోని 21 సంస్థలు భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. బీహార్‌లోని పలు ప్రాంతాల్లో రైళ్లు, రోడ్ మార్గాలకు ఆందోళనకారులు ఆటంకాలు కల్పించారు. షాపులను మూసివేయించి, రోడ్లపై టైర్లను కాల్చారు. అయితే పోలీసులు వారిపై లాఠీలు, వాటర్ కెనాన్‌లను ప్రయోగించి చెదరగొట్టారు. ఆందోళనల ఫలితంగా దర్భంగ, బక్సర్‌లలో రైళ్ల సర్వీసులకు ఆటంకం కలిగింది. పాట్నా, హాజీపూర్, దర్భంగ, జెహనాబాద్, బెగుసరాయ్ జిల్లాల్లో పలు చోట్ల రోడ్లను దిగ్బంధించారు. జార్ఖండ్‌లో రోడ్లపై బస్సులు తిరగలేదు. స్కూళ్లు పనిచేయలేదు. బంద్‌కు అధికార జేఎంఎం సహా వామపక్ష పార్టీలు కూడా మద్దతు ప్రకటించాయి.

- ఇక తొమ్మిది గంటల్లోగా గుండెమార్పిడి
- బీజేపీతో స్టాలిన్ పొత్తు?
- చంద్రుడి ఉపరితలంపై శిలాద్రవం
- రెడ్ మీట్‌తో మధుమేహ ముప్పు
- కుమారస్వామి విచారణకు అనుమతివ్వండి!

..లోపలి పేజీల్లో

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

గురువారం THURSDAY 22.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 78 ‖ వెల (Price) రూ.6.50

తదియ | గురువారం, సూర్యోదయం: 6-00, సూర్యాస్తమయం: 6-37. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం కృష్ణ పక్షం తిథి: తదియ పగలు 1-47 వరకు. నక్షత్రం: ఉత్తరాభాద్ర రాత్రి 10-06 వరకు. వర్జ్యం: ఉదయం 9-11 నుంచి ఉదయం 10-37 వరకు. రాహుకాలం: పగలు 1-53 నుంచి పగలు 3-27 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 10-13 నుంచి ఉదయం 11-03 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 3-14 నుంచి సాయంత్రం 4-05 వరకు. అమృతకాలం: సాయంత్రం 5-47 నుంచి రాత్రి 7-13 వరకు. సంకష్టహర చతుర్థి చంద్రోదయం రాత్రి 8-42 గంటలకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



ఉత్తమ్ సార్ చెప్పిండని లోన్ కట్టిన.. అయితే!

ఈ రైతు పేరు కొల్లూరి శ్రీను. మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం గ్రామం. రూ. 2 లక్షల కంటే ఎక్కువ ఉన్న రుణాన్ని చెల్లిస్తే మాఫీ అవుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ చెప్పడంతో పైనున్న రూ. 48 వేలను బ్యాంకులో చెల్లించాడు. ఆ తర్వాత మేనేజర్‌ను అడిగితే ప్రభుత్వం నుంచి డబ్బులు రాలేదని చెప్పడంతో విస్తుపోయాడు. వ్యవసాయ శాఖ అధికారిని అడిగితే ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదని చెప్పడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.



మీద పైసలు కట్టుమంటే ఎట్ల కట్టేది.. బాంచెన్!

ఈమె పేరు కల్వాల ఎల్లమ్మ. ములుగు జిల్లా జాకారం గ్రామం. బండారుపల్లి రోడ్డులో బుధవారం జరిగిన దివ్యాంగుల ఉపకరణాల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ఎల్లమ్మ హాజరైంది. అక్కడ కలెక్టర్‌ను కలిసి తనకు రుణమాఫీ కాలేదని, తన కొడుకు బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయింది. ముసలోడు చనిపోయా డని, ఇప్పుడు మీద పైసలు కట్టుమంటే ఎట్ల కట్టేది బాంచన్ అని కన్నీరు పెట్టుకున్నది.



సీఎం ఇలాకా.. కాంగ్రెస్ నేత పరిస్థితి ఇదీ

ఈ రైతు పేరు ఆశయ్యగౌడ్. సీఎం రేవంత్ నియోజకవర్గమైన కొడంగల్‌లోని అప్పాయిపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు. రేషన్ కార్డు ప్రకారం ఆయన పేరుపై రూ. లక్ష, తల్లి పేరుపై రూ. 90 వేలు రుణం ఉంది. రేషన్‌కార్డు ప్రకారం చూసినా ఆశయ్యది, ఆయన తల్లిది కలిపి రుణం మాఫీ కావాలి. కానీ కాలేదు. ప్రభుత్వం ముందు 2లక్షల అప్పు మాఫీ చేస్తే పైనున్న అప్పును రైతులు చెల్లించుకుంటారని, మిగతా అప్పును ముందు చెల్లించమంటే ఎలా అని ప్రశ్నిస్తున్నాడు. ఆంక్షలు లేకుండా రూ. 2 లక్షలు మాఫీ చేయాలని వేడుకుంటున్నాడు.



కాంగ్రెస్‌కు మా ఉసురు తగుల్తది

అర్హులైన రైతులకు రుణమాఫీని వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌లో సీఎం రేవంత్ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించిన రైతులు డుబ్బుల చంద్రశేఖర్, అలిగే గణేశ్, తురాటి భోజన్న, చెట్ల వినీల్‌పై పోలీసులు కేసు పెట్టారు. 30 పోలీస్ యాక్ట్‌ను ఉల్లంఘించారంటూ అభియోగాలు నమోదు చేశారు. స్టేషన్ బెయిల్‌లో భాగంగా బుధవారం వీరు పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాఫీ చేయాలన్న రైతులపై ప్రభుత్వం కేసులు పెడుతున్నదని, కాంగ్రెస్‌కు రైతుల ఉసురు తగులుతుందని పేర్కొన్నారు.

రేవంత్ చీటింగ్.. బీఆర్ఎస్ ఫైటింగ్

- ఇట్లా తీసుకొని.. అట్లా పారేసి...




నిజామాబాద్ జిల్లా రుద్రూర్‌లో రుణమాఫీ కాని రైతుల నుంచి తొలి, మలి విడతలో స్వీకరించిన దరఖాస్తులను కార్యాలయంలో ఇలా విసిరిపారేశారు. దీంతో తమ దరఖాస్తును వెతుక్కుంటున్న రైతులు. (ఇన్‌సెట్‌లో) దరఖాస్తులు స్వీకరిస్తున్న నోడల్ అధికారి

రుణమాఫీ కోసం నేడు రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు

చేవెళ్లలో కేటీఆర్, ఆలేరులో హరీశ్

పాల్గొనవద్దంటూ రైతులకు పోలీసుల నోటీసులు

మాటలతో మాయచేసి అన్నదాతల ఆగ్రహాన్ని చల్లార్చడానికి మంత్రులు చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. బ్యాంకర్ల తప్పిదం, సాంకేతిక కారణాల వల్లే రుణమాఫీ జరగలేదంటూ మంత్రులు నెపాన్ని బ్యాంకుల మీదికి తోసివేసే ప్రయత్నం చేయడంతో రైతన్నలు బుధవారం బ్యాంకుల మీదకు దండెత్తారు. మాకెందుకు మాఫీ కాలేదంటూ రాష్ట్రవ్యాప్తంగా బ్యాంకర్లను నిలదీశారు. దీంతో అనేక చోట్ల బ్యాంకులకు తాళాలు వేయడం లేదా పోలీసు భద్రతలో నడిపించడం కనిపించింది. మాఫీ మోసంపై నేడు బీఆర్ఎస్ రాష్ట్ర వ్యాప్తంగా మండల కేంద్రాల్లో ధర్నాలకు పిలుపునిచ్చింది. దీంతో ప్రభుత్వం పోలీసుల ద్వారా కార్యక్రమాన్ని అడ్డుకునే పనిలో పడింది. బీఆర్ఎస్ ధర్నాలకు ప్రభుత్వ అనుమతి లేదని వాటికి వెళ్లొద్దంటూ, వెళ్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని నిజామాబాద్ తదితర అనేక జిల్లాల పోలీసులు రైతులకు నోటీసులు జారీ చేశారు



తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మాఫీ సగమే.. ఇది మంత్రి మాటే



22 లక్షల మందికే రుణమాఫీ

- మా వద్ద 41.78 లక్షల మంది రైతుల డాటా
- బ్యాంకులు, సాంకేతిక కారణాల వల్లే ఇబ్బందులు
- అందరికీ అయ్యే దాకా మాఫీ కొనసాగుతుంది
- ముందుగా 2 లక్షలలోపు వారికి మాఫీ చేస్తాం › 5
- మిగతావారికి దశలవారీగా పూర్తి: మంత్రి తుమ్మల

పాపాత్ముడు రేవంత్‌ను క్షమించు! తెలంగాణ ప్రజలపై దయ ఉంచు!!



నేడు యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామిని వేడుకోనున్న హరీశ్

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన పాపం ప్రజలకు శాపం కాకుండా చూసి, తెలంగాణ ప్రజలను రక్షించాలని యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనర్సింహస్వామిని ప్రార్థిస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి పాప పరిహారం కోసం, తెలంగాణ ప్రజల శ్రేయస్సు కోసం గురువారం యాదగిరిగుట్ట ఆలయాన్ని దర్శించుకొని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులతో కలిసి పూజలు చేస్తామని చెప్పారు. 'స్వామీ.. ఈ పాపాత్ముడైన ముఖ్యమంత్రిని క్షమించు.. తెలంగాణ ప్రజలపై దయ ఉంచు..' అని యాదగిరిగుట్ట నరసింహస్వామిని వేడుకుంటామమని పేర్కొన్నారు. 'ఆగస్టు 15లోగా రైతులందరికీ › 5వ పేజీలో

- బ్యాంకుల్లో గందరగోళం



జనగామ జిల్లా చిలుపూరు మండల కేంద్రంలోని మల్కాపూర్ ఇండియన్ బ్యాంకులో రుణమాఫీ ఎందుకు కాలేదో చెప్పాలంటూ ఆందోళన చేస్తున్న రైతులు

మాఫీ చేయని సీఎం మాఫీ మాంగో

- మాఫీ ఎప్పటికి పూర్తి చేస్తారో చెప్పాలి
- రుణమాఫీ పేరుతో అన్నదాతలకు టోపీ
- రైతు ద్రోహి ప్రభుత్వాన్ని వదిలిపెట్టం
- 2 లక్షలు మాఫీ చేసేదాకా వెంటాడుతం
- రైతులపై కేసులను ఉపసంహరించాలి
- లేనిపక్షంలో జైల్ భరోకు పిలుపునిస్తాం
- రేవంత్ సర్కార్‌కు కేటీఆర్ వార్నింగ్

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): 'రుణమాఫీ పేరుతో రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం టోపీ పెట్టింది. సర్కారు చీటింగ్‌పై మా ఫైటింగ్ ఆగదు. రైతులను మోసం చేసిన సర్కారుపై చీటింగ్ కేసు పెట్టాలి. రేవంత్.. రైతులకు భేషరతుగా క్షమాపణ చెప్పు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ › 5వ పేజీలో



వచ్చే నెల నుంచి జనగణన?

- 18 నెలల పాటు కొనసాగే అవకాశం
- కేంద్రప్రభుత్వ వర్గాల వెల్లడి
- 2021లో జరగాల్సి ఉన్న ప్రక్రియ
- కొవిడ్ కారణంగా వాయిదా › 7

మూడేండ్ల చిన్నారిపై లైంగిక దాడి

సిద్దిపేట జిల్లాలో ఘటన › 11

నిజామాబాద్‌లో డ్రైనేజీలో కొట్టుకుపోయిన పాప › 11

హైడ్రా అధికారాలు ఏమిటి?

- ఆ సంస్థకు ఉన్న చట్టబద్ధత ఏమిటి?
- ఏ అధికారంతో ఈ కూల్చివేతలు?
- చర్యలన్నీ చట్టప్రకారం ఉండాల్సిందే
- ప్రభుత్వ శాఖల్లో సమన్వయం ఏది?
- ఇప్పటిదాకా ఎన్ని కట్టడాలు కూల్చారు?
- అందుకు నిబంధనలన్నీ పాటించారా?
- వీటిపై పూర్తి వివరాలు సమర్పించండి
- ప్రభుత్వానికి జస్టిస్ లక్ష్మణ్ ఆదేశం

శివారు ప్రజలకు హైడ్రా దడ





హైడ్రాకు ఉన్న పరిధులు ఏమిటి? అధికారాలు ఏమిటి? రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకొని, స్థానిక కార్యాలయ అనుమతితో నిర్మాణాలు చేపడితే.. నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చేస్తారు? అక్రమ కట్టడాలైనా చట్ట ప్రకారం చేయాలి కదా? నిర్మాణం జరిగిన 15-20 ఏండ్లకు హైడ్రా వచ్చి అక్రమ నిర్మాణం అని కూల్చివేయటమేమిటి? పదేండ్లుగా ఇంటి పన్ను కట్టించుకొని.. ఇప్పుడు కూల్చివేస్తే ఆ వసూళ్లకు అర్థమేమిటి? ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం కాదా?

- ప్రభుత్వం, హైడ్రాకు హైకోర్టు ప్రశ్నలవర్షం

› 6

కాంగ్రెస్ నేతల రాజభవనాలు కూల్చే దమ్ముందా?

- నా పేరుమీద ఫాంహౌస్ లేదు
- మిత్రుడిది లీజుకు తీసుకున్నా...
- చట్టవిరుద్ధమైతే దాన్నీ కూల్చండి
- నేనూ మీతో వచ్చి సహకరిస్తా › 6
- అయితే అదేరోజు కాంగ్రెస్ ప్రముఖులవి కూడా కూల్చేయాలి
- ఎఫ్‌టీఎల్ పరిధిలోని గుత్తా, పొంగులేటి, కేవీపీ, వివేక్, యాష్కీ ఫాంహౌస్‌లు కూల్చాలి: కేటీఆర్

సౌత్ ఆర్ఆర్ఆర్‌లో మార్పులు



- అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి
- దక్షిణంవైపు భూసేకరణ పనుల్లో వేగం పెంచాలని ఆదేశాలు
- ఫ్యూచర్ సిటీకి అనుగుణంగా రేడియల్ రోడ్లు ఉండాలని సూచన

హైదరాబాద్, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ) : రీజనల్ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) దక్షిణ భాగం ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లో కొన్ని మార్పులు చేయాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ట్రిపుల్ ఆర్ మొత్తం మ్యాప్‌ను గూగుల్‌లో పరిశీలించిన ఆయన, భవిష్యత్తు అవసరాల ప్రాతిపదికగా అలైన్‌మెంట్ ఉండాలని, ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టంచేశారు. భూములు ఇచ్చే రైతులకు న్యాయం చేస్తూ సేకరణ ఉండాలని చెప్పారు. మార్పులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికను త్వరగా అందజేయాలని ఆదేశించారు. ట్రిపుల్ ఆర్ ప్రగతిపై సచివాలయంలో సీఎం బుధవారం సమీక్ష నిర్వహించారు. దక్షిణ భాగం పరిధిలోని సంగారెడ్డి-ఆమన్‌గల్ -షాద్‌నగర్ -చౌటుప్పల్ (189.20 కి.మీ.) మార్గానికి భూసేకరణ ప్రారంభించాలని ఆదేశించారు. ఉత్తర భాగంలో ఇప్పటికే చాలావరకు పూర్తయినందున, దక్షిణ భాగంలోనూ › 11వ పేజీలో



పేలిన రియాక్టర్ 16 మంది మృతి

- 50 మందికిపైగా గాయాలు
- అచ్యుతాపురం సెజ్‌లో ఘోర ప్రమాదం › 6
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం
- ఘటన పట్ల ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

కర్ణాటకలో కుర్చీలాట

కర్ణాటకలో కుర్చీలాట మొదలైంది. సీఎం సిద్ధరామయ్య మెడకు ముడా స్కామ్ చుట్టుకుంటున్నది. ఇదే అదనుగా ముఖ్యమంత్రి పీఠాన్ని కైవసం చేసుకోవడానికి డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పావులు కదపడం మొదలుపెట్టారు. 20 మంది ఎమ్మెల్యేల మద్దతున్న ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన సతీశ్ జార్కిహోళిని డీకే కలుసుకున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై జార్కిహోళి చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో కలకలం సృష్టిస్తున్నాయి.

సీఎం సిద్ధూను మారిస్తే.. రేవంత్‌నూ మారుస్తారా?

కర్ణాటక కాంగ్రెస్ మంత్రి జార్కిహోళి సూటి ప్రశ్న



- కర్ణాటకలో సిద్ధరామయ్య సర్కారుకు ఇబ్బంది కలిగితే ఆ ప్రభావం తెలంగాణలో రేవంత్ సర్కారుపై పడొచ్చు
- 'ముడా' కేసులో సిద్ధరామయ్యకు అండగా ఉందాం
- ఎట్టిపరిస్థితుల్లోనూ కన్నడ ముఖ్యమంత్రిని మార్చొద్దు
- మారిస్తే, తప్పచేసినట్టు మనకు మనం ఒప్పుకొన్నట్టే
- కాంగ్రెస్ అధిష్ఠానానికి మంత్రి సతీశ్ జార్కిహోళి విజ్ఞప్తి
- తెలంగాణలో రేవంత్‌కూ నోటీసులు రావొచ్చని జోస్యం
- అలా ఇస్తే.. రేవంత్‌ను మారుస్తారా? అని సూటి ప్రశ్న

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

బెంగళూరు, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): 'ముడా' భూ కుంభకోణం, వాల్మీకి కార్పొరేషన్ కేసులు కర్ణాటకలోని సిద్ధరామయ్య సర్కారును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కేసుల తీవ్రత దృష్ట్యా సీఎం మార్పు త్వరలోనే జరుగనున్నట్టు పెద్దఎత్తున చర్చ జరుగుతున్నది. ఈ క్రమంలో పీడబ్ల్యూడీ మంత్రి సతీశ్ జార్కిహోళి కాంగ్రెస్ అధిష్ఠానానికి కీలక విజ్ఞప్తి చేశారు. కర్ణాటకలో సిద్ధరామయ్య సర్కారుకు ఏదైనా ఇబ్బంది కలిగితే.. ఆ ప్రభావం తెలంగాణలోని రేవంత్ సర్కారుపై పడొచ్చని జోస్యం చెప్పారు. సీఎం సిద్ధరామయ్యను మార్చవద్దన్న మంత్రి.. పనిలో పనిగా తెలంగాణ › 7వ పేజీలో

బీజేపీ పరువునష్టం దావా.. రేవంత్‌పై క్రిమినల్ కేసు › 11

కన్నడనాట.. కుర్చీలాట!

వరుస స్కామ్‌లతో సిద్ధరామయ్య ఉక్కిరిబిక్కిరి.. సీఎం పదవిపై అనాసక్తి

- సీఎం పీఠంపై డీకే శివకుమార్ కన్ను
- తెరవెనుక వేగంగా మంత్రాంగం
- మంత్రి సతీశ్ జార్కిహోళితో భేటీ
- మద్దతు ప్రకటించాలంటూ అభ్యర్థన
- డీకేకు మద్దతుపై జార్కిహోళి విముఖత
- సీఎం పదవిపై ఆసక్తితో ఉండటమే కారణం
- పరమేశ్వర, ఖర్గే పేర్లను పరిశీలిస్తున్న అధిష్ఠానం













(స్పెషల్ టాస్క్ బ్యూరో)

బెంగళూరు, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల్లో సీఎం పోస్టుకు గ్యారెంటీ ఉండదని అంటారు. చరిత్ర చెప్తున్న సత్యమిది. అధికారంలోకి వచ్చి 15 నెలలు కాకముందే కర్ణాటకలో మరోసారి సీఎం పదవి కోసం కుర్చీలాట మొదలైంది. సీఎం సిద్ధరామయ్య వరుస స్కామ్‌లతో ఉక్కిరిబిక్కిరి అవుతుండటంతో కన్నడ రాజకీయం రసకందాయంలో పడింది. ఇదే అదునుగా సీఎం పోస్టు కోసం కీలక నేతలు తెరవెనుక మంత్రాంగాలు మొదలుపెట్టారు.

సిద్ధరామయ్య అనాసక్తితో..

ముడా భూములు, వాల్మీకి కార్పొరేషన్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఇలా వరుస స్కామ్‌లతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సిద్ధరామయ్య సీఎం పదవి నుంచి దిగిపోవడానికి సిద్ధమైనట్టు వార్తలు వస్తున్నాయి. ఇదే విషయమై అధిష్ఠానం బుజ్జగింపులకు ప్రయత్నించినా.. సిద్ధరామయ్య తిరస్కరిస్తున్నట్టు తెలుస్తున్నది. వెరసి కర్ణాటకలో సీఎం మార్పు త్వరలోనే జరగనున్నట్టు సమాచారం. ఇదే అదునుగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ తెరవెనుక మంత్రాంగాన్ని ప్రారంభించారు. మంత్రి సతీశ్ జార్కిహోళితో సోమవారం రాత్రి 40 నిమిషాల పాటు ఏకాంతంగా భేటీ అయ్యారు.

జార్కిహోళితోనే భేటీ ఎందుకు?

నిరుడు కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే డీకే సీఎం అవుతారని భావించారు. అయితే, అధిష్ఠానం సిద్ధరామయ్యకు ఆ పదవిని కట్టబెట్టింది. దీనిపై డీకే వర్గం ఎమ్మెల్యేలు గుర్రుగా ఉన్నారు. కానీ, మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు సిద్ధరామయ్యకు ఉండటంతో ఇంతకాలం సీఎం మార్పు జరుగలేదు. ఇదే సమయంలో డీకేకు ఉప ముఖ్యమంత్రి పదవిని అధిష్ఠానం కేటాయించింది. కాగా, సిద్ధరామయ్య సీఎం పదవి నుంచి దిగిపోతే ఎవరు ఆ రేసులో ఉంటారన్న చర్చ ప్రస్తుతం జరుగుతున్నది. సిద్ధరామయ్య తప్పుకుంటే, సీఎం పదవిని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లేదా మంత్రి జీ పరమేశ్వరకు కట్టబెట్టాలని అధిష్ఠానం భావిస్తున్నట్టు సమాచారం. దీంతో డీకే.. ఉన్నపళంగా సోమవారం రాత్రి జార్కిహోళిని కలిశారు. ఒకవేళ, సీఎంగా తనను ప్రతిపాదించి మద్దతు ప్రకటిస్తే, కేపీసీసీ అధ్యక్ష పదవి వచ్చేలా తాను అధిష్ఠానాన్ని ఒప్పిస్తానని జార్కిహోళికి డీకే ఆఫర్ ఇచ్చినట్టు తెలిసింది. కాగా, జార్కిహోళికి 20 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉన్నది. కాబట్టే, జార్కిహోళిని డీకే కలిసినట్టు చెప్తున్నారు.

సీఎం పీఠంపై జార్కిహోళి ఆసక్తి

సీఎంగా డీకేకు జార్కిహోళి మద్దతు ప్రకటించకపోవడానికి బలమైన కారణం ఉన్నదని విశ్లేషకులు చెప్తున్నారు. జార్కిహోళి వాల్మీకి(ఎస్టీ) వర్గానికి చెందిన బలమైన నేత. అధిష్ఠానం తనను సీఎంగా చేస్తుందన్న ఆకాంక్ష ఈయనలో ఉన్నది. గత నవంబర్‌లో ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. 'దళితులతో సహా అన్ని వర్గాల ప్రజలు తమ నేత సీఎం అవ్వాలని కోరుకొంటున్నారు. ఆ మేరకు డిమాండ్లు ఉన్నాయి. అయితే దానిపై పార్టీ హైకమాండే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. వాల్మీకి గురుపీఠ స్వామీజీ ప్రసన్నానంద నన్ను సీఎంగా చూడాలనుకొంటున్నట్టు పేర్కొన్న విషయం మీకు తెలిసిందే' అని సీఎం పదవిపై తన ఆసక్తిని జార్కిహోళి పరోక్షంగా తెలియజేశారు. డీకే తీరుపై జార్కిహోళి గత కొంత కాలంగా అసంతృప్తితోనూ ఉన్నారు. ఈ క్రమంలోనే తనను సీఎం చేయడానికి మద్దతు ఇవ్వాలన్న డీకే అభ్యర్థనను జార్కిహోళి తిరస్కరించినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి.

సీఎం సిద్ధూను మారిస్తే.. రేవంత్‌నూ మారుస్తారా?

మొదటిపేజీ తరువాయి...

సీఎం రేవంత్ రెడ్డిపై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈ విషయం పెద్దయెత్తున చర్చనీయాంశం అవుతున్నది.

జార్కిహోళి ఏమన్నారంటే?

'హిమాచల్, తెలంగాణ సహా మనం మొత్తంగా ఓ మూడు, నాలుగు రాష్ట్రాల్లోనే అధికారంలో ఉన్నాం. మన ప్రభుత్వాలను కూల్చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రయత్నిస్తున్నది. 'ముడా' స్కామ్‌లో సిద్ధరామయ్యను విచారించడానికి గవర్నర్ అనుమతివ్వడం ఇందులో భాగమే. ఇలాంటి సమయంలోనే హైకమాండ్ దృఢంగా ఉండాలి. పార్టీ శ్రేణులకు సరైన దిశానిర్దేశం చేయాలి. ఒకవేళ, కర్ణాటకలో సిద్ధరామయ్య సర్కారుకు ఏదైనా ఇబ్బంది కలిగితే.. ఆ ప్రభావం తెలంగాణలోని రేవంత్ సర్కారుపై పడొచ్చు. ఇక్కడ సిద్ధరామయ్య ఇబ్బందులను ఎదుర్కొంటే, తర్వాత తెలంగాణలో రేవంత్ రెడ్డి కూడా ఇబ్బందులను ఎదుర్కోవచ్చు. ఇక్కడ సిద్ధరామయ్యకు నోటీసులు వచ్చినట్టే, అక్కడ రేవంత్‌కు కూడా రేపోమాపో నోటీసులు రావొచ్చు. ఆయననూ టార్గెట్ చేయొచ్చు. ఇప్పుడు సిద్ధరామయ్యను సీఎం పోస్టు నుంచి తప్పిస్తే, రేవంత్‌నూ తప్పించాల్సి ఉంటుంది. ఇదే జరిగితే, తప్పుచేసినట్టు మనకు మనం ఒప్పుకొన్నట్టే. కాబట్టి, 'ముడా' కేసులో సిద్ధరామయ్యకు మనమంతా అండగా ఉండాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ సీఎంని మార్చొద్దు. ఈ మేరకు అధిష్ఠానం దృఢమైన నిర్ణయాన్ని తీసుకోవాలి' అని జార్కిహోళి పేర్కొన్నారు.

అవును మాకు ఎదురుదెబ్బే

'ముడా' కేసులో సిద్ధరామయ్యను విచారించడానికి గవర్నర్ అనుమతించడం తమకు ఎదురుదెబ్బేనని జార్కిహోళి ఒప్పుకొన్నారు. అయితే, ఈ విషయాన్ని రాజకీయంగా ఎదుర్కోవాల్సిన అవసరమున్నదన్నారు.

సీఎంగా సిద్ధరామయ్యనే ఎందుకంటే?

కర్ణాటకలో నిరుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం పదవికి డీకే శివకుమార్, సిద్ధరామయ్యతో పాటు సతీశ్ జార్కిహోళి కూడా పోటీపడ్డారు. అయితే, అధిష్ఠానం సిద్ధరామయ్యను సీఎంగా ప్రకటించింది. ఈ నిర్ణయంపై డీకే వర్గం అసంతృప్తితో రగిలిపోయింది. ప్రభుత్వాన్ని కూల్చడానికి ప్రయత్నాలు చేసినట్టు వార్తలు వచ్చాయి. అయితే, అప్పటికే డీకే శివకుమార్‌తో విభేదాలు ఉన్న జార్కిహోళి ఇష్టంలేకపోయినా సిద్ధరామయ్యకు మద్దతు ప్రకటిస్తూ వస్తున్నారు. తాజాగా వివాదాల కారణంగా సిద్ధరామయ్య సీఎం పదవికి దూరమైతే, డీకే ఆ పోస్టులోకి రావొచ్చన్న ఊహాగానాలు పెరిగిపోయాయి. డీకే సీఎంగా ఉండటం ఇష్టంలేకనే జార్కిహోళి 'సిద్ధరామయ్యను సీఎంను మార్చొద్దంటూ' అధిష్ఠానానికి విజ్ఞప్తి చేసినట్టు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

రేవంత్‌కు నోటీసులా? ఏ కేసులో??

- రేపోమాపో రేవంత్‌కు నోటీసులంటూ కర్ణాటక మంత్రి సంచలన వ్యాఖ్యలు
- ఇప్పటికే రేవంత్‌పై 161 పోలీసు కేసులు
- ఇందులో క్రిమినల్ కేసులు 70కిపై మాటే
- సుప్రీంకోర్టులో 'ఓటుకు నోటు' కేసు విచారణ
- ఇందులో ఏ కేసులో రేవంత్‌కు నోటీసులు ఇవ్వొచ్చు
- సోషల్‌మీడియాలో పెద్దయెత్తున జరుగుతున్న చర్చ



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

బెంగళూరు, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలో సీఎం సిద్ధరామయ్యకు నోటీసులు ఇచ్చినట్టే, రేవంత్‌కు కూడా రేపోమాపో నోటీసులు రావొచ్చంటూ ఆ రాష్ట్ర పీడబ్ల్యూడీ మంత్రి సతీశ్ జార్కిహోళి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. సీఎం రేవంత్ రెడ్డికి ఏ కేసులో నోటీసులు ఇచ్చే అవకాశమున్నదంటూ నెట్టింట పెద్దయెత్తున చర్చ జరుగుతున్నది.

రేవంత్‌పై 161 కేసులు

సీఎం రేవంత్ రెడ్డిపై రాష్ట్రవ్యాప్తంగా 89 పోలీసు స్టేషన్లలో ఇప్పటివరకూ 161 కేసులు నమోదయ్యాయి. ఇందులో 70కిపైగా క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఈ మేరకు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సమర్పించిన అఫిడవిట్‌లో రేవంత్ స్వయంగా వెల్లడించారు. ఇక, 2015లో టీడీపీలో ఉన్న రేవంత్‌రెడ్డి.. అప్పటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కొనుగోలు చేసేందుకు ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు రూ. 50 లక్షలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తూ పట్టుబడ్డారు. ఇదే 'ఓటుకు నోటు' కేసుగా ప్రాచుర్యం పొందింది. ప్రస్తుతం ఈ కేసు సుప్రీంకోర్టు విచారణలో ఉన్నది. పెట్టుబడుల పేరిట సోదరుడు జగదీశ్వర్‌రెడ్డికి చెందిన 'స్వచ్ఛబయో'తో ఒప్పందం చేసుకోవడం, ఆ కంపెనీ నుంచి తెలంగాణకు రూ.1000 కోట్ల పెట్టుబడులు రానున్నట్టు ప్రకటించడాన్ని తప్పుబడుతూ బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్ ఇప్పటికే ఈడీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఇందులో ఏ కేసుకు సంబంధించి రేవంత్‌కు నోటీసులు రావొచ్చని నెటిజన్లు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.

వాల్మీకి స్కామ్‌తో 9 హైదరాబాదీ కంపెనీలకు లింక్?

కర్ణాటకలో సిద్ధరామయ్య సర్కారును కుదిపేస్తున్న 'మహర్షి వాల్మీకి కార్పొరేషన్ లిమిటెడ్'లో వెలుగుచూసిన రూ.187 కోట్ల విలువైన కుంభకోణం మూలాలు హైదరాబాద్‌లోనూ ఉన్నాయని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నివేదిక, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చేసిన ఇటీవలి విచారణలో తేలింది. కుంభకోణంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన తొమ్మిది కంపెనీల ఖాతాలకు రూ.44.6 కోట్లు జమ అయినట్టు సిట్ నివేదికలో స్పష్టం చేసింది. ఈ ఖాతాలు ఐటీ, జ్యువెలరీ, లిక్కర్ తదితర రంగాలకు చెందిన కంపెనీలవని తెలుస్తున్నది. ఈ స్కామ్ డబ్బునే ఇటీవలి లోక్‌సభ ఎన్నికలకు ముందు ఓ పార్టీ ఖర్చు చేసినట్టు సిట్, ఈడీ నివేదిక వెల్లడించింది. కాగా, వాల్మీకి సామాజిక వర్గంలో బలమైన నేతగా ఉన్న సతీశ్ జార్కిహోళి.. తమ కార్పొరేషన్ నిధులు పక్కదారి పట్టినప్పటికీ ఏమాత్రం స్పందించడం లేదంటూ ఆ వర్గం ప్రజలు ఆయనపై గుర్రుగా ఉన్నారు. ఇదే విషయమై ఆయనపై పలు విధాలుగా అసంతృప్తిని వ్యక్తం చేశారు. దీంతో పెరుగుతున్న అసమ్మతిని చల్లార్చడానికి ఆయన చేయని ప్రయత్నం లేదు. కాగా, 'వాల్మీకి స్కామ్' కాంగ్రెస్ పాలిస్తున్న కర్ణాటకలో జరుగడం, అక్కడి డబ్బు తెలంగాణకు చేరడం, తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం అధికారంలో ఉండటం, నోటీసుల గురించి 'వాల్మీకి' సామాజిక వర్గానికి చెందిన బలమైన నేత జార్కిహోళి సంచలన వ్యాఖ్యలు చేయడాన్ని చూస్తే.. ఈ స్కామ్‌లోనే సీఎంకు నోటీసులు వస్తాయా? అంటూ పలువురు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

ఖరీదైన ప్రాంతంలో భూమి ఇవ్వండి!

- 2014లో ముడాకు సిద్ధరామయ్య భార్య లేఖ
- స్థలం ఎక్కడ కావాలో కూడా చెప్పిన వైనం
- స్కామ్ బయటపడ్డాక వైట్‌నర్‌తో కొట్టివేత!
- 'ముడా స్కామ్'లో కీలక ఆధారం బయటకు
- సిద్ధరామయ్య చెప్తున్న దానికి విరుద్ధంగా లేఖ



బెంగళూరు, ఆగస్టు 21/(స్పెషల్ టాస్క్ బ్యూరో): కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మెడకు చుట్టుకొన్న 'ముడా స్కామ్'లో కీలక పరిణామం చోటుచేసుకొన్నది. ఈ స్కామ్‌తో తనకు, తన కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని వాదించిన సిద్ధరామయ్య మాటలన్నీ అబద్ధమని తేలింది. ఇందుకు సంబంధించిన కీలక ఆధారం బయటకొచ్చింది. తనకు ఖరీదైన ప్రాంతంలో స్థలాన్ని కేటాయించాల్సిందిగా కోరుతూ మైసూర్ అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీ (ముడా) అధికారులకు సిద్ధరామయ్య సతీమణి పార్వతి లేఖ రాశారు. సిద్ధరామయ్య తొలిసారిగా ముఖ్యమంత్రి అయిన తర్వాత 2014లో ఆమె ఈ లేఖ రాసినట్టు తెలుస్తున్నది. ఈ మేరకు రిపబ్లిక్ కన్నడ న్యూస్ వెబ్‌సైట్ ఓ కథనంలో ఆధారాలను బయటపెట్టింది.

రాసి.. ఆ తర్వాత చెరిపేసి

తనకు ఖరీదైన ప్రాంతంలో స్థలం కావాలంటూ లేఖ రాసిన పార్వతి ఎక్కడ స్థలం కావాలనుకొంటున్నారో ఆ నిర్దిష్ట ప్రాంతాన్ని కూడా లేఖలో స్పష్టం చేశారు. అయితే, దీనిని వైట్‌నర్‌తో ఉద్దేశపూర్వకంగా కొట్టివేశారు. ముడా కుంభకోణం బయటపడ్డాకనే ఆధారాలు చెరిపేయాలనే లక్ష్యంతోనే ఇలా కొట్టేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆధారాలను బట్టి.. భర్త సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఖరీదైన ప్రాంతంలో తనకు భూములు కేటాయించాల్సిందిగా పార్వతి కోరినట్టు అర్థమవుతున్నది. దీనికోసం ఆమె సీఎంగా సిద్ధరామయ్య హోదాను వినియోగించుకొన్నట్టు తెలుస్తున్నది. స్కామ్ విషయం బయటకు రాగానే.. కీలకమైన సమాచారాన్ని చెరిపేయడానికి వైట్‌నర్‌ను కూడా వాడినట్టు స్పష్టమవుతున్నది. కాగా, మైసూరు శివారుల్లోని కెసరె గ్రామంలో సిద్ధరామయ్య భార్య పార్వతికి చెందిన 3 ఎకరాల 16 గుంటల భూములను అవసరాల దృష్ట్యా సేకరించిన ప్రభుత్వం.. వాటికి బదులుగా నగరం లోపల అత్యంత ఖరీదైన ప్రాంతాలుగా చెప్పుకొనే విజయనగరలో భూములను కేటాయించింది. కెసరెలోని భూములతో పోలిస్తే మార్కెట్ ధర ఎంతో ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సిద్ధరామయ్య కుటుంబానికి ఆ భూములను కేటాయించడంపై విమర్శలు వచ్చాయి. దీన్నే 'ముడా' స్కామ్‌గా పిలుస్తున్నారు.

చంపయీ సోరేన్ కొత్త పార్టీ

ప్రకటించిన జార్ఖండ్ మాజీ సీఎం

రాంచీ: జార్ఖండ్‌లో అధికార జేఎంఎం పార్టీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి కీలక నేత, మాజీ సీఎం చంపయీ సోరేన్ గుడ్‌బై చెప్పనున్నారు. తాను కొత్త పార్టీని స్థాపించి బలోపేతం చేస్తానని బుధవారం ఆయన ప్రకటించారు. వారం రోజుల్లో అన్ని వివరాలూ చెప్తానని అన్నారు. ఈ క్రమంలో నమ్మకమైన స్నేహితుడు కలిసి వస్తే కలుపుకొని వెళ్తానని తెలిపారు. మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో చంపయీ సోరేన్ నిర్ణయం జార్ఖండ్ రాజకీయాలను కొత్త మలుపు తిప్పింది. హేమంత్ సోరేన్ జైలుకు వెళ్లిన సమయంలో ఐదు నెలల పాటు చంపయీ సీఎంగా పని చేసిన సంగతి తెలిసిందే.

వచ్చే నెల నుంచి జనగణన?

- 18 నెలల పాటు కొనసాగే అవకాశం
- కేంద్ర ప్రభుత్వ వర్గాల వెల్లడి
- 2021లో జరగాల్సి ఉన్న ప్రక్రియ
- కొవిడ్ కారణంగా వాయిదా



న్యూఢిల్లీ, ఆగస్టు 21: సెప్టెంబరు నుంచి దేశంలో జనగణన జరపాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ మేరకు ఇద్దరు ప్రభుత్వ ఉన్నతాధికారులు తెలిపారని రాయిటర్స్ న్యూస్ ఏజెన్సీ ఒక కథనంలో పేర్కొన్నది. దేశంలో ప్రతి పదేండ్లకు ఒకసారి జనగణన జరుగుతున్నది. ఈ లెక్కన 2021లో జరగాల్సి ఉన్నప్పటికీ కొవిడ్ మహమ్మారి కారణంగా వాయిదా పడింది. ఆ తర్వాత మహమ్మారి ప్రభావం తగ్గినప్పటికీ జనగణనపై కేంద్రం దృష్టి సారించలేదు. దీంతో ప్రభుత్వంపై అనేక విమర్శలు వచ్చాయి. జనగణన జరగకపోవడం వల్ల ఆర్థిక డాటా, ద్రవ్యోల్బణం, ఉద్యోగాలకు సంబంధించిన సమాచార నాణ్యతపై ప్రభావం పడుతున్నదని పలువురు ఆర్థికవేత్తలు కూడా పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ లెక్కలన్నీ 2011 జనాభా లెక్కల ఆధారంగా చేస్తూ రావడం వల్ల దేశంలో అసలైన పరిస్థితులు ప్రతిబింబించడం లేదని అభిప్రాయపడ్డారు. దీంతో ఎట్టకేలకు వచ్చే నెల నుంచి ఈ ప్రక్రియను ప్రారంభించనున్నట్టు సమాచారం.

18 నెలల పాటు ప్రక్రియ

జనగణన పూర్తి కావడానికి దాదాపు 18 నెలల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. హోంశాఖ ఈ ప్రక్రియకు నేతృత్వం వహించనున్నది. 2026 మార్చిలో ప్రభుత్వ గణాంకాలను వెల్లడించే అవకాశం ఉందని తెలుస్తున్నది. ప్రధాన మంత్రి కార్యాలయం తుది అనుమతులు రాగానే జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కాబోతున్నట్టు ప్రభుత్వ అధికారులను ఉటంకిస్తూ రాయిటర్స్ పేర్కొన్నది. కాగా, ఇప్పటికే జనాభాలో చైనాను భారత్ దాటిపోయి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా మారిందని గత ఏడాది ఐక్యరాజ్యసమితి నివేదిక పేర్కొన్నది. జనగణనతో ఈ విషయం అధికారికంగా వెల్లడి కానున్నది.

బీజేపీతో స్టాలిన్ పొత్తు?

- కరుణానిధిపై రాజ్‌నాథ్ పొగడ్తల వర్షం
- తమిళ నాడులో కొత్త పొత్తులపై ఊహాగానాలు

చెన్నై, ఆగస్టు 21: డీఎంకే వ్యవస్థాపకుడు ఎం కరుణానిధి శత జయంతి ఉత్సవాలు తమిళనాడు రాష్ట్రంలో కొత్త రాజకీయ సమీకరణలపై ఊహాగానాలకు తెరతీశాయి. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అనూహ్యంగా దివంగత నేత కరుణానిధిపై పొగడ్తల జల్లు కురిపించడంతో కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సహా పార్టీ వర్గాలు కూడా ఆశ్చర్యపోయాయి. డీఎంకే నేతలు కూడా పొగడని విధంగా రాజ్‌నాథ్ తమ నేతను ప్రశంసించారని స్టాలిన్ పేర్కొన్నారు. అయితే రాజ్‌నాథ్ చర్యతో రాష్ట్రంలో ఇరు పార్టీల మధ్య కొత్త పొత్తులకు దారితీస్తాయన్న ఊహాగానాలు ప్రారంభమయ్యాయి. బీజేపీతో స్టాలిన్ పొత్తు పెట్టుకుంటారని, చాలా ఏండ్లుగా కాంగ్రెస్‌తో ఉన్న మైత్రిని తెంచుకుని డీఎంకే ఈసారి బీజేపీతో అడుగులు వేస్తుందని రాజకీయ వర్గాల్లో చర్చలు మొదలయ్యాయి. అయితే ఇప్పటివరకు డీఎంకే మిత్రపక్షంగా ఉన్న కాంగ్రెస్ 2026 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా తమ బంధం ఇలాగే కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నది.

ఇక గుండెమార్పిడికి తొమ్మిది గంటలు

- 'హార్ట్ ఇన్ ఏ బాక్స్'లో 9 గంటల పాటు సజీవంగా ఉండనున్న గుండె
- భవిష్యత్తులో హార్ట్ ఫెయిల్యూర్ ముప్పు తక్కువ




స్టాక్‌హోమ్, ఆగస్టు 21: మరణం ఖాయమైన వ్యక్తి గుండెను అమర్చి మరో మనిషికి ప్రాణం పోసే గుండె మార్పిడి ప్రక్రియకు ఎంతో మేలు చేసే పరికరాన్ని శాస్త్రవేత్తలు తయారు చేశారు. హైపోథెర్మిక్ ఆక్సిజెనేటెడ్ మెషీన్ పెర్ఫ్యూషన్(హోప్) అనే ఈ పరికరాన్ని హార్ట్ ఇన్ ఏ బాక్స్ అని కూడా పిలుస్తారు. ఇందులో గుండెను పెట్టి దాత వద్ద నుంచి అందుకునే వ్యక్తి వద్దకు సరఫరా చేస్తారు.

ఇప్పటివరకు 4 డిగ్రీల సెల్సియస్ ఉండేలా చిన్న రిఫ్రిజిరేటర్లలో గుండెను తరలించేవారు. ఇందులో పొటాషియం సొల్యూషన్ నింపే వారు. అయితే, ఈ పద్ధతిలో దాత నుంచి గుండెను తీసి తర్వాత నాలుగు గంటల్లోనే మరో వ్యక్తికి అమర్చాల్సి ఉంటుంది. సమయం మీరితే గుండె విఫలమవుతుంది. ఈ పరిస్థితిని మార్చడానికి హోప్ పరికరాన్ని తయారుచేశారు. ఇందులో పెడితే గుండె తొమ్మిది గంటల పాటు సజీవంగా ఉంటుందని స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు తేల్చారు. ఈ పరికరంలో గుండెకు ఆక్సిజన్‌తో పాటు పలు రకాల ఫ్లూయిడ్స్ సరఫరా అవుతూ ఉంటాయి. రిఫ్రిజిరేటర్లతో పోలిస్తే ఇందులో రవాణా చేసి ట్రాన్స్‌ప్లాంట్ చేసిన వారిలో గుండె విఫలమయ్యే ముప్పు కూడా 11 శాతం తక్కువ అని పరిశోధకులు తెలిపారు.

కుమారస్వామి విచారణకు అనుమతివ్వండి!

- గవర్నర్‌ను కోరిన కర్ణాటక లోకాయుక్త సిట్
- కేంద్ర మంత్రిపై అక్రమ మైనింగ్ లీజ్ ఆరోపణలు



బెంగళూరు: అక్రమ మైనింగ్ లీజ్ ఆరోపణల కేసులో కేంద్ర మంత్రి, కర్ణాటక మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామిని విచారించేందుకు, చార్జిషీట్ దాఖలు చేసేందుకు అనుమతించాలని కర్ణాటక లోకాయుక్త ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) గవర్నర్ గెహ్లాట్‌ను కోరింది. ఈ మేరకు ప్రతిపాదనను సిట్ సోమవారం మరోసారి సమర్పించింది. కుమారస్వామిని విచారించేందుకు సిట్ తొలిసారిగా గత ఏడాది నవంబర్‌లోనూ గవర్నర్ అనుమతి కోరింది. అయితే అప్పుడు అనుమతి ఇవ్వలేదు. ముడా స్కామ్‌లో సీఎం సిద్ధరామయ్యను విచారించేందుకు గవర్నర్ అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఇప్పుడు ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

కుమారస్వామిపై ఆరోపణలు ఏంటి?

కుమారస్వామి కర్ణాటక సీఎంగా ఉన్న సమయంలో 2007లో చట్టవిరుద్ధంగా శ్రీసాయి వెంకటేశ్వర మినరల్స్ అనే కంపెనీకి బళ్లారి జిల్లా సందూర్ తాలూకా భవిహల్లిలో 550 ఎకరాల్లో మైనింగ్ లీజ్ కట్టబెట్టారన్న ఆరోపణలు వచ్చాయి. లీజ్ కోసం దరఖాస్తు చేసుకొన్న 24 కంపెనీలను కాదని సదరు కంపెనీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి.

సిద్ధరామయ్య వర్సెస్ కుమారస్వామి

తాజా పరిణామంపై కుమారస్వామి, సిద్ధరామయ్య మధ్య మాటల యుద్ధం జరిగింది. ఈ కేసులో కుమారస్వామిని ఒకవేళ అరెస్టు చేయాల్సిన పరిస్థితి ఉంటే, ఎలాంటి సంకోచం లేకుండా ఆయన్ను అరెస్టు చేస్తామని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. గవర్నర్ అనుమతిస్తారేమోనని కుమారస్వామి భయపడుతున్నారని అన్నారు. సీఎం వ్యాఖ్యలను కుమారస్వామి తిప్పికొట్టారు. 'నన్ను అరెస్టు చేసేందుకు 100 మంది సిద్ధరామయ్యలనైనా రానివ్వండి. నన్ను చూస్తే భయపడుతున్నానని మీరు అనుకొంటున్నారా?' అని పేర్కొన్నారు.

రెడ్ మీట్‌తో మధుమేహ ముప్పు

తాజా అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ: రెడ్ మీట్‌ను తినడం వల్ల టైప్-2 డయాబెటిస్ ముప్పు పెరుగుతుందని తాజా అధ్యయనంలో తేలింది. 20 దేశాల్లోని సుమారు 19 లక్షల మందిపై ఈ అధ్యయనం నిర్వహించారు. 50 గ్రాముల ప్రాసెస్డ్ మీట్‌ను అలవాటుగా తినడం వల్ల టైప్-2 మధుమేహం ముప్పు 15 శాతం పెరిగే అవకాశం ఉంటుందని, 100 గ్రాముల అన్‌ప్రాసెస్డ్ మీట్‌ను తింటే 10 శాతం వరకు, 100 గ్రాముల పౌల్ట్రీ వల్ల 8 శాతం వరకు ముప్పు పెరుగుతుందని తెలిపింది. ఈ అధ్యయన నివేదికను 'ది లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండోక్రినాలజీ' జర్నల్‌లో ప్రచురించారు. అమెరికా, బ్రిటన్, బ్రెజిల్, మెక్సికో తదితర దేశాల పరిశోధకులు చెప్తున్నదాని ప్రకారం, ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో సిఫారసు చేసిన పరిమాణం కన్నా ఎక్కువగా మాంసాన్ని తినడానికి, టైప్-2 డయాబెటిస్ సహా అసాంక్రమిక వ్యాధులు రావడానికి సంబంధం ఉన్నట్టు నిర్ధారణ అయింది. పదేండ్లపాటు జరిగిన ఈ అధ్యయనంలో 19,66,444 మంది పాల్గొన్నారు. వీరిలో 1 లక్ష మందికి పైగా టైప్-2 మధుమేహం బారినపడ్డారు. రోజూ 50 గ్రాముల ప్రాసెస్డ్ మీట్ తినేవారు దానికి బదులుగా 100 గ్రాముల అన్‌ప్రాసెస్డ్ రెడ్ మీట్ తినడం వల్ల టైప్-2 డయాబెటిస్ సగటున 7 శాతం తగ్గినట్లు వెల్లడైంది. రోజూ 50 గ్రాముల ప్రాసెస్డ్ మీట్‌కు బదులుగా 100 గ్రాముల పౌల్ట్రీని తినడం వల్ల ఈ వ్యాధి ముప్పు 10 శాతం తగ్గింది.

తొలి పునర్వినియోగ రాకెట్

'రూమీ-1' ప్రయోగానికి సిద్ధం

చెన్నై, ఆగస్టు 21: భారత్ మొట్టమొదటి పునర్వినియోగ హైబ్రిడ్ రాకెట్ 'రూమీ-1' ప్రయోగానికి సిద్ధమైంది. ఆగస్టు 24న చెన్నైకి సమీపంలోని 'మొబైల్ లాంచ్‌ప్యాడ్' నుంచి ఈ రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపుతున్నట్టు తమిళనాడుకు చెందిన టెక్ కంపెనీ 'స్పేస్ జోన్ ఇండియా' సీఈవో ఆనంద్ మేగలింగం తాజాగా ప్రకటించారు. ఈ ప్రయోగంలో.. హైబ్రిడ్ రాకెట్ 'పేలోడ్' తిరిగి సముద్రంలో పడ్డాక దానిని సేకరించి, తిరిగి రాకెట్ ప్రయోగంలో ఉపయోగిస్తారు. పునర్వినియోగ రాకెట్‌లను అభివృద్ధి చేయటం, ఖర్చును తగ్గించటం 'రూమీ-1' ప్రయోగం లక్ష్యమని ఆయన తెలిపారు.

చంద్రుడి ఉపరితలంపై శిలాద్రవం

- ఒకప్పుడు ఉండేదని గుర్తించిన పరిశోధకులు
- చంద్రయాన్-3 డాటా అధ్యయనంతో వెల్లడి



న్యూఢిల్లీ, ఆగస్టు 21: చంద్రుడి ఉపరితలం మొత్తం ఒకప్పుడు శిలాద్రవ సముద్రమే అనే వాదనను ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3 డాటా సైతం ధ్రువీకరించింది. ఈ మేరకు అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీతో పాటు పలు సంస్థలకు చెందిన అధ్యయనం వివరాలు 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. గతంలో నాసాకు చెందిన అపోలో, సోవియెట్ యూనియన్‌కు చెందిన లూనా చంద్రుడి నాడీమండల, మధ్య అక్షాంశ ప్రాంతాల నమూనాలను సేకరించాయి. వీటిని అధ్యయనం చేసిన తర్వాత చంద్రుడిపై ఒకప్పుడు శిలాద్రవం ఉండేదనే అభిప్రాయానికి శాస్త్రవేత్తలు వచ్చారు. అయితే, చంద్రయాన్-3లో భాగంగా ప్రజ్ఞాన్ రోవర్ మాత్రం చంద్రుడి దక్షిణ ధ్రువం నుంచి డాటాను పంపించింది. ఈ డాటాను అధ్యయనం చేసిన పరిశోధకులు దక్షిణ ధ్రువంపై కూడా శిలాద్రవమే ఉండేదని గుర్తించారు. అంతేకాదు, చంద్రుడి ఉపరితలం మొత్తం ఫెర్రోన్ అనార్థోసైట్(ఎఫ్ఏఎన్) అనే ఒకే రకమైన రాయితో ఏర్పడిందని సైతం పరిశోధకులు గుర్తించారు. శాస్త్రవేత్తల ఊహిస్తున్న దాని ప్రకారం.. రెండు ప్రోటోప్లానెట్లు ఢీకొనడం వల్ల చంద్రుడు ఏర్పడ్డాడు. ఫలితంగా చంద్రుడు చాలా వేడిగా మారిపోయాడని, వేడికి ఉపరితలం కరిగి శిలాద్రవ సముద్రంగా మారిందని పరిశోధకులు తెలిపారు.

తీరని రుణం.. రైతుల రణం



• ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో..



ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం నేరడిగొండ బ్యాంకు ముందు రైతులు ధర్నా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా రేవంత్ షరతుల్లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

• మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో..



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట బ్యాంకు వద్దకు వివిధ గ్రామాలకు చెందిన రైతులు భారీగా తరలివచ్చారు. తమ రుణమాఫీ చేయాలని అధికారులను నిలదీశారు.

• నారాయణపేట జిల్లా ధన్వాడలో..



నారాయణపేట జిల్లా ధన్వాడ రైతు వేదికలో ఏఈఓ సైమన్‌ను రుణమాఫీ చేయాలని రైతులు నిలదీశారు. తమకు అన్ని అర్హతలు ఉన్నా ఎందుకు చేయడం లేదని అక్కడే ఉన్న వ్యవసాయ శాఖాధికారులను నిలదీశారు.



ఆదిలాబాద్ జిల్లా హస్నాపూర్‌లో

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం హస్నాపూర్ బ్యాంకుకు రైతులు తరలివచ్చారు. బ్యాంకు వద్ద అధికారుల కోసం వేచి చూశారు.

నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలో

నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలో జాతీయ రహదారిపై బైఠాయించిన అన్నదాతలను ఈడ్చిపాడేస్తున్న పోలీసులు



• సిద్దిపేట జిల్లా తోటపల్లిలో..



సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లిలో రెండోరోజూ బ్యాంకును మూసివేసి రైతులు నిరసన తెలిపారు. బ్యాంకు సిబ్బంది రైతుల పేర్లు రుణమాఫీకి పంపడంలో నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారుల విధులను అడ్డుకున్నారు.

బ్యాంకుల వద్ద రుణ రంగం

రూ.2లక్షల రుణమాఫీ అమలు అస్తవ్యస్తంగా మారింది. సగం మందికి మాఫీ అయ్యి, మరో సగం మందికి కాకపోవడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రుణ మాఫీ కోసం వ్యవసాయ అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. బ్యాంకులకు వెళ్తే అధికారులను కలువమని, అధికారులను కలిస్తే బ్యాంకులకు వెళ్లమని చెప్తున్నారని రైతులు వాపోతున్నారు. బ్యాంకర్ల తప్పిదాల వల్లే కొందరికి మాఫీ కాలేదంటూ మంత్రులు పదేపదే చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా రైతులు బ్యాంకులకు క్యూకట్టారు. తమ రుణమాఫీ ఎందుకు కావట్లేదని సిబ్బందిని నిలదీశారు. పలు చోట్ల ధర్నాలు చేశారు. విధులను అడ్డుకున్నారు. తమకు ఆధార్‌కార్డ్, రేషన్ కార్డు, పట్టా పాస్‌బుక్ ఉన్నప్పటికీ రుణం మాఫీ కాకపోవడమేంటని ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లా రుద్రూర్ ఏఈవో ఆఫీసులో తొలి, మలి విడుతల్లో రుణమాఫీ కాని రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులు చెల్లాచెదురుగా పడి ఉండడాన్ని చూసి రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

-నమస్తే తెలంగాణ, న్యూస్ నెట్‌వర్క్

అలా దరఖాస్తులు.. ఇలా చెల్లాచెదురు





నిజామాబాద్ జిల్లా రుద్రూర్‌లో రుణమాఫీ కాని రైతుల నుంచి నోడల్ అధికారి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఈఓ కార్యాలయంలో చిందరవందరగా పడేసిన దరఖాస్తులను చూసి రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

• నారాయణపేట జిల్లా ఊట్కూర్‌లో ..



నారాయణపేట జిల్లా ఊట్కూర్ ఎస్‌బీఐ వద్ద టోకెన్ల కోసం తోపులాడుకుంటున్న రైతులు. టోకెన్ల కోసం ఉదయం 9గంటలకే వచ్చి రైతులు బారులుదీరారు. తమకు అర్హత ఉన్నా రుణమాఫీ కాలేదని, బ్యాంక్ అధికారులను అడిగినా సమాధానం చెప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.



రుణమాఫీ కోసం దీక్ష

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం పేరాయగూడెంలో రుణమాఫీ చేయాలని స్వచ్ఛందంగా దీక్ష చేస్తున్న రైతులు

• కామారెడ్డి కలెక్టరేట్ వద్ద..



అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ భారత్ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

• జగిత్యాల జిల్లా పూడూర్‌లో ..



జగిత్యాల జిల్లా పూడూర్‌లో జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో చేపట్టారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పార్టీ శ్రేణులతో కలిసి ఆందోళనలో పాల్గొన్నారు.

• భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీనగరంలో..



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరం ఏపీజీవీబీ ఎదుట ప్రధాన రహదారిపై బీఆర్‌ఎస్ నాయకులు రైతులతో కలిసి రాస్తారోకో చేశారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

వేదిక
'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ల్యాటరల్ ఎంట్రీపై వెనుకడుగు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తలపెట్టిన ల్యాటరల్ ఎంట్రీ భర్తీ విధానం పురిట్లోనే సంధికొట్టింది. విపక్షాలు, స్వపక్షాల వ్యతిరేకత నడుమ మోదీ సర్కార్ వెనక్కి తగ్గక తప్పలేదు. కేంద్రంలోని పలు విభాగాల్లో డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ సెక్రెటరీ పోస్టుల భర్తీకి ఇటీవల యూపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. సాధారణంగా సివిల్ సర్వెంట్లతో భర్తీచేయాల్సిన ఈ పోస్టులను ప్రైవేట్ వ్యక్తులతో భర్తీ చేయడం.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు వీటిలో అమలు చేయకపోవడం వివాదాస్పదమైంది. కొన్ని ప్రత్యేక పదవుల్లో ఐఏఎస్‌లకు బదులుగా ఆయా రంగాల నిపుణులను నియమించాలన్న ఉద్దేశంతోనే ఈ నియామక విధానాన్ని తీసుకువచ్చినట్టు కేంద్రం చెప్తున్నది. 13 పాయింట్ రోస్టర్ పాలసీ ప్రకారం ల్యాటరల్ ఎంట్రీలకు రిజర్వేషన్లు వర్తించవు. ఈ పోస్టుల నియామకంలో రిజర్వేషన్లను తుంగలో తొక్కేందుకు ఒక్కో పోస్టుకు వేర్వేరుగా నోటిఫికేషన్ విడుదల చేశారు. అదే మొత్తం పోస్టులకు కలిపి ఒకే నోటిఫికేషన్ ఇస్తే రిజర్వేషన్లు పాటించాల్సి ఉంటుంది.

ఇప్పటికే కీలక విభాగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల భాగస్వామ్యం తగ్గుతున్నదని ఆందోళన చెందుతున్న విపక్షాలు.. మోదీ సర్కార్ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టాయి. ఎన్డీయే కూటమిలోని లోక్ జనశక్తి (రామ్‌విలాస్) వంటి మిత్రపక్షాలూ ఈ ఎత్తుగడపై అసంతృప్తి వ్యక్తం చేశాయి. ప్రభుత్వ నియామకాల్లో రిజర్వేషన్ల విషయంలో ఎలాంటి రాజీ కుదరని ఆ పార్టీ అధినేత, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ తెగేసి చెప్పారు. అటు ప్రతిపక్షాలు, ఇటు స్వపక్షాల నిరసనతో కేంద్రం నోటిఫికేషన్ వెనక్కి తీసుకోవాలని యూపీఎస్సీని ఆదేశించింది. నిజానికి ఈ ల్యాటరల్ ఎంట్రీ వివాదం ఇప్పటిది కాదు. 2005లో యూపీఏ-1 హయాంలో ల్యాటరల్ ఎంట్రీని రెండో అడ్మినిస్ట్రేటివ్ రీఫామ్స్ కమిషన్ ప్రతిపాదించింది. కానీ, అది పెద్దగా ముం దుకువెళ్లలేదు. 2017లో తన మూడేండ్ల యాక్షన్ ఎజెండాలో భాగంగా నీతి ఆయోగ్ దీన్ని మళ్లీ తెరపైకి తీసుకొచ్చింది. 2018 నుంచి ఇప్పటివరకు ల్యాటరల్ ఎంట్రీ విధానంలో మొత్తం 63 మందిని నియమించారు. వారిలో 35 మంది ప్రైవేట్ వ్యక్తులు. 57 మంది తమ పదవులకు అతుక్కుపోయారు. గత నెల 24న కేంద్రం ఈ వివరాలను లోక్‌సభకు తెలియజేసింది.

రిజర్వేషన్ల వ్యతిరేకిగా ముద్రవేసుకున్న బీజేపీ పాలనలో ల్యాటరల్ నియామకాలను ముందుకు తేవడంపై సహజంగానే గగ్గోలు బయలుదేరింది. దీంతో యూటర్న్‌ల పరంపరలో ఇది కూడా చేరిపోయింది. మొన్నటి ఎన్నికల్లో బీజేపీ 'చార్ సౌ పార్' అని ఊదరగొట్టగా.. ఆ పార్టీకి కనీసం సాధారణ మెజారిటీ కూడా రాలేదు. 240 దగ్గరే బండి ఆగిపోయింది. దీంతో సంకీర్ణంలోని భాగస్వామ్య పక్షాలను కాదని ముందుకు వెళ్లలేక బీజేపీ ఇబ్బందులు పడుతున్నది. ఒకదాని వెనుక ఒకటిగా పీఛేముడ్‌లు తప్పడం లేదు. వక్ఫ్ సవరణ, ప్రసార నియంత్రణ బిల్లుల విషయంలో అదే జరిగింది. ముందు ప్రతిపాదించి ఆపై ప్రతిపక్షాలు, మిత్రపక్షాల నుంచి వ్యతిరేకత రావడంతో ఆయా బిల్లులు జేపీసీకి నివేదించి చేతులు కట్టుకోవాల్సి వస్తున్నది. తన సొంత ఎజెండాపై బీజేపీ నడక ఒకడుగు ముందుకు రెండడుగులు వెనక్కు అన్నట్టుగా తయారైంది. ఈ నేపథ్యంలో ఏకాభిప్రాయ సాధన అనేది లేకుండా ముందుకువెళ్తే ఇలాంటి భంగపాట్లు తప్పవని బీజేపీ గుర్తిస్తే మంచిది.

చరిత్రలోకి చొరబాటును క్షమించరెవ్వరు!

ఈ దేశంలో రాష్ట్రాలు, వాటికి సచివాలయాలు ఉండటం సహజమే. కానీ తెలంగాణది, కాలం కొలిమిలో మండి పండిన ప్రత్యేకత్వం. స్వదేశంలో ఐదున్నర దశాబ్దాల సుదీర్ఘకాలం వివక్షా విషాన్ని దిగమింగుతూనే, ఆకాంక్షలు వొరిగిపోకుండా అడుగులేసిన ఆత్మగౌరవ సౌధం తెలంగాణ. నమ్ముకున్న, ఎన్నుకున్న పాలకులే.. కలలు, కన్న పేగులను కాటేస్తుంటే, రెప్ప వాల్చకుండా లక్ష్యం వైపే చూస్తూ గమ్యం చేరిన నిబ్బరత్వం తెలంగాణది. సుదీర్ఘ సంఘర్షణకు వేలాడి, సువిశాల త్యాగాల వనమై పెరిగి, వసంతాన్ని ఇంటికి తెచ్చుకున్న వైవిధ్యమైన రాష్ట్రం మనది.



డాక్టర్ ఆంజనేయ గౌడ్

'ప్రాణమివ్వడమంటేనే పొద్దూ పొడవడమని' అని పాడుకుంటూ నినాదజ్యోతిని ఆరిపోనీకుండా బలిదానాగ్నిని రగిలించిన నేల తెలంగాణ. అన్నీ లాగేసుకోబడిన శూన్యహస్తాల మానవ సమూహం, తమ కన్నీరు, నెత్తురు నాటి, జలాన్నీ, జీవితాన్నీ గెలుచుకున్న భావోద్వేగాల తరగని గని తెలంగాణ. ఈ తెలంగాణ తనం, ప్రత్యేక అస్తిత్వం వెలుగుధారలో నుంచే పాలకుల చూపుండాలి. ఆ దృక్పథంతోనే తొలి ప్రభుత్వ పదేండ్ల ప్రతి పనికీ, తెలంగాణమే కొలమానంగా ఉండింది. దానివల్లే విధ్వంసానికి, విలువల హననానికీ గురైన అన్ని రంగాలను పునర్నిర్మాణం చేయడంతో పాటు, తెలంగాణ పాలన వ్యవస్థకు కేంద్రమైన సచివాలయం కూడా అద్భుతంగా నిర్మించబడ్డది. రాష్ట్రంలో ఇప్పటి కాంగ్రెస్ సర్కారే కాదు, రేపు ఏ ప్రభుత్వమైనా ఆ తెలంగాణ తనాన్నే బలోపేతం చేయాలి. కానీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం తెలంగాణకు విరుద్ధమైన ధోరణిని, ఎందుకో ఏరి కోరి మరీ ప్రదర్శిస్తున్నది. స్వయం పాలనకు కేంద్ర స్థానమైన సచివాలయం ముందు, రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టాలనే ఆలోచన రేవంత్ రెడ్డి సర్కార్‌కు తట్టడమే.. తెలంగాణకు తగులుకున్న పాలనా అరిష్టం కదా?. ఇలా టీఎస్ నుంచి టీజీ, అధికారిక చిహ్నంలో కాకతీయ కళాతోరణం తొలగింపు యత్నం, ప్రస్తుతం రాజీవ్‌గాంధీ విగ్రహం స్థాపన తదితర అంశాలను అనాలోచితంగా, అధికారాహంకారంతో తెలంగాణ తెరమీదకు తెస్తున్నది. భారతీయ భౌగోళిక, రాజకీయ, సామాజిక చరిత్రపై కనీస అవగాహన ఉన్న ఏ నాయకుడైనా, కనీసం కొన్ని ప్రత్యేక అంశాలపై అప్రమత్తంగా వ్యవహరిస్తారు. మరీ ముఖ్యంగా సంస్కృతి, వారసత్వ సంపద, అస్తిత్వం, భాష, ఆత్మగౌరవం వంటి సున్నితోన్నతమైన మౌలిక విషయాల పట్ల జాగ్రత్తగా మసలుకుంటారు. ఈ అంశాల్లో పాలకుడు వేసే అడుగులు, సమాజ పునాదిలో ప్రకంపనలకు దారితీస్తాయి. కానీ, ఇవ్వన్నింటిపై ప్రాథమిక అవగాహన కూడా లేని రేవంత్‌రెడ్డి గుప్పిట్లో.. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం చిక్కడం రాజకీయ వ్యవస్థకే హానికరంగా దాపురించింది. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ చేష్టలు, వ్యవహారశైలి, దేశంలో ఇతర రాష్ట్ర పాలకులకూ అంటువ్యాధిలా సోకితే, సంకుచిత తత్త్వం, మానసిక మరుగుజ్జునైజం ఊబిలో పాలనా వ్యవస్థలు మునిగిపోయే ప్రమాదం ఉన్నది. రేవంత్ రెడ్డిలా గతం లో తమిళనాడు, బీహార్, ఉత్తరప్రదేశ్, కేరళ, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లోని కాంగ్రెస్ పార్టీ పాలకులు ప్రవర్తించబట్టే, ఆయా రాష్ట్రాల్లో మళ్లీ మొలకెత్తనే లేని దుస్థితికి ఆ పార్టీ దిగజారిపోయింది.

ఆ అనుభవాల నుంచి కాంగ్రెస్ ఏమీ నేర్చుకోనేలేదని, రేవంత్‌రెడ్డి లాంటి వారిని ముఖ్యమంత్రులుగా నియమించడం ద్వారా నిరూపించింది. ఒకవేళ కొంతైనా నేర్చుకొని ఉంటే, రేవంత్‌రెడ్డి చర్యలను కట్టడి చేసేవారు కదా? రాష్ట్ర సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడమంటే, తెలంగాణ స్వయంపాలన ఆకాంక్షను వెక్కిరించడమే అవుతుంది. దివంగత మహా నేత రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు, ఆయన ప్రాణత్యాగం కీర్తించదగినదే. అలాగని తెలంగాణ రాష్ట్రం కోసం, ఆత్మగౌరవం కోసం, స్వీయ పాలన ఆశయం కోసం వందలాది మంది యువకులు అమరులైన వీరోచిత మహోన్నత చరిత్రను చిన్నబుచ్చేలా సర్కార్ చర్యలు ఉండటమే ఆందోళన రాజేస్తున్నది. 1982 ఫిబ్రవరిలో బేగంపేట విమానాశ్రయంలో అంజయ్యను అవమానించి, అదే మాసంలోనే రాజీనామా చేయించి, ఆంధ్రకు చెందిన భవనం వెంకట్రామ్‌ను సీఎంను చేశాడు రాజీవ్ గాంధీ. తెలంగాణ రాజకీయ నాయకత్వం పట్ల రాజీవ్‌గాంధీ సైతం వివక్షాపూరితంగానే వ్యవహరించారని చరిత్ర చెప్తున్నది కదా! అందువల్లనే స్వయం పాలన సౌధం ముందు ఏ ఢిల్లీ పెద్దల ప్రతిమ నెలకొల్పినా, అది బలిదానాలకు తలవంపులు తెచ్చే పనే అవుతుంది. ఎవరి ప్రతిమను ఎక్కడ ప్రతిష్ఠించాలో, ఏ స్తూపం ఎక్కడ కొలువుదీరాలో అనే అవగాహన పాలకులకు కొరవడితే ఎలా? కడుపుబ్బరంతోనో, తొందరపాటుతోనో, భజన స్వభావం వల్లనో విగ్రహాలతో చెలగాటం ఏ సర్కార్‌కూ శోభనివ్వదు. దుందుడుకు వైఖరితో విగ్రహాలను వివాదాస్పదం చేస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్ తీరు, తెలంగాణలో మళ్లీ అలజడికి ఆజ్యం పోస్తున్నది. తెలంగాణ ఉద్యమం, అస్తిత్వం, ఆత్మగౌరవంతో సంబంధం లేని వ్యక్తి ముఖ్యమంత్రి అయితే, ఆయన ప్రాధాన్యాలు ఎలా ఉంటాయో స్పష్టంగా రేవంత్‌రెడ్డి అర్థం చేయించేశాడు.



> **తెలంగాణ మౌలిక అస్తిత్వంపై విచ్చలవిడిగా రేవంత్‌రెడ్డి సర్కార్ దాడి చేస్తుంటే, మిగతా రాజకీయ పార్టీలైన వామపక్షాలు, కమలం పార్టీ నేతలు మౌనంగా ఉండటం అందరికీ వెగటు పుట్టిస్తున్నది. ఒకవేళ బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నించకపోయి ఉంటే సచివాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం పెడతానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించేవాడా?**

అసలు తెలంగాణ సచివాలయాన్ని, దాని ప్రతి చదరపు అడుగులో రాష్ట్ర ఆత్మగౌరవం, వైభవం, స్వయంపాలన వెలుగు ఉట్టిపడేలా తొలి సీఎం కేసీఆర్ నిర్మించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణకు అవసరమైన ఏ చారిత్రక నిర్మాణం చేపట్టినా, ఆనాడు విపక్షంగా ఉన్న కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు అర్థంలేని ఆరోపణలు చేసేవారు. కానీ, అమరుల అద్వితీయ స్థూపం, ఆకాశమంత అంబేద్కర్ విగ్రహం మధ్యలో తెలంగాణ చరిత్రంత అద్భుతంగా నూతన సచివాలయ నిర్మాణం జరిగాక, ప్రతి తెలంగాణ బిడ్డా ఆనంద పడ్డాడు. ఇంకా మానవీయంగా పాలనా వ్యవస్థకు నిరంతర ప్రగతిశీల దృష్టికోణం గుర్తుచేసేలా, సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టాడు కేసీఆర్. తెలంగాణ ప్రభుత్వం ఏ ఆశయాల వెలుగులో అడుగులు వేస్తూ, ఏ లక్ష్యసాధన కోసం ప్రయాణం చేస్తున్నదో, అన్ని వ్యవస్థలకూ అర్థం అవ్వడానికి నూతన సచివాలయమే నిలువెత్తు నిదర్శనం. తొమ్మిది నెలల కిందట మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి ఉంటే, పాలనాలయం వొడిలో తెలంగాణ తల్లి చిరునవ్వులు చిందిస్తూ కొలువుదీరేది. ఇవన్నీ ఎవరు దాయగలరు? విగ్రహ రాద్ధాంతం రాజేయొద్దని హితవు పలికిన విపక్షంపై, పసి పిల్లల ముందు రోత మాటలతో నోరు పారేసుకున్న రేవంత్‌రెడ్డి, తన రాజకీయ కురూపితనాన్ని బయటపెట్టుకున్నాడు. అద్భుతమైన సచివాలయం నిర్మించిన కేసీఆర్‌ను, విగ్రహం కోసం నిగ్రహం కోల్పోయి రేవంత్‌రెడ్డి తూలనాడితే, తెలంగాణ అసహ్యించుకోకుండా ఉంటుందా? ముఖ్యమంత్రే మొరటు మనిషిలా ఇష్టారీతిన దారుణ దూషణలు చేస్తుంటే ప్రజలంతా ముక్కున వేలేసుకుంటున్నారు. ఇంత ఉక్రోషం, వెగటుతనం ప్రదర్శించిన వికారపు నాయకుడు గతంలో ఎవరూ లేనేలేరు.

> **అసలు విగ్రహ రాద్ధాంతం రాజేసిందెవరు? గత బీఆర్ఎస్ సర్కార్ తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించడం కోసం సిద్ధం చేసిన స్థలంలో, మాజీ ప్రధాని ప్రతిమ పెడతానని హడావుడి మొదలు పెట్టిందెవరు? ఇలా రేవంత్‌రెడ్డి సర్కార్ మూర్ఖత్వంతో, తెలంగాణ చరిత్రలోకి చొరబడే ప్రయత్నం చేస్తుంటే, ఆత్మగౌరవంపై అన్యాయమైన దాడికి పాల్పడుతుంటే గులాబీదళం మౌనంగా ఎలా ఉండగలదు? ప్రజల భావోద్వేగాలతో పెనవేసుకున్న ఆ స్థలంలో మాత్రమే రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టొద్దని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది.**

దీనికే రేవంత్‌రెడ్డి ఉచ్చనీచాలు విస్మరించి, చిన్నారుల సమక్షంలో ఏహ్యమైన భాషతో కారణజన్ముడైన కేసీఆర్‌ను దూషించడం జనాలందరి హృదయాలనూ గాయపరిచింది. రేవంత్‌రెడ్డి నిత్యం తెలంగాణ చరిత్ర చావును కలగంటున్నాడని తేలిపోయింది. ఇంతగా విలువల విధ్వంసానికి పాల్పడుతూ, తెలంగాణ మౌలిక అస్తిత్వంపై విచ్చలవిడిగా రేవంత్‌రెడ్డి సర్కార్ దాడి చేస్తుంటే, మిగతా రాజకీయ పార్టీలైన వామపక్షాలు, కమలం పార్టీ నేతలు మౌనంగా ఉండటం అందరికీ వెగటు పుట్టిస్తున్నది. ఒకవేళ బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నించకపోయి ఉంటే సచివాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం పెడతానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించేవాడా? ఇప్పటికే తెలంగాణ తల్లి కోసం సిద్ధం చేసిన స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్నీ, మరోచోట తెలంగాణ తల్లి ప్రతిమను పెట్టడానికి కుట్రలు చేయడం న్యాయమా..? ఢిల్లీ పెద్దల మెప్పు కోసం, తెలంగాణ అమరవీరుల ఆకాంక్షలను కాలరాయడం కాంగ్రెస్ ప్రభుత్వ అరాచక పాలనకు నిదర్శనం. విగ్రహాలు సైతం విప్లవాలు పుట్టిస్తాయన్న సంగతి కుసంస్కారులకు ఎప్పటికీ అర్థం కాదు. దేనినైనా చూసీచూడనట్లు ఉండవచ్చు, కానీ, చరిత్రలోకి చొరబాటును మాత్రం కలలో కూడా క్షమించలేం.

(వ్యాసకర్త: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్)

అమరుడు.. ఆ కలం వీరుడు



బసవరాజు నరేందర్‌రావు
99085 16549

'మహా ఘనత వహించిన మన నిజాం ప్రభువుకు వ్యతిరేకంగా, అంతేగాక మనందరికి వ్యతిరేకంగా, మనవారే కొందరు భారత ప్రభుత్వ ఏజెంట్లుగా మారి, మన సమైక్యతను ధ్వంసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. జర్నలిస్టుల రూపంలో మనకు వ్యతిరేకంగా రచనలు చేస్తున్నారు. అలాంటి రాతలు రాస్తున్న ఆ చేతులు ఉండటానికి వీల్లేదు. అవి నరకబడాల్సిందే. అటువంటి ద్రోహులు బతకడానికి వీల్లేదు చావాల్సిందే..' తన చుట్టూ చేరిన వందలాది మందిని రెచ్చగొడుతూ ఆవేశంగా ప్రసంగిస్తున్నాడొక బక్కపలుచని వ్యక్తి. తన లోని అణువణువునా మత దురహంకారాన్ని నింపుకొని, తన ప్రతి అడుగులో విషం వెదజల్లుతున్న వ్యక్తి మరెవ్వరో కాదు, ఆనాటి 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్‌ను తన చేతిలో కీలుబొమ్మగా మార్చుకొని సంస్థానమంతటా దారుణాలు కొనసాగిస్తున్న రజాకార్ల నాయకుడు ఖాసీం రజ్వీ. తన చుట్టూ చేరిన అనుచరులను రెచ్చగొడుతూ ఆయన చేసిన విషపూరిత ప్రసంగం 1948, ఆగస్టు 19న హైదరాబాద్‌లోని ఆనాటి జమ్రుద్ మహల్ సినిమా హాల్‌లో కొనసాగింది.

ఆయన తన ప్రసంగంలో వెళ్లగక్కిన అక్కసంతా, తన అక్షరాలను ఆయుధాలుగా మార్చుకొని ప్రభుత్వ దురాగతాలను ఎండగడుతూ రజాకార్ల దారుణాలను బయటపెడుతూ రచనలు చేస్తున్న ఆనాటి ప్రముఖ పాత్రికేయుడు, మానవతావాది షోయబుల్లా ఖాన్ గురించే. ఖాసీం రజ్వీ ప్రసంగంతో రెచ్చిపోయిన ఆయన అనుచరులు, రజాకార్లు అక్షరాలా ఆయన ఆదేశాలను అమలు పరిచారు. ఫలితంగా ఒక గొప్ప పాత్రికేయుడైన షోయబుల్లా ఖాన్ మీద కాల్పులు జరిగాయి. ఆ కాల్పుల్లో గాయపడిన షోయబుల్లా ఖాన్ 1948, ఆగస్టు 22 రోజున తుది శ్వాస విడిచారు. నవ సమాజ నిర్మాణం కోసం తన ప్రాణాలనర్పించిన అమరజీవి షోయబుల్లా ఖాన్ 1920, అక్టోబర్ 17న లాయహున్నిసా బేగం- హబీబుల్లాఖాన్ దంపతులకు ఖమ్మం జిల్లాలోని సుబ్రవేడులో జన్మించారు. ఆయన తండ్రి హబీబుల్లాఖాన్ మహాత్మాగాంధీకి వీరాభిమాని.

బాల్యం నుంచే సమాజం పట్ల అవగాహనను, అనుబంధాన్ని పెంచుకున్న షోయబుల్లా ఖాన్ సమాజంతో సాన్నిహిత్యం కోసం జర్నలిజాన్ని తన వృత్తిగా ఎంచుకొని ఓయూ నుంచి జర్నలిజంలో బీఏ డిగ్రీ తీసుకున్నారు. నిజాం నిరంకుశ పాలనలో రజాకార్ల దౌర్జన్యాలతో హైదరాబాద్ రాష్ట్రమంతా గజగజా వణికిపోతున్న రోజులవి. ఎటుచూసినా హత్యలు, దోపిడీలు, మానభంగాలు.




నేడు జర్నలిస్ట్ షోయబుల్లాఖాన్ వర్ధంతి

వీటి మీద పోరాటం చేయాలనుకున్నారు షోయబుల్లాఖాన్. అంతే, అభిమన్యుడిలా సమరక్షేత్రంలోకి కాలు మోపారు. మొట్టమొదట తేజ్ అనే పత్రికలో చేరారు. ఆయన రాతలు నిజాం ప్రభుత్వానికి ఆగ్రహావేశాలను తెప్పించాయి. ఫలితంగా తేజ్ పత్రిక మూతపడింది. తర్వాత రయ్యత్ పత్రికలో సహాయ సంపాదకుడిగా చేరారు. ఇక్కడ కూడా ఆయన కలం నిప్పులని గక్కింది. ప్రభుత్వ ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. ఫలితంగా రయ్యత్ కూడా మూతపడింది.

ఇక లాభం లేదని భావించిన షోయబుల్లా ఖానే తన భార్య, తల్లి నగలను అమ్మి 'ఇమ్రోజ్' అనే పత్రికను 1947 నవంబర్‌లో ప్రారంభించారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా హైదరాబాద్ స్టేట్, ఇండియన్ యూనియన్‌లో కలవాలని తన పత్రికలో రాసేవారు. ఈ రాతలు ప్రభుత్వానికి, ఖాసీం రజ్వీకి ఆగ్రహం తెప్పించేవి. నయానో భయానో ఆయన రాతలకు అడ్డుకట్టవేయాలని ప్రభుత్వం ప్రయత్నించింది. అయితే, మేరునగధీరుడు షోయబుల్లా ఖాన్ వాటిని లెక్క చేయలేదు. చివరికి మత దురహంకారి, నరరూప రాక్షసుడు ఖాసీం రజ్వీ షోయబుల్లా ఖాన్‌ను అంతం చేసే బాధ్యతను తీసుకున్నాడు. జమ్రుద్ మహల్ రజాకార్ల సభలో ఒక గొప్ప జర్నలిస్టుని చంపాలని, ఆయన చేతులను నరకాలని ఆదేశించాడు.

> **ఆ రోజు ఆగస్ట్ 21 రాత్రి. పని ముగించుకొని తన ఇంటికి బయల్దేరిన షోయబుల్లా ఖాన్ మీద కాల్పులు జరిగాయి. కాల్పులతో షోయబుల్లా ఖాన్ కింద పడగానే ఆయన చేతిని నరికారు. స్థానికులు షోయబుల్లా ఖాన్‌ను దవాఖానకు తరలించారు. మృత్యువుతో రెండు గంటలు పోరాడిన షోయబుల్లాఖాన్ 1848, ఆగస్టు 22న మరణించారు. నిజాం ప్రభుత్వం ఆయన అంతిమయాత్రను నిషేధించింది.**

గోషామహల్ మాలకుంట శ్మశానవాటికలో ఆయన ఖననం జరిగింది. కొద్దిమంది బంధుమిత్రులు చూడటానికి మాత్రమే ప్రభుత్వం అనుమతించింది. ఆ తర్వాత ఆయన కుటుంబం గురించి ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇక, స్వాతంత్య్ర సమరయోధులకు ఇచ్చే పింఛన్ ఆయన కుటుంబానికి అందడానికి నాలుగు దశాబ్దాలు పట్టింది. ఇదీ మన అమరవీరులకు మనమిచ్చే గౌరవం.





జవాన్లు బోర్డర్ వీడితే?

కోల్‌కతా ఘటనకు సంబంధించి నిరసనలు చేస్తున్న వైద్యులకు నేనొక ప్రశ్న వేస్తున్నా. 2019లో జరిగిన పుల్వామా దాడికి సంబంధించి బాధితులకు ఇప్పటివరకు న్యాయం జరగలేదు. అందుకని ఒకవేళ జవాన్లు సరిహద్దులను వీడి 'వియ్ వాంట్ జస్టిస్' అంటూ నిరసనలకు దిగితే దాన్ని మీరెలా (వైద్యులు) చూస్తారు? అందుకే మిమ్మల్ని ఒక్కటే కోరుతున్నా. దయచేసి నిరసనలను విరమించండి.

- కునాల్ ఘోష్, టీఎంసీ సీనియర్ నేత

మన దేశంలోని అనేక ప్రాంతాలను ఇటీవల భారీ వర్షాలు, వరదలు ముంచెత్తాయి. ప్రకృతి విపత్తుల కారణంగా వందలాది మంది ప్రాణాలు కోల్పోగా.. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. మన దేశంతో పాటు దక్షిణాసియా ప్రాంతంలో వరదలు సాధారణమే. కానీ, వాతావరణ మార్పుల కారణంగా రుతుపవనాల వర్షపాతంలోనూ మార్పులొస్తుండటం తీవ్ర పరిణామాలకు దారితీస్తున్నది.

విలయానికి కారణం గగన నదులే!



డాక్టర్ శ్రీధరాల రాము
94411 84667



అతి తక్కువ వ్యవధిలోనే భారీ వర్షాలు కురుస్తున్నాయి. అంతే కాదు, సుదీర్ఘకాలం పాటు వర్షాలు కురవకపోవడం వంటి అసాధారణ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అతి తక్కువ వ్యవధిలోనే భారీ వర్షాలు కురవడాన్నే మేఘ విస్ఫోటనం (క్లౌడ్ బరస్ట్) అని అంటారు. ఈ మేఘ విస్ఫోటనానికి కారణం గగన నదులు (అట్మాస్ఫియరిక్ రివర్స్) ఏర్పడటమే. వీటినే 'ఫ్లయింగ్ రివర్స్' అని పిలుస్తారు. ఇటీవల కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగి అపార ప్రాణ, ఆస్తి నష్టం సంభవించడానికి ఈ గగన నదులే పరోక్ష కారణం.

సాధారణంగా ఎండ వేడిమి వల్ల మహాసముద్రాల్లోని నీరు ఆవిరిగా మారి, ఆపై చల్లబడి మేఘాలను ఏర్పరుస్తుంది. మేఘాల్లోని నీటి బిందువులు భూమిని చేరే ప్రక్రియలో భాగంగా సాధారణంగా వర్షం కురుస్తుంది. కానీ, గ్లోబల్ వార్మింగ్ కారణంగా మహా సముద్రాల్లోని జలాలు వేడెక్కి భారీమొత్తంలో నీరు, ఆవిరిగా మారి ఆకాశంలో కంటికి కనిపించని నీటి ఆవిరిపాయలుగా ఏర్పడతాయి. వాతావరణంలోని దిగువ భాగంలో ఈ నీటి ఆవిరి భారీ పట్టీగా ఏర్పడి, వేడి ప్రాంతం నుంచి చల్లని వాతావరణం వైపు కదులుతూ ఒక్కసారిగా వర్షంగా లేదా మంచుగా కురుస్తుంది. అది భారీ వరదలకు, కొండచరియలు విరిగిపడి విధ్వంసానికి కారణమవుతుంది. ఈ గగన నదులు కొన్ని వేల మైళ్ల దూరం ప్రయాణించి భారీ వర్షాలను కురిపిస్తాయి.

ఒక గగన నది పరిమాణం సగటున 2,000 కిలోమీటర్ల పొడవు, 500 కిలోమీటర్ల వెడల్పు, 3 కిలోమీటర్ల లోతు ఉంటుంది. అయితే, వీటి పరిమాణం ఇప్పుడు మరింత భారీగా మారుతున్నది. కొన్ని 5,000 కిలోమీటర్ల కంటే ఎక్కువ పొడవు ఉంటున్నాయి. కంటికి కనిపించని వీటిని ఇన్‌ఫ్రారెడ్, మైక్రోవేవ్ ఫ్రీక్వెన్సీలతో చూడవచ్చు. వీటిని వీక్షించేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక ఉపగ్రహ చిత్రాలు ఉపయోగపడతాయి.

> **భూమి వేగంగా వేడెక్కుతుండటంతో ఈ గగన నదులు భారీ పరిమాణంలో తీవ్ర రూపాన్ని సంతరించుకుంటున్నాయని, కోట్లాది మంది జీవనాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. హిందూ మహాసముద్రం వేడెక్కడం వల్ల మన దేశంలోనూ గగన నదులు ఏర్పడి జూన్ – సెప్టెంబర్ మధ్య వచ్చే రుతుపవనాల ప్రభావాన్ని మరింత పెంచుతున్నాయని వాతావరణ నిపుణులు అంటున్నారు.**

2023లో నేచర్ జర్నల్‌లో ప్రచురించిన అధ్యయనం ప్రకారం.. 1951- 2020 మధ్యకాలంలో మన దేశంలో వర్షాకాలంలో మొత్తం 574 గగన నదులు ఏర్పడ్డాయి. గత రెండు దశాబ్దాల్లో ఏర్పడిన అత్యంత భారీ గగన నదులు మన దేశంలో సంభవించిన 80 శాతం వరదలకు కారణమయ్యాయని ఈ అధ్యయనం పేర్కొన్నది. ఇటీవలి దశాబ్దాల్లో హిందూ మహాసముద్రం జలాలు ఆవిరిగా మారడం గణనీయంగా పెరిగిందని, వాతావరణం వేడెక్కడం వల్ల గగన నదులు ఏర్పడి, వరదలు పెరిగాయని అధ్యయనం తెలిపింది. రుతుపవనాల సమయంలో భారత ఉపఖండం వైపు పయనించే తేమలో హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటరాలజీకి చెందిన వాతావరణ శాస్త్రవేత్త డాక్టర్ రాక్సీ మాథ్యూ కోల్ చెప్పారు. తత్ఫలితంగా వెచ్చని సముద్రాల్లోని నీటి ఆవిరి గంటలు, రోజుల వ్యవధిలోనే గగన నదులుగా మారి అతితక్కువ సమయంలో కుండపోత వర్షం కురుస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఇది దేశవ్యాప్తంగా ఆకస్మిక వరదలకు, కొండచరియలు విరిగిపడటానికి కారణమవుతున్నదని అన్నారు.

అమెరికన్ జియోఫిజికల్ యూనియన్ ప్రచురించిన అధ్యయనం ప్రకారం.. తూర్పు చైనా, కొరియా, పశ్చిమ జపాన్‌లో రుతుపవనాల ప్రారంభ కాలంలో (మార్చి – ఏప్రిల్) 80 శాతం వరకు భారీ వర్షపాతానికి గగన నదులతో సంబంధం ఉందని గుర్తించారు. తుపానుల మాదిరిగానే గగన నదులలో వాటి పరిమాణం, తీవ్రత, వాటి వల్ల సంభవించే వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదకర పరిస్థితుల ఆధారంగా వాటిని ఐదు రకాలుగా వర్గీకరించారు. వీటిలో అన్నీ ప్రమాదకరమైనవి కావు, ప్రత్యేకించి తీవ్రత తక్కువగా ఉన్నవి. ఈ గగన నదులు సుదీర్ఘకాలంగా కరువు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో వర్షాలను కురిపిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రకృతి విపత్తులకు మూలకారణం వాతావరణ మార్పులే. పెట్రోల్, డీజిల్, బొగ్గు వంటి శిలాజ ఇంధనాలను మండించడం వల్ల గ్లోబల్ వార్మింగ్ పెరుగుతున్నది. తద్వారా వాతావరణ మార్పులు సంభవించి తీవ్ర నష్టం జరుగుతున్నది. కాబట్టి పర్యావరణ అనుకూల ఇంధనాలను వాడాల్సిన అవసరం ఉన్నది. అంతేకాదు, దాంతో పాటు మొక్కలను విరివిగా నాటాలి. తద్వారా గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించవచ్చు. వరదలు, కొండచరియలు విరిగిపడటం లాంటి ప్రకృతి వైపరీత్యాలను నివారించవచ్చు.

(వ్యాసకర్త: కెమిస్ట్రీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ ఫ్యాకల్టీ)

రుణమాఫీపై కాంగ్రెస్ కాకి లెక్క

"రుణమాఫీ పేరుతో రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం టోపీ పెట్టింది. రేవంత్‌రెడ్డి సర్కారు చేసిన చీటింగ్‌పై మా ఫైటింగ్ ఆగదు..



70 లక్షల మంది రైతులను మాయమాటలతో మభ్యపెట్టి తడిగుడ్డతో రేవంత్‌రెడ్డి గొంతు కోస్తున్నారు. వందశాతం రుణమాఫీ చేసి ఉంటే రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎందుకు ఆందోళన చేస్తున్నారు? రైతుల ఆందోళనలను పక్కదారి పట్టించేందుకే ఈ సీఎం చిల్లరగా అటెన్షన్ డైవర్షన్ ప్రాక్టీస్ చేస్తున్నారు. కానీ మేం అటెన్షన్ డైవర్షన్‌ను పట్టించుకోం. రైతుల కోసమే పోరాటం చేస్తాం. - కేటీఆర్"

డిసెంబర్‌లో చెప్పింది.. **రూ.49 వేల కోట్లు**

జనవరికి వచ్చేసరికి.. **రూ.40 వేల కోట్లు**

ఒక్క నెలలోనే రూ.9 వేల కోట్లు ఫట్

జూలై నాటికి .. **రూ.31 వేల కోట్లు**

మరో రూ.9 వేల కోట్లు కోత



బడ్జెట్‌లో ఇచ్చింది **రూ.26 వేల కోట్లు**

మరో 5 వేల కోట్లకు ఎగనామం



చివరికి చెప్పింది.. **రూ.17 వేల కోట్లు**

మళ్లీ రూ.9 వేల కోట్లకు ఎసరు



తీరా రుణమాఫీ అయ్యింది.. **రూ.7,500 కోట్లు**

మళ్లీ రూ.9.5 వేల కోట్లు ఫట్

చెప్పిందేమో రూ.49 వేల కోట్లు.. రుణమాఫీ చేసింది చేసిందేమో రూ.7,500 కోట్లు. అంటే.. ఈ లెక్కన సర్కారు రూ.41,500 కోట్ల రుణమాఫీకి కోతపెట్టింది.



22 లక్షల మందికే రుణమాఫీ

మా వద్ద 41.78 లక్షల మంది రైతుల డాటా: తుమ్మల



బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నేతలు పువ్వాడ అజయ్, దాసోజు, గువ్వల బాలరాజు తదితరులు

మాఫీ చేయని సీఎం.. మాఫీ మాంగో

మొదటిపేజీ తరువాయి...

చేశారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించాలని లేని పక్షంలో జైల్‌భరోకు పిలుపు నిస్తామని హెచ్చరించారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులకు ఇచ్చిన హామీమేరకు రూ.2 లక్షల రుణమాఫీ చేసేంత రైతుద్రోహి ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని తేల్చిచెప్పారు. రైతులకు మద్దతుగా రాష్ట్రంలోని అన్ని మండలకేంద్రాల్లో గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు, ధర్నాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, పార్టీ ఎమ్మెల్యేలు, లేనిచోట్ల బీఆర్ఎస్ నేతలు నిరసన కార్యక్రమాలను పర్యవేక్షిస్తారని వెల్లడించారు. బుధవారం తెలంగాణభవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. 'అధికారంలోకి వచ్చిన రోజే రూ.2 లక్షల రుణమాఫీ అంటూ రేవంత్‌రెడ్డి ఉత్తరకుమార ప్రగల్భాలు పలికారు. ఇప్పటికైనా మేం రుణమాఫీ చేయలేకపోయాం. మా వల్ల కాలేదని చెప్తారని అనుకున్నాం. కానీ, రవ్వంత రుణమాఫీ చేసి కొండంత డబ్బా కొట్టుకున్న సీఎం బండారం 70 లక్షల మంది రైతుల సాక్షిగా బట్ట బయలైంది. వ్యవసాయ మంత్రి రూ.2 లక్షలు మాఫీ చేశాం అన్నారు. కానీ, కొన్ని పత్రికలు రుణమాఫీ పూర్తిగా కాలేదని వార్తలు రాశాయి. జరిగింది రుణమాఫీ కాదు.. పెట్టింది రైతులకు టోపీ. ఎక్కడికక్కడ తెలంగాణవ్యాప్తంగా మాఫీ కాని రైతులు ఆందోళన చేస్తున్నరు. బ్యాంకులను ముట్టడిస్తున్నరు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నరు. రైతులకు రుణమాఫీ చేశామని ప్రభుత్వం చెప్పుకున్నది. కానీ జరిగింది మోసం. రుణమాఫీ జరగలేదు. మాకెందుకు రుణమాఫీ జరగలేదని రైతులు రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేస్తున్నరు. రాష్ట్రం రణరంగంగా మారిన పరిస్థితి. ఆదిలాబాద్ జిల్లాలో తలమడుగు మండలంలో బజార్‌హత్నూర్‌లో రైతులపై కేసులు పెట్టి వేధిస్తున్నరు. ఏ పార్టీ ప్రేరేపించకుండా రైతులు ఆందోళన చేస్తున్నరు. రుణమాఫీ జరగలేదని ఆందోళన చేస్తే ఏడేండ్ల జైలుశిక్ష పడేలా సెక్షన్ 189, సెక్షన్ 126, సెక్షన్ 223 కింద కేసులు పెట్టి రైతులను వేధిస్తున్నదీ ఈ ప్రభుత్వం. రైతుల మీద నాన్‌బెయిలబుల్ కేసులు పెడుతున్నది. తక్షణమే రైతులపై పెట్టిన కేసులను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి' అని డిమాండ్ చేశారు.

ప్రతి ఊరిలో ఇదే కథ

'ఇదే కథ ప్రతి ఊరిలో ఉన్నది. రుణమాఫీలో పాస్‌బుక్‌లో పేర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపన్ను దాఖలు చేయటం, రేషన్‌కార్డు వంటి కారణాలు చెప్పి అనేక కుంటిసాకులతో ఈ ప్రభుత్వం ఆంక్షలు పెడుతున్నది. రుణమాఫీకే ఇన్ని సాకులు చెప్తున్న ప్రభుత్వం రైతుభరోసాకు ఇంకా ఎన్ని ఆంక్షలు పెడుతుందో! ఇది మోసకారుల ప్రభుత్వం. దగా ప్రభుత్వం. తొలుత రూ.49,500 కోట్లతో మొదలైన రుణమాఫీ ప్రక్రియ ఈ రోజు 7,500 కోట్లకు చేరింది. ఈ ప్రభుత్వం దీంతోనే రుణమాఫీని ముగించే కుట్ర చేస్తున్నది. డిసెంబర్‌లో రుణమాఫీకి రూ.49 వేల కోట్లు అయితది అన్నరు. జనవరిలో రూ.40,000 కోట్లు.. జూలై వచ్చేసరికి రూ.31 వేల కోట్లకు చేరింది. బడ్జెట్‌కి వచ్చే సరికి రూ.26 వేల కోట్లు.. చివరికి 17 వేల కోట్లు అని చెప్పి.. ఇప్పుడు 7,500 కోట్లు మాత్రమే రైతులకు అందించారు' అని కేటీఆర్ ఫైరయ్యారు.

సీఎం, మంత్రులకు సయోధ్య లేదు

రుణమాఫీ విషయంలో సీఎంకు, మంత్రులకు అసలు సయోధ్యే లేదని, మనిషికో మాట మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. 'రూ.2లక్షల రుణమాఫీ చేశామని సీఎం చెప్తున్నరు. కానీ, వ్యవసాయ శాఖ మంత్రి మాత్రం ఇంకా రుణమాఫీ కావాల్సి ఉందంటారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రూ.12,000 కోట్లు ఇంకా ఇవ్వాల్సి ఉందంటున్నారు. రూ.7.5 వేల కోట్లు మాత్రమే రైతుల ఖాతాలకు చేరిందని ఉపముఖ్యమంత్రి భట్టి చెప్తున్నారు. రుణమాఫీ ఒట్టిదే అని మంత్రుల మాటలతో తేలిపోయింది. అసలు ఈ ప్రభుత్వానికి రుణమాఫీపై స్పష్టత ఉన్నదా? లేదా? రైతులకు ఇచ్చింది ఎంతో కనీసం ప్రభుత్వానికి, మంత్రులకు తెలుసా? లేదా?' అని నిలదీశారు. ఈ సందర్భంగా సీఎం, మంత్రులు రకరకాలుగా మాట్లాడిన వీడియోలను మీడియాకు చూపించారు. 'సాంకేతిక అంశాల ఆధారంగా రుణమాఫీ జరగలేదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్తున్నరు. సాంకేతిక కారణాలు ఏమీ లేవు. రుణమాఫీ ఎగ్గొట్టేందుకే ఇలా సాకులు చెప్తున్నరు. రుణమాఫీ చేసింది పావు శాతం. కానీ రైతులను వంద శాతం మోసం చేశారు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

కొడంగల్‌లోనే రుణమాఫీ కాలె

సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లోనూ రూ.2 లక్షల రుణమాఫీ పూర్తిగా కాలేదని కేటీఆర్ చెప్పారు. రుణమాఫీపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపామని, సీఎం నియోజకవర్గం కొడంగల్ నుంచి సమాచారం తెప్పించామని వెల్లడించారు. 'కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి ఉమ్మడి మండలంలో మొత్తం ఐదు బ్యాంకులు ఉన్నాయి. రెండు ఎస్బీఐ, రెండు తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకులు, ఒక మహబూబ్‌నగర్ డీసీసీబీ బ్యాంకు ఉన్నాయి. ఈ ఐదు బ్యాంకుల పరిధిలో మొత్తం 20,239 మంది రైతులకు ఖాతాలు ఉన్నాయి. వీరిలో 8,527 మందికి మాత్రమే మూడు విడతల్లో పాక్షికంగా రుణమాఫీ అయింది. సీఎం నియోజకవర్గం కాబట్టి కొంత ఎక్కువ మందికి రుణమాఫీ జరిగిందేమో! రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలో ఇంతకంటే తక్కువ మందికే రుణమాఫీ అయ్యి ఉంటుంది. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి 100 శాతం రుణమాఫీ అయ్యిందని ఉదరగొడుతున్నరు. భక్తిమల్లలో 988 మంది, బుజ్జారంలో 579 మంది, మిర్జాపూర్‌లో 641 మంది, ఆమ్లికుంటలో 528 మంది.. ఇలా 26 గ్రామాల్లో 20,239 మంది రైతులకుగాను 8,527 మందికే రుణమాఫీ అయ్యింది. '70 లక్షల మంది రైతులను రేవంత్ మభ్యపెట్టి తడిగుడ్డతో గొంతు కోస్తున్నారు. వందశాతం రుణమాఫీ చేసి ఉంటే రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎందుకు ఆందోళన చేస్తున్నారు? ఈ రైతుద్రోహి ప్రభుత్వాన్ని వెంటాడుతాం, వేటాడుతాం. మొదటి అడుగుగా రైతు ధర్నాతో ప్రారంభిస్తాం. రైతు రుణమాఫీ చేయలేని సన్నాసులమని ఈ ప్రభుత్వం ఒప్పుకోవాలి. రుణమాఫీ జరిగేదాకా కాంగ్రెస్‌ను వెంటాడుతాం. రైతులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు. సీఎస్ శాంతికుమారిని కలిసి విన్నవిద్దాం' అని పేర్కొన్నారు.

రుణమాఫీ పూర్తిగా ఎప్పుడు చేస్తారో చెప్పాలి

'కాంగ్రెస్ డ్రామాలు ఇక నడవవు. రుణమాఫీ పూర్తిగా ఎప్పుడు చేస్తారో చెప్పాలి. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలన్నందుకు సీఎం మాట్లాడిన బజారు భాషకు వ్యతిరేకంగా తెలంగాణ తల్లి విగ్రహానికి లేదా పోస్టర్‌కు పాలాభిషేకం చేసి ధర్నాలు ప్రారంభించాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేస్తున్నా. ఈ మూర్ఖుడిని క్షమించాలని తెలంగాణ తల్లిని వేడుకోండి. ఎలాంటి ఆంక్షలు లేకుండా ఎప్పటిలోగా రుణమాఫీ చేస్తారో ఈ ప్రభుత్వం చెప్పాలి' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

రైతు యాదగిరే సాక్ష్యం

కేటీఆర్ మీడియా సమావేశంలో రైతు యాదగిరి ఉదంతాన్ని ప్రస్తావించారు. 'బొమ్మరాస్‌పేట మండలం ఎరుపుమల్లకు చెందిన కోట యాదగిరి కుటుంబానికి రుణమాఫీ కాలేదు. రేషన్‌కార్డులో పేరు ఉన్న కుటుంబంలో ఒక్కరికే కాకుండా అందరికీ రుణామాఫీ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. బొమ్మరాస్‌పేట ఎస్బీఐలో యాదగిరికి 1.60 లక్షల రుణం, భార్య శారదకు 1.60 లక్షలు, పెద్ద కొడుకు అశోక్‌కు 1.84 లక్షలు, చిన్న కొడుకు అభిలాష్‌కు 1.50 లక్షలు రుణం ఉన్నది. కుటుంబంలో ఒకరికి తొలుత చేసి తర్వాత అందరికీ రుణమాఫీ చేస్తామని రేవంత్ చెప్పారు. కానీ, నేటికీ వారికి మాఫీ కాలేదు' అంటూ ఖాతాల వివరాలను మీడియాకు అందజేశారు. సీఎం మాటలన్నీ మోసాలేనని ఇక్కడే అర్థమవుతున్నదని, సీఎం సొంత నియోజకవర్గంలో రైతులకు జరిగిన మోసమిదని మండిపడ్డారు.

లోకం పోకడ



రుణాల మాఫే కాదు, దారుణాల మాఫీ కూడా పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేద్దాం!


పాపాత్ముడు రేవంత్‌ను క్షమించు! తెలంగాణ ప్రజలపై దయ ఉంచు!!

మొదటిపేజీ తరువాయి...

రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్ట లక్ష్మీ నర్సింహస్వామి మీద ఒట్టు పెట్టి మాట తప్పారు. రూ.49 వేల కోట్ల వ్యవసాయ రుణాలు ఉన్నాయని డిసెంబర్‌లో చెప్పారు. కడుపు కట్టుకుంటే చాలు ఒక్క ఏడాదిలో రూ.40 వేల కోట్ల రుణమాఫీ చేస్తానని జనవరిలో అన్నారు. క్యాబినెట్‌లో నిర్ణయించిన రూ.31 వేల కోట్లు రుణమాఫీ చేస్తామని దేవుళ్ల మీద ఒట్లు పెట్టారు. మొన్నటి బడ్జెట్ కేటాయింపుల్లో రూ.26 వేల కోట్లకు కుదించారు. ఆగస్టు 15న రుణమాఫీ పూర్తయిందని చెప్పి రూ.17 వేల కోట్లన్నారు' అని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఒకవైపు రుణమాఫీ చేశామని ముఖ్యమంత్రి చెప్తుంటే, మరోవైపు మంత్రులు కాలేదని అంటున్నారని పేర్కొన్నారు. రుణమాఫీ పూర్తిగా జరగలేదని, మిగిలిన రూ.12 వేల కోట్లు కూడా విడుదల చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించగా, 17 లక్షల మందికి ఇంకా రుణమాఫీ కాలేదని మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్తున్నారని గుర్తుచేశారు. ఇందులో ఎవరి మాట నిజమో తెలియక, రుణమాఫీ కాక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకులు, కలెక్టరేట్ల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కోతల ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు, దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీసేందుకు గురువారం ఆలేరులో నిర్వహించే ధర్నాలో పాల్గొంటానని హరీశ్‌రావు తెలిపారు. రైతలందరి పక్షాన ప్రభుత్వాన్ని నిగ్గదీసి అడుగుతామని చెప్పారు.

రుణమాఫీలో అనేక కొర్రీలు

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 21: కాంగ్రెస్ సర్కార్ రైతులకు తీరని ద్రోహం చేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. రుణమాఫీలో అనేక లోపాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన ఆందోళన వ్యక్తం చేశారు. ఏ గ్రామంలో చూసిన రుణమాఫీ కాని రైతులే ఎక్కువ ఉన్నారని తెలిపారు. వారంతా రోజూ బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరిగినా సమస్యలను మాత్రం పరిష్కరించడం లేదని విమర్శించారు. రుణమాఫీపై ప్రభుత్వం అనేకసార్లు మాట మార్చిందని దుయ్యబట్టారు. కేసీఆర్ ప్రభుత్వం లక్షలోపు రుణాన్ని 36 లక్షల మందికి మాఫీ చేస్తే కాంగ్రెస్ సర్కార్ రెండు లక్షల రుణ మాఫీ అని మోసం చేసి కేవలం 22 లక్షల మందికి మాత్రమే చేసిందని మండిపడ్డారు. రుణమాఫీ జరగని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్టు ఆమె తెలిపారు.

త్వరలో ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ: భట్టి విక్రమార్క



ఎర్రుపాలెం, ఆగస్టు 21: త్వరలోనే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇండ్లకు అర్హులను ఖరారు చేసి, భూమిపూజ చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని, అందుకు అందరినీ ఉరికిస్తామని, నిమిషం సమయం కూడా వృథా చేయబోమని చెప్పారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం జమలాపురం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ.. జమలాపురం గ్రామాన్ని రాష్ట్రానికే వన్నె తెచ్చే పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న టూరిస్టులు రెండు రోజులపాటు జమలాపురంలో గడిపేలా ప్రణాళికలు సిద్ధం చేస్తామని అన్నారు. నాగార్జునసాగర్ ఎడమకాల్వ నుంచి అధికారికంగా తూము ఏర్పాటు చేయించి జమలాపురం చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మారుస్తామని తెలిపారు.

నీటిలభ్యత ఆధారంగానే రీడిజైన్

- పీసీ ఘోష్ కమిషన్ ఎదుట విశ్రాంత ఈఎన్సీ

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): వ్యాప్కోస్ అందించిన సర్వే, నీటి లభ్యత గణాంకాల ఆధారంగానే ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టును రీడిజైన్ చేశామని విశ్రాంత ఈఎన్సీ మురళీధర్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కోసం ప్రభుత్వం నియమించిన కమిషన్‌కు నేతృత్వం వహిస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ బుధవారం విచారణ చేపట్టారు. ఇప్పటివరకు ఈ ప్రాజెక్టు నిర్మాణంలో పాలుపంచుకున్న ఇంజినీర్లు, నిర్మాణ ఏజెన్సీ ప్రతినిధులు, ప్రైవేట్ వ్యక్తుల నుంచి అఫిడవిట్ల రూపంలో వివరాలను సేకరించారు. తాజాగా వాటిపై బీఆర్కేభవన్‌లోని కమిషన్ కార్యాలయంలో క్రాస్ ఎగ్జామినేషన్‌ను ప్రారంభించారు. అందులో భాగంగా విశ్రాంత ఈఎన్సీ మురళీధర్‌ను బుధవారం విచారించారు.

'మాఫీ' సగమే.. ఇది మంత్రి మాటే

42 లక్షల రైతుల్లో.. 22 లక్షల మందికే.. రుణ రైతులు మొత్తం 41.78 లక్షల మంది

మరో 20 లక్షల మందికి మొండి 'చెయ్యే'.. రుణమాఫీపై మంత్రి తుమ్మల కుండబద్దలు

- నాడు మొత్తం రైతులని చెప్పి, ఇప్పుడు సన్న చిన్నకారు రైతులంటూ మంత్రి నాలుక మడత
- ఇక 2 లక్షల పైన రుణ రైతుల కథ మొదటికి
- వీరికి నిధులున్నప్పుడే విడతల వారీగా మాఫీ!
- మొన్నటి దాకా ఒకే దఫాలో ఆగస్టు 15న మొత్తం రుణం మాఫీ అంటూ ప్రగల్బాలు
- ఇప్పుడేమో సర్కారు వాయిదాల రాగాలు



హైదరాబాద్, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ): ఆగస్టు 15 వరకు ఒకే దఫాలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ హామీ బూటకమని తేలిపోయింది. గడువులోపు రుణమాఫీ పూర్తి చేయలేదని, రైతులకు ఇచ్చిన మాట తప్పామని సొంత పార్టీ మంత్రులే ఒప్పుకొంటున్నారు. తమ తప్పును నిన్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఒప్పుకొంటే నేడు స్వయంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం తమ ప్రభుత్వ తప్పును బయటపెట్టారు. ఆగస్టు 15 వరకు సగం మంది రైతులకే రుణమాఫీ చేశామని కుండబద్దలు కొట్టారు. రుణమాఫీకి అర్హులైన మొత్తం రైతులు 41,78,892 మంది ఉండగా 22 లక్షల మందికే రుణమాఫీ చేసినట్టు స్పష్టంచేశారు. అంటే ఇంకా సుమారు 20 లక్షల మంది రైతులకు ఎగనామం పెట్టామని చెప్పకనే చెప్పారు. రుణమాఫీ కానివారందరికీ పూర్తిచేస్తామని చెబుతున్న మంత్రి, ఎప్పటిలోపు చేస్తారనేది చెప్పలేదు.

వారికి నిధులున్నప్పుడే!

ప్రభుత్వం రూ.2 లక్షల వరకు అరకొర రుణమాఫీ చేసి చేతులు దులుపుకొన్నది. ఇక 2 లక్షలకు పైన రుణాలున్న రైతులకు మాఫీ ఎప్పుడు చేస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. నిధులున్నప్పుడే వీరికి మాఫీ చేసేలా ప్రభుత్వ తీరు కనిపిస్తున్నది. ఈ రైతులకు సంబంధించి త్వరలో క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామని మంత్రి తుమ్మల వెల్లడించారు. నిధులు సమకూరడాన్ని బట్టి మాఫీ చేస్తామని స్పష్టంచేశారు. అంటే ఈ రైతులకు ప్రభుత్వం చెప్పినట్టుగా ఒకే దఫా మాఫీ కాదనేది స్పష్టమైంది. విడతల వారిగానే వీళ్లకూ రుణమాఫీ చేసే అవకాశమున్నది. అసలు క్యాబినెట్ భేటీ అయ్యేదెప్పుడో? చర్చించేదెప్పుడో? నిబంధనలు రూపొందించేదెప్పుడో? రుణమాఫీ చేసేదెప్పుడో? అనే సందేహాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. 2 లక్షలలోపు రుణాలున్న వారి సమస్యలు, 2 లక్షల పైన రుణ రైతుల అంశంపై తుమ్మల స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హం.

మళ్లీ క్యాబినెట్ చర్చ ఎందుకు?

రూ.2 లక్షల పైన రుణాలకు సంబంధించి త్వరలోనే క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామన్న మంత్రి తుమ్మల వ్యాఖ్యలపై దుమారం రేగుతున్నది. దశలవారీగా మాఫీ చేస్తామనడంపైనా రైతాంగం భగ్గుమంటున్నది. ఇప్పటికే రుణమాఫీ నిబంధనలు రూపొందించి, ఉత్తర్వులు జారీ చేశారని, వాటి ప్రకారం రుణమాఫీ చేసినప్పుడు మళ్లీ క్యాబినెట్ నిర్ణయం ఎందుకనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. క్యాబినెట్‌లో చర్చ, నిబంధనల పేరుతో కాలయాపన చేసేందుకు, ఈ సాకుతో మొత్తంగా రుణమాఫీని తప్పించుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మాఫీ మాటపై నాలుక మడత

'డిసెంబర్ 9న రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం'.. ఇది అసెంబ్లీ ఎన్నికల ముందు రుణమాఫీపై రేవంత్‌రెడ్డి చెప్పిన మాట! 'ఆరు నూరైనా, తూర్పున ఉదయించే సూర్యుడు పడమర ఉదయించినా ఆగస్టు 15 వరకు రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తాం' ఇది పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో కనిపించిన దేవుళ్లందరిపైనా ఒట్టుపెట్టి మరీ రేవంత్ చెప్పిన మాట.. ఇలాఎన్నికల పబ్బం గడుపుకొనేందుకు రేవంత్‌రెడ్డి రుణమాఫీపై అప్పటిమందం హామీలిచ్చి తర్వాత నాలుక మడతేశారు. ఇచ్చిన హామీపైనా అబద్ధాలు చెప్పటం కాంగ్రెస్ మంత్రులకే చెల్లింది. నాడు ఆగస్టు 15 వరకు రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పగా ఇప్పుడేమో ఆగస్టు 15 వరకు చిన్న, సన్నకారు రైతులకే రూ.2 లక్షల మాఫీ చేస్తామని చెప్పామని, చేశామని తుమ్మల వెల్లడించడం విస్తుగొలుపుతున్నది. హామీ మేరకు ఆగస్టు 15 వరకు రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ కాకపోవడంతో మంత్రి సైతం నాలుక మడతేశారన్న విమర్శలు వస్తున్నాయి.

22 లక్షల మందికే మాఫీ

- మా వద్ద 41.78 లక్షల మంది రైతుల డాటా
- అందరికీ అయ్యే దాకా మాఫీ కొనసాగుతుంది: తుమ్మల




ఖమ్మం, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇప్పటివరకు 22 లక్షల మంది రైతులకు పంట రుణాలను మాఫీ చేశామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టంచేశారు. ప్రభుత్వం వద్ద 41,78,892 మంది రైతుల డాటా ఉన్నదని వెల్లడించారు. ఆయా రైతులు సుమారు 40 బ్యాంకులకు చెందిన 5,782 బ్రాంచీల్లో రూ.31 వేల కోట్ల పంట రుణాలు తీసుకున్నట్టు గుర్తించామని తెలిపారు. ఇందులో ఆగస్టు 15 నాటికి రూ.18 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమచేశామని వివరించారు. వీరంతా రూ.2 లక్షలలోపు రుణాలు ఉన్నవారేనని పేర్కొన్నారు. బుధవారం ఆయన ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. బ్యాంకుల తప్పిదాలు, సాంకేతిక కారణాల వల్లనే రుణమాఫీలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. అందరికీ రుణమాఫీ అయ్యే దాకా ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ముందుగా రూ.2 లక్షలలోపు రుణాలు ఉన్నవారికి మాఫీ చేస్తామని తెలిపారు. రూ.2 లక్షలకుపైన రుణం తీసుకున్న వారి విషయంలో ఏమి చేయాలనే అంశంపై క్యాబినెట్‌లో మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్ర ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకొని ఆ రుణాలను కూడా దశలవారీగా మాఫీ చేస్తామని తెలిపారు. అయితే, రూ.2 లక్షలపైన రుణం ఉన్నవారు ఆపై మొత్తం కట్టాల్సి ఉంటుందని, ఆ తరువాతే వారికి మాఫీ పూర్తవుతుందని స్పష్టంచేశారు. తెల్లరేషన్ కార్డు లేకపోయినా అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ చేస్తామని స్పష్టంచేశారు. అర్హులైన రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగదు

రుణమాఫీలో ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. ఆధార్ నంబర్‌లో తప్పులు, బ్యాంకు ఖాతాలో తప్పులు సహా ఇతరత్రా ఏమైనా కారణాల వల్ల రుణం మాఫీ కాకపోతే అలాంటి రైతుల కోసం మండల కేంద్రాల్లో వ్యవసాయ శాఖ అధికారి, గ్రామాల్లో వీవోఏలు, బ్యాంకుల వద్ద అధికారులను ప్రత్యేకంగా నియమించినట్టు తెలిపారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారులకు దరఖాస్తు అందజేయాలని సూచించారు. అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని, కుటుంబాలను నిర్ధారించిన తరువాత ఆయా ఖాతాలకు రుణమాఫీ డబ్బులు చెల్లిస్తామని తెలిపారు.

ఐదేండ్ల రుణాలు మాఫీ

2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు తీసుకున్న రుణాలనే మాఫీ చేస్తున్నామని తుమ్మల స్పష్టం చేశారు. ఎన్నికల హామీ ఇచ్చిన నాటి నుంచి రుణాలు మాఫీ చేద్దామనే చర్చ క్యాబినెట్‌లో జరిగినప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం గత ఐదేండ్లలో రైతులు తీసుకున్న రుణం మొత్తం మాఫీ చేయాలని నిర్ణయించారని చెప్పారు.



మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరలోని రైతులతో కలిసి ఎస్‌బీఐ అధికారితో మాట్లాడుతున్న ఎర్రబెల్లి

40 శాతం మందికే రుణమాఫీ

- హరీశ్ సవాల్ భయంతోనే సర్కార్ రుణమాఫీ: మాజీ మంత్రి ఎర్రబెల్లి


పెద్దవంగర, ఆగస్టు 21: రుణమాఫీ 40 శాతం మందికే జరిగిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన ధర్నాలో పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం పట్టదని.. రేవంత్‌రెడ్డి పుటకోమాట మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. రుణమాఫీకి రూ.49 వేల కోట్లని చెప్పి.. 17 కోట్లతో సరిపెట్టడం దారుణమని అన్నారు. రుణమాఫీ పూర్తిస్థాయిలో కాలేదని మంత్రులు చెప్తున్నా రేవంత్ చెవికెక్కడం లేదని, అయినా పూర్తిస్థాయిలో జరిగిందని ఖమ్మం సభలో ప్రకటించడం ఆయన తెలివితక్కువతనానికి నిదర్శనమన్నారు. సీఎంకు దేవుళ్ల మీద ఒట్లు తప్ప.. ప్రజల సంక్షేమం పట్టదని విమర్శించారు. హరీశ్‌రావు సవాల్ భయంతోనే కాంగ్రెస్ సర్కార్ రుణమాఫీ ప్రక్రియను మొదలు పెట్టిందని తెలిపారు.

- **వెయ్యికి 800 మందికే మాఫీ..**

ధర్నా అనంతరం ఎర్రబెల్లి దయాకర్‌రావు రైతులతో కలిసి స్థానికంగా ఉన్న ఎస్‌బీఐకి వెళ్లి అక్కడి అధికారులను కలిసి రుణమాఫీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెద్దవంగర బ్యాంకులో మొత్తం 1,900 మంది రైతులు రుణాలు తీసుకుంటే..800 మందికే రుణమాఫీ జరిగిందని.. రూ.25 కోట్లకు రూ.9 కోట్లే మాఫీ అయిన విషయాన్ని గుర్తించారు. 40 శాతానికి మించి రైతులకు రుణమాఫీ కాలేదనే విషయాన్ని స్వయంగా బ్యాంకర్లే చెబుతున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఫైనల్లో నలుగురు

అండర్-17 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్



అమ్మన్(జోర్డాన్): ప్రతిష్ఠాత్మక అండర్-17 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్ల అద్భుత ప్రదర్శన కొనసాగుతున్నది. అదితికుమారి, నేహా, పుల్కిత్, మాన్సి తమ విభాగాల్లో ఫైనల్ చేరి కనీసం రజత పతకం ఖాయం చేసుకున్నారు. బుధవారం జరిగిన 43కిలోల సెమీస్ బౌట్‌లో అదితి 8-2తో అలెగ్జాండ్రా బెరెజెస్కోవాపై గెలిచి పసిడి పోరులో నిలిచింది. 57కిలోల సెమీస్‌లో నేహా 8-4తో అన్నా స్ట్రాటన్‌పై గెలిచి సో సుసుయి(జపాన్)తో పోరుకు సిద్ధమైంది. 65కిలోల కేటగిరీలో పుల్కిత్ 3-0తో మారమ్ ఇబ్రహీంపై గెలిచి దరియా ఫ్లోరోవాతో ఫైనల్లో తలపడనుంది. 73కిలోల విభాగం సెమీస్‌లో మాన్సి 12-2తో క్రిస్టినా దెమ్‌చుక్‌పై గెలిచింది. ఇదే టోర్నీ గ్రీకోరోమన్ విభాగంలో రోనక్ దహియా ఇప్పటికే కాంస్య పతకం సాధించిన సంగతి తెలిసిందే.

సత్తాచాటేందుకు సై..

డైమండ్ లీగ్ బరిలో నీరజ్‌చోప్రా



లాసానే: భారత స్టార్ జావెలిన్‌త్రోయర్ నీరజ్ చోప్రా..డైమండ్ లీగ్ పోరుకు సిద్ధమయ్యాడు. ఇటీవలే ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకంతో మెరిసిన నీరజ్...గురువారం రాత్రి జరిగే డైమండ్ లీగ్‌లో సత్తాచాటడం ద్వారా ఫైనల్ బెర్తు దక్కించుకోవాలని చూస్తున్నాడు. గజ్జల్లో గాయంతో పారిస్ విశ్వక్రీడల్లో స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోయిన చోప్రా.. లాసానే డైమండ్ లీగ్‌లో రాణించేందుకు తహతహలాడుతున్నాడు. గాయం నుంచి కొంత తేరుకున్న ఈ యువ అథ్లెట్ ప్రస్తుతం ఏడు పాయింట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. పారిస్‌లో పసిడి పతకంతో కొత్త చరిత్ర లిఖించిన పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్..ఈ టోర్నీలో పోటీపడటం లేదు. నదీమ్ మినహా పారిస్‌లో ఆడిన దాదాపు అందరూ ప్లేయర్లు లాసానేలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు పట్టుదలతో ఉన్నారు. లాసానే తర్వాత సెప్టెంబర్ 5న జ్యూరిచ్‌లో మరోమారు డైమండ్ లీగ్ పోటీలు జరుగనుండగా, సెప్టెంబర్ 14న బ్రస్సెల్స్‌లో ఫైనల్స్ ఉన్నాయి. టాప్-6లో నిలిచిన అథ్లెట్లు తుది పోరుకు అర్హత సాధిస్తారు. 2022లో డైమండ్ లీగ్ విజేతగా నిలిచిన నీరజ్..గతేడాది రెండో స్థానంతో సరిపెట్టుకోగా జాకబ్ వాల్దిచ్ టైటిల్ దక్కించుకున్నాడు. సీజన్ ముగిసిన తర్వాత గాయానికి శస్త్రచికిత్స తీసుకుంటానని చోప్రా స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

స్పోర్ట్స్ పాలసీపై భేటీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా ప్రతిభావంతులైన ప్లేయర్లను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ పాలసీ భేటీ జరిగింది. బుధవారం స్థానిక టూరిజం ప్లాజాలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో క్రీడాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ముఖ్యంగా పాఠశాల స్థాయి నుంచి ప్రతి విద్యార్థి కనీసం ఏదో ఒక క్రీడలో ఆడే విధంగా రాష్ట్ర క్రీడా పాలసీ ఉండాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఐటీ, ఫార్మా, ఇతర పరిశ్రమల సహకారంతో క్రీడాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. అంతర్జాతీయ వేదికలపై రాణించిన వారికి తగిన ప్రోత్సాహకాలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో శాట్‌జీ చైర్మన్ శివసేనారెడ్డి, క్రీడల సలహాదారు జితేందర్‌రెడ్డి, వేణుగోపాలచారి, క్రీడాశాఖ ప్రధాన కార్యదర్శి వాణిప్రసాద్, శాట్‌జీ ఎండీ సోనీబాలదేవి పాల్గొన్నారు.

అఫ్గానిస్థాన్ సహాయక కోచ్‌గా శ్రీధర్

న్యూఢిల్లీ: అఫ్గానిస్థాన్ క్రికెట్ జట్టు నూతన సహాయక కోచ్‌గా భారత్‌కు చెందిన ఆర్ శ్రీధర్ ఎంపికయ్యాడు. గతంలో టీమ్‌ఇండియాకు ఫీల్డింగ్ కోచ్‌గా పనిచేసిన శ్రీధర్ ఇక నుంచి అఫ్గన్ జట్టుకు సేవలందించనున్నాడు. వాస్తవానికి న్యూజిలాండ్‌తో ఏకైక టెస్టు, దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ కోసం తాత్కాలికంగా కొనసాగాలని చూసినా..అఫ్గన్ క్రికెట్ బోర్డు కోరిక మేరకు సహాయక కోచ్‌గా బాధ్యతలు తీసుకునేందుకు సిద్ధమయ్యాడు. వచ్చే నెల 9న జరిగే ఏకైక టెస్టులో కివీస్, అఫ్గన్ తలపడనున్నాయి. 2014 నుంచి 2021 వరకు శ్రీధర్..టీమ్‌ఇండియాతో కలిసి కొనసాగాడు.

యూటీటీ లీగ్‌కు వేళాయె..

నేటి నుంచి ప్రారంభం • బరిలో ఎనిమిది జట్లు




చెన్నై: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్(యూటీటీ) పోరుకు వేళయింది. గురువారం నుంచి చెన్నై జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం వేదికగా యూటీటీకి తెరలేవనుంది. ఇప్పటి వరకు కలిసికట్టుగా ఆడిన ప్లేయర్లు లీగ్‌లో ప్రత్యర్థులుగా తలపడనున్నారు. ఇటీవలే ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో ఆకట్టుకున్న మనికా బాత్రా, శరత్‌కమల్, హర్మీత్‌దేశాయ్ లాంటి ప్లేయర్లకు తోడు తెలంగాణ యువ ప్యాడ్లర్ ఎస్ఎఫ్ఆర్ స్నేహిత్ ఆయా ఫ్రాంచైజీల తరపున పోటీకి దిగనున్నారు. గత సీజన్‌కు భిన్నంగా ఈసారి ఎనిమిది జట్లు టైటిల్ కోసం పోరాడనున్నాయి. ఇందులో చెన్నై లయన్స్, అహ్మదాబాద్ ఎస్‌జీ పైపర్స్, దబాంగ్ ఢిల్లీ టీటీసీ, అథ్లెడ్ గోవా చాలెంజర్స్, జైపూర్ ప్యాట్రియాట్స్, పీబీజీ బెంగళూరు స్మాషర్స్, పుణెరీ పల్టాన్, యూముంబా ఉన్నాయి. మొత్తం 17 రోజుల పాటు టీటీ అభిమానులను అలరించనున్న లీగ్ సెప్టెంబర్ 7న ముగియనుంది. బుధవారం మీడియా సమావేశంలో అన్ని జట్లకు చెందిన ప్లేయర్లు పాల్గొని పలు అంశాలను పంచుకున్నారు.

ఆ ముగ్గురి వల్లే

టీ20 ప్రపంచకప్ గెలిచామన్న రోహిత్ • ద్రవిడ్, అగార్కర్, జైషాపై ప్రశంసలు

ముంబై: సుదర్ఘీ కలను సాకారం చేస్తూ భారత క్రికెట్ జట్టు టీ20 ప్రపంచకప్ గెలువడంలో ఆ ముగ్గురి పాత్ర కీలకమని కెప్టెన్ రోహిత్‌శర్మ పేర్కొన్నాడు. బుధవారం జరిగిన సీయెట్ కంపెనీ అవార్డుల ప్రదాన కార్యక్రమంలో రోహిత్ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచాడు. 17ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ టీమ్ ఇండియా టీ20 ప్రపంచకప్ గెలిచిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ పలు ఆసక్తికర అంశాలు పంచుకున్నాడు. మెగాటోర్నీ గెలువడంలో అప్పటి చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్, బోర్డు కార్యదర్శి జై షా ముగ్గురు మూడు పిల్లర్ల వలే వ్యవహరించారని పేర్కొన్నాడు. ఈ ముగ్గురి వల్లనే ఐసీసీ ట్రోఫీ కల సాకారమైందన్నాడు. ఇంటర్నేషనల్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు దక్కించుకున్న రోహిత్ మాట్లాడుతూ 'గణాంకాలు, ఫలితాల గురించి పెద్దగా ఆలోచించలేదు. అతిగా ఆలోచించకుండా ఎవరి పాత్ర వారు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకున్నాం. ఇందుకు జైషా, ద్రవిడ్, అగార్కర్ నుంచి నాకు పూర్తి సహకారం లభించింది. దీనికి తోడు ప్లేయర్లందరూ సమిష్టిగా రాణించడం కలిసివచ్చింది. దశాబ్ద కాలంగా ఐసీసీ ట్రోఫీ కల నెరవేరలేదన్న బాధ ప్రతీరోజు వేధిస్తుండేది. కానీ ప్రపంచకప్ గెలిచిన తర్వాత ప్రతీ సందర్భాన్ని ఆస్వాదించాలనుకున్నాం. అందుకు తగ్గట్లు దేశం మొత్తం సంబురాల్లో భాగం కావడం జీవితంలో మరిచిపోలేనిది. అది మాటల్లో వర్ణించలేము. బ్యాట్ల ఎంపిక విషయంలో నేను పెద్దగా ఆలోచించను. బాగుందనుకుంటే ఆడేస్తాను. విజయం రుచి తెలిసిన తర్వాత దాన్నుంచి బయట పడలేం. రానున్న రోజుల్లో కీలకమైన సిరీస్‌ల్లో ఆడాల్సి ఉంది' అని అన్నాడు. ఇదిలా ఉంటే కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, షమీ, ద్రవిడ్, హర్మన్‌ప్రీత్‌కౌర్, దీప్తిశర్మ అవార్డులు అందుకున్నారు.





పాక్ 158/4

బంగ్లాతో తొలి టెస్టు



రావల్పిండి: పాకిస్థాన్, బంగ్లాదేశ్ మధ్య తొలి టెస్టు పోరు ఆసక్తికరంగా సాగుతున్నది. వర్షం అంతరాయం కారణంగా దాదాపు నాలుగున్నర గంటల పాటు ఆలస్యంగా మొదలైన తొలి టెస్టులో మొదటి రోజు ఆట ముగిసే సరికి పాక్ 4 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న బంగ్లా..పాక్‌కు ఆదిలోనే ముచ్చెమటలు పట్టించింది. పచ్చని పిచ్‌పై బంగ్లా బౌలర్లు చెలరేగడంతో పాక్ 16 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ అబ్దుల్లా షఫీక్(2), కెప్టెన్ షాన్ మసూద్(6), బాబర్ ఆజమ్(0) వెంటవెంటనే ఔటయ్యారు. ఈ తరుణంలో సయిమ్ ఆయూబ్(56), సౌద్ షకీల్(57నాటౌట్) జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు కలిసి బంగ్లా బౌలర్లను సమర్థంగా నిలువరిస్తూ నాలుగో వికెట్‌కు 98 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. షకీల్‌తో పాటు రిజ్వాన్(24) క్రీజులో ఉన్నాడు. షరీఫుల్ ఇస్లాం(2/30), హసన్(2/33) రెండేసి వికెట్లు తీశారు.

ఫుట్‌బాల్ చాంప్ నిజామాబాద్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 10వ సీనియర్ మహిళల అంతరజిల్లాల ఫుట్‌బాల్ టోర్నీలో నిజామాబాద్ విజేతగా నిలిచింది. బుధవారం నిజామాబాద్, మెదక్ మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగాల్సి ఉన్నా..ఎడతెరిపిలేని వర్షం కారణంగా ఆట సాధ్యం కాలేదు. దీంతో టాస్ ద్వారా నిజామాబాద్ విజేతగా నిలువగా, మెదక్ టీమ్ రన్నరప్‌తో సరిపెట్టుకుంది. పోటీల ముగింపు కార్యక్రమానికి టీఎఫ్ఏ కార్యదర్శి జీపీ పాల్గుణ హాజరయ్యారు.



లిమా(పెరూ) వేదికగా ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు జరిగే ప్రపంచ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ కోసం భారత జట్టు బుధవారం న్యూఢిల్లీ నుంచి బయల్దేరి వెళ్లింది. యువ జట్టుకు తెలంగాణకు చెందిన నాగపురి రమేశ్ చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.